# భారత్ శక్తి®


Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 205 | హైదరాబాద్ | గురువారం 05-02-2026 | పేజీలు : 12 | వెల : 1.00



11లో

అండర్-19 వరల్డ్ కప్... ఫైనల్లోకి దూసుకెళ్లిన టీమిండియా... ఇంగ్లండ్ తో అమీతుమీకి సై


11లో

తెలంగాణలో కొత్త విద్యుత్ కనెక్షన్ల

## జారీలో మార్పులు

- కొత్త మార్గదర్శకాలు జారీ చేసిన విద్యుత్ నియంత్రణ మండలి
- గతంలో దూరాన్ని బట్టి ఫీజు వసూలు చేసేవారు
- రేపటి నుంచి ఫిక్స్డ్ ఛార్జీలు వసూలు

కేసీఆర్.. నువ్వెలా

# జాతిపిత అవుతావు?

- పదేళ్లు అధికారంలో ఉండి రాష్ట్రాన్ని దోచుకున్నారని మండిపాటు
- మొగుడు పెళ్లాం మాట్లాడుకున్నా ఫోన్ ట్యాపింగ్ చేశారని ఆగ్రహం
- బీఆర్ఎస్ నాయకులు దోపిడీదారులు అంటూ విమర్శలు చేసిన రేవంత్ రెడ్డి


11లో



తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ తరపున

## పవన్ కల్యాణ్ ప్రచారం

- పవన్ కల్యాణ్ ను కలిసిన కిషన్ రెడ్డి, రాంచందర్ రావు
- బీజేపీకి పవన్ మద్దతు ప్రకటించారన్న రాంచందర్ రావు
- బీజేపీ తరపున ప్రచారం చేయడానికి అంగీకరించారని వెల్లడి

11లో


11లో

తెలుగు రాష్ట్రాల్లో..

## భారీగా ఎయిడ్స్ మరణాలు

ఐటీ రంగంలో విస్తరిస్తున్న హెచ్ఐవీ

- 202024 మధ్య కాలంలో ఎయిడ్స్ కారణంగా దేశ వ్యాప్తంగా 1.81 లక్షల మంది మృతి
- ఏపీలో 32,642 మంది... తెలంగాణలో 11,498 మంది మృతి
- విదేశీ తరహా జీవనశైలి వల్ల ఐటీ రంగంలో విస్తరిస్తున్న వైరస్

రెండున్నర గంటలపాటు సాగిన

## చంద్రబాబు, పవన్ కల్యాణ్ సమావేశం

- ముగిసిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ భేటీ
- వైసీపీ కుట్రలు, కూటమి సమన్వయంపై ప్రధానంగా చర్చ
- రాజ్యసభ స్థానాలు, నామినేటెడ్ పదవుల భర్తీపై సమాలోచనలు
- క్షేత్రస్థాయిలో ఉమ్మడి కార్యాచరణకు నిర్ణయం


11లో



11లో

2.5 కోట్ల ఆధార్ కార్డులను

## డీయాక్టివేట్ చేసిన కేంద్రం

- గుర్తింపు మోసాలను అరికట్టేందుకు కేంద్రం చర్యలు
- దేశవ్యాప్తంగా మరణించిన 2.5 కోట్ల మంది ఆధార్ నంబర్ల రద్దు
- పార్లమెంటులో వెల్లడించిన కేంద్ర మంత్రి జితిన్ ప్రసాద
- ఆధార్ భద్రతకు బయోమెట్రిక్ లాక్, ఫేస్ అథెంటికేషన్ ఫీచర్లు
- డేటాబేస్ శుద్ధీకరణలో భాగంగా యూఐడీఏఐ ఈ నిర్ణయం

మైక్రో ఎంట్రప్రెన్యూర్లుగా వెనుకబడిన వర్గాలు..

# కార్యాచరణ సిద్ధం చేయాలన్న సీఎం

- వెనుకబడిన వర్గాలను మైక్రో ఎంట్రప్రెన్యూర్లుగా తీర్చిదిద్దాలని సీఎం ఆదేశం
- ఆదరణ-3 ద్వారా కులవృత్తులకు ఆధునిక పరికరాల పంపిణీకి చర్యలు
- రూ.60 కోట్ల సాస్కీ నిధులతో బీసీ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణం
- బీసీ హాస్టళ్లలో మార్చిలోగా ఆర్వో ప్లాంట్ల ఏర్పాటుకు నిర్ణయం
- 6 జ్యోతిరావు పూలే రెసిడెన్షియల్ స్కూళ్లను జూనియర్ కాలేజీలుగా అప్‌గ్రేడ్


11లో



## బూతుల నేతలకు పరామర్శలా? జగన్‌పై టీడీపీ నేతల ఎదురుదాడి

11లో

- జగన్ గుంటూరు పర్యటనపై టీడీపీ నేతల ఫైర్
- అంబటి కుటుంబాన్ని పరామర్శించడం ఓ డ్రామా అంటూ విమర్శలు
- బూతులు మాట్లాడిన వారిని సమర్థించడం జగన్‌కు తగదని హితవు
- దమ్ముంటే ప్రజా సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలని సవాల్
- తిరుపతి లడ్డూ నెయ్యిలో కల్తీ జరిగిందనడం పచ్చి నిజం అని ఉద్ఘాటన

భారత శక్తి

# అంతర్జాతీయ మార్కెట్‌లో భారత్ పైచేయి

భారత ఆర్థిక వ్యవస్థ అంతర్జాతీయ స్థాయిలో ఒక నూతన శకాన్ని ఆరంభించింది. ప్రపంచవ్యాప్తంగా అగ్రగామి దేశాలతో వరుసగా కుదుర్చుకుంటున్న వాణిజ్య ఒప్పందాలతో భారత్ తన ఆర్థిక వ్యూహాన్ని పూర్తిగా మార్చేస్తోంది. ముఖ్యంగా అమెరికాతో కుదిరిన తాజా చారిత్రక వాణిజ్య ఒప్పందం భారత్ ఆర్థిక చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోనుంది. ప్రపంచ స్థూల దేశీయ ఉత్పత్తిలో సగానికి పైగా వాటా కలిగిన దేశాలతో భారత్ ప్రస్తుతం వాణిజ్య బంధాలను కలిగి ఉండటం ఇక్కడ గుర్తించాల్సిన విషయం. కేవలం కొన్ని రోజుల వ్యవధిలోనే రెండు కీలకమైన అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాలపై సంతకాలు చేయడం ద్వారా దేశం తన వ్యూహాత్మక దౌత్యాన్ని అనుసరిస్తోంది. భారత్, అమెరికా మధ్య ట్రేడ్ డీల్ కు అంగీకారం జరిగిన తరువాత రష్యా చమురు కొనుగోలు హాట్ టాపిక్ అవుతోంది. అయితే రష్యా ముడి చమురును కొనడం పూర్తిగా ఆపివేయడం వల్ల ఇండియాకు సమస్యలు ఏర్పడవచ్చు. రేటింగ్ ఏజెన్సీ మూడీస్ ఫిబ్రవరి 3 తన నివేదికలో, భారత్ ఇటీవల నెలల్లో రష్యా నుండి ముడి చమురును కొనడం క్రమంగా తగ్గించిందని పేర్కొంది. అందుకు అమెరికానే కారణం అని తెలిసిందే. అయితే పూర్తి కొనుగోళ్లను ఒక్కసారిగా నిలిపివేస్తే ఆర్థికాభివృద్ధికి చాలా ఇబ్బందికరంగా ఉంటుంది. ఇది దేశంలో సరఫరా లోటుకు కారణంగా మారవచ్చు. చమురు ధరలు పెరిగి ద్రవ్యోల్బణంపై ప్రభావం చూపవచ్చు అని కొందరు నిపుణులు అంచనా వేశారు. ఎందుకంటే భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద చమురు దిగుమతిదారులలో ఒకటి. అమెరికాతో డీల్ కోసం భారత్ కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తుంది. రష్యా నుంచి కాకుండా ఇతర దేశాల నుంచి చౌక ధరకు ముడి చమురు కొనడం సవాల్‌గా మారనుంది. ఇది ప్రపంచ వ్యాప్తంగా ధరల పెరుగుదలకు కారణం అవుతుందని, భారత్ వంటి అతిపెద్ద దిగుమతి చేసుకునే దేశంలో ద్రవ్యోల్బణం పెరిగే ప్రమాదం ఉందని మూడీస్ స్పష్టంగా పేర్కొంది. ఆర్థికాభివృద్ధిలో ఇబ్బందులను నివారించడానికి భారతదేశం వెంటనే అన్ని రష్యా నుంచి ముడి చమురు కొనుగోళ్లను ఆపివేసే అవకాశం లేదని ఏజెన్సీ తెలిపింది. అమెరికా భారత వస్తువులపై టారిఫ్ 50 శాతం నుండి 18 శాతానికి తగ్గించిన వాణిజ్య ఒప్పందం కోసం వచ్చింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, భారత్ త్వరలో రష్యా చమురును కొనడం ఆపివేస్తుందన్నారు. ఇకనుంచి వెనిజులా నుండి ఎక్కువ చమురును కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు. భారత్ అమెరికా నుండి 500 బిలియన్ డాలర్లకు పైగా ఉత్పత్తులను కొనుగోలు చేస్తుందని, ఇందులో ముడి చమురు కూడా ఉంటుందని ట్రంప్ అన్నారు. అయితే, ప్రధాని మోదీ మాత్రం టారిఫ్ తగ్గించడంపై మాత్రమే మాట్లాడారు. కానీ రష్యా చమురును ఆపివేయడం గురించి స్పష్టత ఇవ్వలేదు. రష్యా చమురు కొనుగోలు కారణంగా విధించిన అదనపు 25 శాతం పెనాల్టీ సుంకాన్ని తొలగించారని, అలాంటి కొనుగోళ్లను ఆపివేయడానికి భారత్ అంగీకరించిందని వైట్ హౌస్ అధికారి పేర్కొన్నారు. అయితే, మూడీస్ విశ్లేషణ ప్రకారం, భారత్ ఈ మార్పును నెమ్మదిగా అమలు చేస్తుంది, ఎందుకంటే తక్షణ మార్పు భారత్ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. ఈ ఒప్పందం ఆభరణాలు, రత్నాలు, టెక్స్‌టైల్ వంటి రంగాలలో భారత ఎగుమతులకు ప్రయోజనం చేకూరుస్తుంది, ఎందుకంటే అమెరికా భారత్‌కు అతిపెద్ద ఎగుమతి మార్కెట్. డీల్ ప్రకటన తర్వాత, స్టాక్ మార్కెట్లో జోరు కనిపించింది. నిఫ్టీ దాదాపు 3 శాతం పెరగగా, రూపాయి బలపడి డాలర్‌కు 90.40 వద్దకు చేరుకుంది. భారత్ వాణిజ్య శాఖ గడిచిన 12 నెలల్లో అత్యంత చురుగ్గా వ్యవహరించింది. అమెరికాతో కుదిరిన తాజా ఒప్పందానికి కొద్ది రోజుల ముందే భారత్, యూరోపియన్ యూనియన్‌తో ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్‌పై సంతకాలు చేసింది. ఒకే సంవత్సరంలో ప్రపంచంలోని రెండు అతి పెద్ద ఆర్థిక శక్తులతో కుదుర్చుకోవడం భారత ఆర్థిక చరిత్రలో ఇదే తొలిసారి. వీటితోపాటు బ్రిటన్, ఓమన్, న్యూజిలాండ్‌తో కూడా భారత్ వాణిజ్య ఒప్పందాలను పూర్తి చేసుకుంది. ఈ ఐదు దేశాలు సహా భారత్‌కు చెందిన మొత్తం జీడీపీని లెక్కిస్తే అది ప్రపంచ మొత్తం జీడీపీలో సుమారు 50 నుంచి 55 శాతం వరకు ఉంటుంది. కేవలం భారత్, యూరోపియన్ యూనియన్ వాటానే ప్రపంచ జీడీపీలో 25 శాతంగా ఉంది. గణాంకాలు అంతర్జాతీయ మార్కెట్‌లో భారత్ ఎదుగుతున్న శక్తిని స్పష్టం చేస్తున్నాయి. ఈ ఒప్పందం భారత్‌కు పొరుగు దేశాలైన బంగ్లాదేశ్ వియత్నాం, థాయ్‌లాండ్‌లతో పోలిస్తే గొప్ప పోటీతత్వాన్ని కల్పించనుంది. ప్రస్తుతం అమెరికా విధించిన కొత్త నిబంధనల ప్రకారం... బంగ్లాదేశ్‌పై 20 శాతం, వియత్నాం 20 శాతం, థాయిలాండ్‌పై 19 శాతం టారిఫ్‌లు ఉన్నాయి. కానీ భారత్‌కు ఇది కేవలం 18 శాతానికి తగ్గడం వల్ల అమెరికా మార్కెట్‌లో భారతీయ వస్తువుల ధరలు తగ్గి గిరాకీ పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అమెరికా ప్రథమ స్థానంలో ఉండగా, యూరోపియన్ యూనియన్ ద్వితీయ స్థానంలో ఉంది. భారత్ ఇప్పటికే ప్రపంచంలో నాల్గో అతి పెద్ద ఆర్థికవ్యవస్థగా ఉంది. బ్రిట్ కూడా టాప్ -5 ఆర్థిక వ్యవస్థల జాబితాలో కొనసాగుతోంది. ఈ ప్రభావవంతమైన ఆర్థిక శక్తులన్నీ ఇప్పుడు భారత్‌తో దృఢమైన వాణిజ్య బంధాన్ని కలిగి ఉన్నాయి. ప్రపంచ మొత్తం వాణిజ్యంలో ఈ కూటమి వాటా 38 నుంచి 40 శాతం వరకు ఉన్నట్టు లెక్కలు చూస్తున్నాయి. ఇవే కాకుండా, భారత్ ఇప్పటికే జపాన్, దక్షిణ కొరియా, ఆసియాన్ దేశాలు, సార్క్ దేశాలు, మారిషస్, యూఏఈ , ఆస్ట్రేలియా వంటి దేశాలతో ప్రాంతీయ, స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను కలిగి ఉంది. తాజా ఒప్పందాలతో భారత తయారీ రంగం సేవా రంగానికి అంతర్జాతీయ మార్కెట్లు భారీగా అందుబాటులోకి రానున్నాయి.

# ఆ మూడు సీట్లు దక్కేదెలా

విజయవాడ, ఫిబ్రవరి 04 (భారత శక్తి):

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఇప్పటికీ ఒక లోటు ఉంది. రాష్ట్రమంతటా గెలిచామని ఆ పార్టీ భావిస్తోంది. కానీ ఓ మూడు చోట్ల మాత్రం ఆ పార్టీకి ఇప్పటివరకు విజయం దక్కలేదు. జగన్ ప్రభంజనంలో సైతం ఆ మూడు చోట్ల టిడిపి విజయం సాధించింది. విజయవాడ, గుంటూరు, శ్రీకాకుళం పార్లమెంట్ స్థానాల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్నో రకాల ప్రయోగాలు చేసింది. కానీ ఆ ప్రయోగాలు ఏవి ఫలించలేదు. ఎప్పటికప్పుడు అభ్యర్థులను మార్చింది. ఆ మార్పు ఎంతవరకు కూడా లాభం చేకూర్చలేదు. పైగా ఎంపీలుగా పోటీ చేసిన వైసీపీ నేతలకు అడ్రస్ లేకుండా పోయింది. రాజకీయ జీవితం లేకుండా పోయింది. ముఖ్యంగా విజయవాడ నుంచి పోటీ చేసిన ముగ్గురు నేతలు వైసీపీలో లేకుండా పోయారు. అందుకే ఇప్పుడు బలమైన అభ్యర్థిని రంగంలోకి దించాలని చూస్తున్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఎవరూ చిక్కడం లేదు. విజయవాడలో పోటీ అంటేనే నేతలు భయపడిపోతున్నారు. 2014లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇక్కడ బలమైన అభ్యర్థి అవుతారని భావించి.. పారిశ్రామికవేత్త కోనేరు ప్రసాద్ ను రంగంలోకి దించింది. అంతకు ముందు రెండు ఎన్నికల్లో ఇక్కడ తెలుగుదేశం పార్టీ ఓడిపోవడంతో.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఎక్కువగా ఉంటుందని భావించింది. కానీ వైసీపీ లెక్కలు తప్పాయి. టిడిపి అభ్యర్థి కేసినేని నాని ఘనవిజయం సాధించారు. అయితే ఆ ఎన్నికల తరువాత కోనేరు ప్రసాద్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలకు దూరమయ్యారు. రాజకీయాలకు సైతం గుడ్ బై చెప్పారు. 2019 ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించింది. అయితే అప్పట్లో కూడా విజయవాడ పార్లమెంటు స్థానం దక్కించుకోలేకపోయింది. రెండోసారి టిడిపి అభ్యర్థిగా పోటీ చేసిన కేసినేని నాని ఇక్కడ ఘనవిజయం సాధించారు. ఆర్థిక బలం ఉన్న పొట్లూరు వరప్రసాద్ ను రంగంలోకి దించింది. ఆయన ప్రముఖ నిర్మాతగా కొనసాగుతుండగా పార్టీ అభ్యర్థిగా ప్రకటించారు జగన్. అయితే రాష్ట్రమంతటా ప్రభంజనం వీచింది కానీ .. విజయవాడలో మాత్రం టిడిపి అభ్యర్థి కేసినేని నాని గెలిచి పట్టు నిలుపుకున్నారు. అయితే ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత పొట్లూరు వరప్రసాద్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి దూరమయ్యారు. క్రమేపి రాజకీయాలకు సైతం గుడ్ బై చెప్పారు. 2024 ఎన్నికల్లో అనూహ్యంగా రెండుసార్లు ఎంపీగా పోటీ చేసి గెలిచిన కేశినేని నాని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు. అంతకుముందు రెండుసార్లు గెలిచేసరికి అదంతా తన చరిష్మ అన్నట్టు భావించారు. అయితే ఆయన పై టిడిపి అభ్యర్థిగా తమ్ముడు కేసినేని చిన్ని పోటీ చేసి గెలిచారు. దీంతో క్రియాశీలక రాజకీయాలకు గుడ్ బై చెబుతున్నట్లు కేశినేని నాని ప్రకటించారు. అయితే విజయవాడలో పోటీ చేస్తున్న వారంతా ఇలా రాజకీయాలకు గుడ్ బై చెప్పడం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి సెంటిమెంట్ గా మారింది. అక్కడ పోటీ చేసేందుకు ఎవరు ముందుకు రాని పరిస్థితి నెలకొంది.

# ఏపీ చరిత్రలో సరికొత్త అధ్యాయం
## 6న క్వాంటమ్ వ్యాలీకి భూమి పూజ

విజయవాడ, ఫిబ్రవరి 04 (భారత శక్తి):




ఆంధ్రప్రదేశ్ చరిత్రలో సరికొత్త అధ్యాయం ప్రారంభం కాబోతోంది.. చంద్రబాబు కలల ప్రాజెక్ట్‌కు సంబంధించి కీలక ముందడుగు పడబోతోంది. ఈ నెల 6న అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ నిర్మాణాలకు సంబంధించి భూమిపూజ చేయనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా సమీక్షించారు. ఈ నెల 6న ఉదయం 11 గంటలకు ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా అమరావతిలో భూమిపూజ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు కలల ప్రాజెక్ట్ క్వాంటమ్ వ్యాలీ దిశగా మరో కీలక ముందడుగు పడింది. అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ నిర్మాణాలకు సంబంధించిన భూమిపూజకు ముహూర్తం ఫిక్స్ అయ్యింది. ఈ నెల 6న ఉదయం 11 గంటలకు అమరావతిలోని ఉద్దండరాయునిపాలెం సమీపంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా ప్రతిష్ఠాత్మకంగా నిర్మించనున్న క్వాంటమ్ వ్యాలీ నిర్మాణాలకు భూమిపూజ కార్యక్రమం నిర్వహిస్తారు. ఈ క్వాంటమ్ వ్యాలీ ప్రాజెక్ట్ కోసం ఏపీ ప్రభుత్వం 50 ఎకరాల భూమిని కేటాయించిన సంగతి తెలిసిందేమరోవైపు అమరావతిలో ఏఐ లివింగ్ ల్యాబ్స్ పేరుతో ఓ యూనివర్సిటీ ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు ఐటీశాఖ ప్రతిపాదనపై ఇవాళ జరిగే కేబినెట్ సమావేశంలో చర్చిస్తారు. ఈ వర్సిటీలో స్కూల్ విద్యార్థుల నుంచి పీజీ వరకు ఏఐలో విద్యా బోధన ఉండేలా ప్లాన్ చేస్తున్నారు. అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ రానుండటంతో ఈ వర్సిటీ అనుబంధంగా ఉంటుందని చెబుతున్నారు. అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ ఓ గేమ్ ఛేంజర్ అంటోంది ప్రభుత్వం. ఇటీవల 14మంది ప్రముఖ నిపుణులతో రెండు కమిటీలను కూడా నియమించిన సంగతి తెలిసిందే. రాబోయే రోజుల్లో మరిన్న కంపెనీలను ఆకర్షించాలని భావిస్తున్నారు. రాబోయే రోజుల్లో భారీగా పెట్టుబడులు, ఉద్యోగాలు రావడం ఖాయం అంటున్నారు. ప్రపంచవ్యాప్తంగా అందరూ క్వాంటమ్ టెక్నాలజీపై ఫోకస్ పెట్టారని చంద్రబాబు చెబుతున్నారు. అమరావతి క్వాంటమ్ వ్యాలీ ఆధునిక పరిశోధనలకు కేంద్రంగా మారబోతోందన్నారు. ఏకంగా లక్ష మంది నిపుణుల తయారీ లక్ష్యమని చెప్పుకొచ్చారు. ఇప్పటికే క్వాంటమ్ శిక్షణకు సంబంధించి 50వేలమంది విద్యార్థులు, ఐటీ ఉద్యోగులు రిజిస్టర్ చేసుకున్న విషయాన్ని ప్రస్తావించారు. రాబోయే రోజుల్లో క్వాంటమ్ టెక్నాలజీపై మరింత ఫోకస్ పెడతామన్నారు. ఒకవేళ ఎవరైనా క్వాంటం టెక్నాలజీ ద్వారా నోబుల్ ప్రైజ్ దక్కించుకుంటే వారికి రూ. 100 కోట్లు నజరానా ఇస్తామని చంద్రబాబు ప్రకటించిన సంగతి తెలిసిందే. అంతేకాదు ఏపీ ప్రభుత్వం ప్రత్యేకంగా క్వాంటమ్ కంప్యూటింగ్ పాలసీని రూపొందించిన విషయం తెలిసిందే. అభివృద్ధి, స్టార్టప్‌ల ఏర్పాటును ప్రోత్సహించేందుకు ఈ నిర్ణయం తీసుకుంది.

# మళ్లీ...బూతులతో రాజకీయాలు

గుంటూరు, ఫిబ్రవరి 04 (భారత శక్తి):

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో చోటుచేసుకుంటున్న పరిణామాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఎన్నికల విజయం తర్వాత అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి సారించాల్సిన సమయంలో.. వీధుల వెంట జరుగుతున్న దాడులు, ప్రతిదాడులు రాష్ట్ర భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకునేలా చేస్తున్నాయి. ముఖ్యంగా మాజీ మంత్రులు అంబటి రాంబాబు, జోగి రమేశ్‌ల చుట్టూ తిరుగుతున్న తాజా పరిణామాలు ప్రజాస్వామ్యవాదులను విస్మయానికి గురిచేస్తున్నాయి. నిన్న అంబటి రాంబాబు ముఖ్యమంత్రి చంద్రబాబుపై చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. రాజకీయ విమర్శలు హుందాగా ఉండాల్సింది పోయి, బూతులతో కూడిన విమర్శలు చేయడం ఖచ్చితంగా గర్హనీయం. దీనిపై టీడీపీ శ్రేణులు భగ్గుమనడం సహజమే అయినప్పటికీ, చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని ఆయన ఇంటిపై దాడి చేయడం సమర్థనీయం కాదు. పోలీసులు రంగప్రవేశం చేసి అంబటిని అరెస్ట్ చేయడంతో ఆ వివాదం ముగిసిందనుకున్న తరుణంలో, నేడు మరో కొత్త మంట రాజుకుంది. మంత్రి నారా లోకేశ్‌పై జోగి రమేశ్ చేసిన విమర్శలను సాకుగా చూపి టీడీపీ శ్రేణులు ఆయన ఇంటికి నిప్పు పెట్టడం అత్యంత దారుణమైన విషయం. అంబటి చేసిన వ్యక్తిగత దూషణలతో పోలిస్తే, జోగి రమేశ్ చేసినవి రాజకీయ విమర్శలుగానే పరిగణించవచ్చు. కానీ, చిన్న విమర్శను కూడా సహించలేక ఇళ్లకు నిప్పు పెట్టే స్థాయికి రాజకీయాలు దిగజారడం ఆందోళనకరం. "వైసీపీ హయాంలో జరిగిన అరాచకాలపై విసుగు చెందే ప్రజలు టీడీపీకి పట్టం కట్టారు. మళ్ళీ అదే పద్ధతులను టీడీపీ కేడర్ అనుసరిస్తే.. గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి తేడా ఏముంటుంది?" అనే ప్రశ్న ఇప్పుడు సామాన్య ప్రజల నుంచి వినిపిస్తోంది.

ముఖ్యమంత్రి చంద్రబాబు అనుభవజ్ఞుడు, సంయమనం పాటించే వ్యక్తి. ఆయన ఎప్పుడూ అభివృద్ధి, వ్యవస్థల ప్రక్షాళన గురించి మాట్లాడుతుంటారు. అయితే, పార్టీ కేడర్ మాత్రం నాయకుడి మౌనాన్ని 'చేతగానితనం'గా భావిస్తున్నట్టు కనిపిస్తోంది.

"మాపై దాడులు జరిగినప్పుడు మేం భరించాం, ఇప్పుడు మా టైమ్ వచ్చింది" అనే పగతో రగిలిపోతున్న కేడర్, చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుంటోంది. రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపు తప్పితే, పెట్టుబడులు రావు సరి కదా.. ఉన్న కంపెనీలు కూడా తరలిపోయే ప్రమాదం ఉంది. కేడర్ చేసే ఇటువంటి పనులు చివరకు ప్రభుత్వంపైనే మచ్చ తెస్తాయి. ఇది కేవలం ఒక పార్టీ కార్యకర్తల ఉద్రేకం మాత్రమే కాదు, రాష్ట్ర ప్రతిష్టకు సంబంధించిన అంశం.

ఈ విషయంలో చంద్రబాబు, లోకేశ్ తక్షణమే జోక్యం చేసుకోవాలి. చట్టాన్ని ఎవరూ చేతుల్లోకి తీసుకోకూడదని, అరాచకాలకు పాల్పడితే సొంత పార్టీ వారైనా ఉపేక్షించేది లేదని కఠిన సందేశం పంపాలి. గత ప్రభుత్వ అవినీతిపై లేదా దాడులపై విచారణ జరిపి, చట్టబద్ధంగా శిక్షించాలే తప్ప వీధి పోరాటాలు పరిష్కారం కావు. ప్రతిపక్షాలు కూడా నోటిని అదుపులో పెట్టుకుని మాట్లాడాలి.

బూతు పురాణాలతో రెచ్చగొట్టే ప్రయత్నం చేయడం వల్ల నష్టపోయేది వారే అని గ్రహించాలి. ప్రజలు మార్పును కోరుకుని ఓటేశారు. ఆ మార్పు అభివృద్ధిలో, పరిపాలనలో కనిపించాలే తప్ప దాడులలో కాదు. రాష్ట్రం వల్లకాడు కాకుండా ఉండాలంటే, ప్రభుత్వం తన ఉక్కుపాదాన్ని అరాచక శక్తులపై మోపాలి. అది ప్రతిపక్షమైనా, స్వపక్షమైనా సరే! శాంతియుత ఆంధ్రప్రదేశ్‌ను నిర్మించాల్సిన బాధ్యత ఇప్పుడు పాలకుల భుజస్కంధాలపై ఉంది.

# కాపు సామాజికవర్గం కోసం...

ఏలూరు, ఫిబ్రవరి 04 (భారత శక్తి):

2024 ఎన్నికల్లో వైసీపీ ఎందుకు పరాజయం పాలైందనే ప్రశ్నకు ఆ పార్టీ నేతలు, అనుచరులు వివిధ కారణాలు చెబుతున్నారు. కొందరు ఈవీఎంలు కారణమంటూ వ్యాఖ్యానించగా, మరికొందరు కూటమి పార్టీల ఐక్యత వల్ల ఓటమి వచ్చిందని అంటున్నారు. ఇంకొందరు సరైన ప్రచారం చేయలేకపోయామని స్వయంగా ఒప్పుకుంటున్నారు. బలమైన మీడియా ప్రభావం, చంద్రబాబు రాజకీయ వ్యూహాలే కారణమని విమర్శించే వర్గం కూడా ఉంది. ఇవన్నీ కొంతవరకు నిజమే కావచ్చు. కానీ అంతకంటే లోతైన సామాజిక, రాజకీయ అంశాలు కూడా ఈ ఓటమికి కారణమయ్యాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సామాజిక వర్గాల ప్రభావం ఎప్పటినుంచో కీలకం. ముఖ్యంగా గోదావరి జిల్లాలు రాష్ట్ర రాజకీయ దిశను నిర్ణయించే స్థాయిలో ఉంటాయి. 2024 ఎన్నికల్లో అదే జరిగింది. ఈ ప్రాంతంలో బలమైన కాపు సామాజిక వర్గం ఈసారి వైసీపీకి వ్యతిరేకంగా నిలిచింది. వారు పెద్ద ఎత్తున జనసేన వైపు మొగ్గు చూపారు. దీనికి ప్రధానంగా పవన్ కళ్యాణ్ ఆకర్షణ ఒక కారణంగా చెబుతున్నారు. అయితే వైసీపీ నేతలు అవసరానికి మించి పవన్‌పై విమర్శలు చేయడం వల్ల న్యూట్రల్ ఓటర్లు కూడా దూరమయ్యారని రాజకీయ వర్గాల్లో చర్చ జరిగింది. దాని ఫలితంగా ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో వైసీపీకి ఒక్క ఎమ్మెల్యే లేదా ఎంపీ సీటు కూడా దక్కలేదు. చరిత్రను చూస్తే కాంగ్రెస్? టీడీపీ ( పోటీ ఉన్న రోజుల నుంచే గోదావరి ప్రాంతాల్లో టీడీపీకి బలమైన పట్టు ఉంది. అప్పట్లో కొంతవరకు కాంగ్రెస్‌కు కూడా ఆధారం ఉండేది. ఇప్పుడు జనసేన కలిసి రావడంతో ఈ రెండు పార్టీల కలయిక మరింత బలపడింది. యాభై శాతానికి మించిన ఓటు బ్యాంకుతో ఈ జిల్లాలు కూటమికి కంచుకోటలుగా మారాయని అంటున్నారు. ప్రభుత్వం ఏర్పడి దాదాపు 20 నెలలు గడిచినా, అక్కడ వైసీపీ గ్రాఫ్ ఆశించిన స్థాయిలో పెరగలేదన్న మాట వినిపిస్తోంది. ఎన్నికల అనంతరం కాపు వర్గానికి చెందిన పలువురు కీలక నేతలు వైసీపీని వీడడం కూడా పార్టీకి దెబ్బగా మారింది.

మాజీ ఉప ముఖ్యమంత్రి ఆళ్ల నాని టీడీపీలో చేరారు. భీమవరం మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ పార్టీకి గుడ్‌బై చెప్పారు. పిఠాపురం మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబుజనసేనలో చేరారు. ఇలాంటి పరిణామాలతో పార్టీ శ్రేణుల్లో అసంతృప్తి పెరిగిందని అంటున్నారు. ఇటీవల రామచంద్రాపురం కు చెందిన రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ ( పార్టీ మారతారన్న ప్రచారం ఊపందుకుంది. తన కుమారుడికి భవిష్యత్తులో టికెట్‌పై స్పష్టత లేకపోవడం, అలాగే వైసీపీలో గెలుపు అవకాశాలపై సందేహాలు కారణాలుగా చెబుతున్నారు. ఇదే సమయంలో వంగా గీత (, ముద్రగడ కుటుంబం వంటి నేతల విషయంలో కూడా పుకార్లు వినిపిస్తున్నాయి. గోదావరి జిల్లాల్లో కూటమి ఐక్యత బలంగా ఉండటంతో ఎదురీదడం కష్టమని భావిస్తున్న కొందరు నేతలు కొత్త దారులు వెతుకుతున్నారని రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. రానున్న రోజుల్లో వైసీపీ ఈ పరిస్థితిని ఎలా మార్చుకుంటుందో చూడాల్సి ఉంది.

======================

# వైసీపీకి వరుస షాకులు

నెల్లూరు, ఫిబ్రవరి 04 (భారత శక్తి):

ఏపీలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలకు వరుస షాకులు తగులుతున్నాయి. తాజాగా మరో ఇద్దరు నేతలపై కేసులు నమోదయ్యాయి. మాజీ మంత్రి విడదల రజిని, మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అలాగే మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డికి పోలీసులు నోటీసులు అందించారు. సీఎం చంద్రబాబు, సోమిరెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ కాకాణిపై కేసులు నమోదు కాగా.. పోలీసులు నోటీసులు ఇచ్చారు. కాకాణి ఇంటికి వెళ్లి నోటీసులు అందజేశారు.ఏపీ రాజకీయాలు హాట్ హాట్‌గా సాగుతున్నాయి. తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి కేసు అధికార, విపక్ష పార్టీల మధ్య నిప్పు రాజేసింది. దీంతో మాటల తూటాలు, ఇళ్లపై దాడులు, కేసులు.. ఇలా ఏపీ రాజకీయం మొత్తం వేడెక్కిపోయింది. ఈ క్రమంలోనే విపక్ష వైసీపీ నేతలకు వరుస షాకులు తగులుతున్నాయి. ఇప్పటికే మాజీ మంత్రులు అంబటి రాంబాబు, జోగి రమేష్ మీద కేసులు నమోదు కాగా.. తాజాగా మరికొందరు మాజీ మంత్రులు కూడా కేసులు, నోటీసులతో ఉక్కిరిబిక్కిరయ్యే పరిస్థితి.తాజాగా మాజీ మంత్రి విడదల రజినీపై కేసు నమోదైంది. జనవరి 30వ తేదీన విడదల రజిని అనుచరులు, టీడీపీ నాయకుల మధ్య గొడవ జరిగింది. ఈ నేపథ్యంలో టీడీపీ నేతలు విడదల రజినీపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా యడ్లపాడు పోలీసులు విడదల రజినితో పాటుగా 21 మంది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలపై కేసు నమోదు చేశారు.మరోవైపు వైసీపీ నేత, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డికి పోలీసులు నోటీసులు ఇచ్చారు. కాకాణి ఇంటికి వెళ్లిన పోలీసులు.. ఆయనకు నోటీసులు అందించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ టీడీపీ నేతలు చేసిన ఫిర్యాదు ఆధారంగా.. కాకాణిపై కేసులు నమోదయ్యాయి. నెల్లూరు గ్రామీణం, మనుబోలు, పొదలకూరులో కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలోనే విచారణకు రావాలంటూ కాకాణి గోవర్ధన్ రెడ్డికి పోలీసులు నోటీసులు ఇచ్చారు.అటు వినుకొండ మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత బొల్లా బ్రహ్మనాయుడుపైనా కేసు నమోదైంది. వినుకొండ పోలీసులు బొల్లా బ్రహ్మనాయుడు మీద కేసు నమోదు చేశారు. జనవరి 31వ తేదీ వినుకొండలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో బొల్లా బ్రహ్మనాయుడు, ఇతర వైసీపీ నేతలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా తోపులాట జరగ్గా.. ఓ కానిస్టేబుల్‌ను వైసీపీ నేతలు తోసేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ ఘటనలో కానిస్టేబుల్ గాయపడినట్లు చెప్తున్నారు. ఈ కానిస్టేబుల్ ఫిర్యాదు ఆధారంగానే బొల్లా బ్రహ్మనాయుడుతో పాటుగా 27 మంది వైసీపీ నేతలపై వినుకొండ పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్లాన్ వర్కౌటవుతుందా

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆశించిన స్థాయిలో ప్రజల నుంచి స్పందన రావడం లేదు. తమ పార్టీ నేతలపై దాడులకు తెగబడుతున్నారని జగన్మోహన్ రెడ్డి చెప్పుకొచ్చారు. అయితే గతంలో జగన్ ఇలాంటి దాడుల విషయంలో వ్యవహరించిన తీరును ఇప్పటికీ ప్రజలు గుర్తు చేస్తున్నారు. వారికి గుర్తు లేకపోతే సోషల్ మీడియా గుర్తు చేస్తోంది. బీపీలు వస్తే పార్టీ కార్యకర్తలు, అభిమానులు దాడి చేస్తారు అన్న జగన్ మాటను ఎక్కువ మంది గుర్తు చేస్తున్నారు. అప్పట్లో టిడిపి నేత ఒక్కరూ బోస్ డీకే అనే పదాన్ని వాడారు. దానిని విచిత్రమైన బూతుగా మార్చారు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు. చివరకు జగన్మోహన్ రెడ్డి అదే మాటను వక్రీకరిస్తూ.. తనను అంత మాట అంటే అభిమానులకు బీపీ వచ్చి ఆ టిడిపి నేత ఇంటిపై పడ్డారని.. అందులో ఎంత మాత్రం తప్పు లేదని తేల్చేశారు. ఇప్పుడు మాజీ మంత్రి అంబటి రాంబాబు మీడియా సమక్షంలో, పోలీసుల సమక్షంలో చంద్రబాబుపై బూతు పదం ప్రయోగించారు. ఇప్పుడు కూడా బీపీ వచ్చింది అని చంద్రబాబు ప్రకటించలేదు. ఎంతవరకు ఆయన సంయమనం పాటించమని పార్టీ శ్రేణులను కోరేరే తప్ప ఇలా సమర్థించలేదు. అయితే తాజా పరిణామాలతో జగన్ వైఖరిని మరోసారి ప్రజల ముందు ఉంచుతోంది సోషల్ మీడియా. అయితే ఈ ఘటనతో పొలిటికల్ సెంటిమెంటు రగిలించాలని వైసీపీ భావించింది. కానీ దానికి ఎంత మాత్రం ప్రజలు అవకాశం ఇవ్వడం లేదు.మొన్నటికి మొన్న కల్తీ మద్యం వ్యవహారం జరిగింది. ప్రభుత్వానికి చెడ్డ పేరు వచ్చేలా వైసీపీ నేతలే ప్లాన్ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ప్రధానంగా మాజీ మంత్రి జోగి రమేష్ పేరు బయటకు వచ్చింది. ఈ కుట్రలో ఆయన భాగస్వామ్యం అయ్యారని నిర్ధారణ కావడంతో కోర్టు రిమాండ్ విధించింది. ఆ కేసు విచారణ అలా కొనసాగుతుండగానే ఆయన బెయిల్ పై బయటకు వచ్చారు. ఇప్పుడు అదే నేత నిత్యం లోకేష్ పై విరుచుకు పడుతూనే ఉన్నారు. అంబటి రాంబాబు కంటే దారుణంగా వ్యాఖ్యానాలు చేశారు. అయితే జోగి రమేష్ ఇంటి పై దాడి జరిగింది. కానీ ప్రజల నుంచి మాత్రం సానుభూతి లభించడం లేదు. అంబటి రాంబాబు ఇంటిపై దాడి విషయంలో కూడా ప్రజలు లైట్ తీసుకుంటున్నారు. ఎందుకంటే ఆ ఇద్దరు నేతలు అత్యంత వివాదాస్పదులే. ఈ ఘటనల ద్వారా వైసీపీ రాజకీయ లబ్ధి పొందాలనుకోవడం అంటే అంతకంటే మూర్ఖత్వం ఉండదు. వారి వల్ల మరింత చెడ్డ పేరు వస్తుందే కానీ.. ప్రజలు మాత్రం గుర్తించే ఛాన్స్ లేదు. దానిని జగన్ గుర్తించడం లేదు.ఏదైనా ప్రజా సమస్యలపై పోరాటం చేయవచ్చు కదా. సీనియర్ నేతలను ముందు పెట్టి ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించవచ్చు కదా? అయితే దానిని వదిలేసి ఇలా అంబటి రాంబాబు, జోగి రమేష్ లాంటి వారితో రాజకీయాలు చేయాలనుకోవడం మూర్ఖత్వమేనని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రజలు ఇటువంటి వారితో రాజకీయం చేస్తామంటే హర్షించరంటున్నారు. ఎందుకంటే రాజకీయాల్లో వీరు వ్యవహరించిన తీరు తెలిసినదే. అధికారంలో ఉన్నప్పుడు వీరు ఎంతలా తెగించి, దూకుడుగా వ్యవహరించారో తెలియనిది కాదు. అటువంటివారితో రాజకీయాలు చేయడం ఎంత మాత్రం సహేతుకం కాదని పార్టీలో సీనియర్ నేతలు సైతం అభిప్రాయపడుతున్నారు. కానీ జగన్మోహన్ రెడ్డి వారిద్దరిపై ఆధారపడి, ఆ రెండు ఘటనలపై పోరాటం ప్రారంభించడం అనేది నిజంగా సాహసమే.

# ఇక బెంగళూరు ఆరుగంటలే

కర్నూలు, ఫిబ్రవరి 04 (భారత శక్తి):

ఏపీలో నేషనల్ హైవే ప్రాజెక్టుల పనులు వేగవంతం అయ్యాయి. స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు రంగంలోకి దిగి ఇటీవల ప్రాజెక్టుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్, బెంగళూరు, చెన్నైకు కనెక్టివిటీకి సంబంధించి ప్రాజెక్టులపై ఆరా తీశారు. ఈ క్రమంలో నంద్యాల జిల్లాలో 167కే హైవే పనులు వేగవంతం చేశారు. ఈ నేషనల్ హైవే అందుబాటులోకి వస్తే బెంగళూరు తర్వగా వెళ్లొచ్చు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారుల నిర్మాణంపై ఫుల్ ఫోకస్ పెట్టింది. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించారు.. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ప్రాజెక్టులకు సంబంధించిన పనుల్ని వేగవంతం చేయాలని సూచించారు. ఈ క్రమంలో బెంగళూరుకు కనెక్ట్ చేసే కీలకమైన నేషనల్ హైవే (167కే) పనులు స్పీడ్ అందుకున్నాయి. ప్రస్తుతం నంద్యాల నుంచి కోవెలకుంట్ల మీదుగా నొస్సం వరకు 62 కిలో మీటర్ల హైవే పనులు చేపట్టారు.. అక్కడి నుంచి జమ్మలమడుగు కడప రోడ్డుకు కనెక్ట్ చేయనున్నారు. ఈ హైవే అందుబాటులోకి వస్తే.. 60 నుంచి 65 కిలో మీటర్ల దూరం తగ్గుతుందని.. బెంగళూరుకు 6 గంటల్లోపు వెళ్లొచ్చంటున్నారు.ఈ జాతీయ రహదారి 167కే నిర్మాణం కోసం 691.81 కోట్లు విడుదల చేశారు.. మొత్తం 486 ఎకరాల భూమిని సేకరించారు. నంద్యాల జిల్లాలోని ఆరు మండలాల్లోని (కోవెలకుంట్ల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు, నంద్యాల, సంజామల, గోస్పాడు) 22 గ్రామాల మీదుగా వెళుతోంది. మూడుచోట్ల బ్రిడ్జిలు.. అలాగే 158 చోట్ల కల్వర్టుల నిర్మాణం చేపట్టారు. ఈ హైవేలో నాలుగు ప్రాంతాల్లో బైపాస్‌లు (కోవెలకుంట్ల, రైతునగరం, నొస్సం, గోస్పాడు) కూడా నిర్మిస్తున్నారు. ఈ ఏడాది మార్చి నాటికి ఈ బైపాస్‌లు, కల్వర్టుల నిర్మాణ పనులు పూర్తవుతాయని భావిస్తున్నారు. బైపాస్‌లు అందుబాటులోకి వస్తే నంద్యాల నుంచి నొస్సం గంటలోపే వెళ్లొచ్చు.ఈ హైవే పూర్తిచేస్తే కర్నూలు, నంద్యాల జిల్లాల ప్రజలకు బెంగళూరుతో కనెక్టివిటీ పెరుగుతుంది. ఎందుకంటే రెండు జిల్లాల నుంచి బెంగళూరుకు వెళ్లేవారిలో.. ఐటీ ఉద్యోగులు, ఉపాధి కోసం వెళ్లేవారు, వ్యాపారులు ఉంటారు. వారందరికి ప్రయాణ సమయం తగ్గుతుంది. గతంలో బెంగళూరు వెళ్లాలంటే అవుకు, కొలిమిగుండ్ల మీదుగా తాడిపత్రి, అనంతపురం మీదుగా వెళ్లేవారు. అదే 167కే జాతీయ రహదారి అందుబాటులోకి వస్తే.. జమ్మలమడుగు, ముద్దనూరు మీదుగా తాడిపత్రి హైవేలో ట్రాఫిక్ సమస్యలు లేకుండా బెంగళూరుకు త్వరగా వెళతారు. అలాగే ఆర్ అండ్ బీ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిది కూడా కర్నూలు జిల్లా కావడంతో ఆయన కూ?డా ఈ హైవే పనుల్ని వేగవంతం చేయాలని అధికారుల్ని ఆదేశించారు. మొత్తం మీద బెంగళూరు వెళ్లేవారికి కీలకమైన హైవే పనులు ఊపందుకున్నాయి.

# మరో వివాదంలోమంచు ఫ్యామిలీ


తిరుపతి, ఫిబ్రవరి 04 (భారత శక్తి):



మంచు మోహన్ బాబు, మంచు విష్ణు మరోసారి వార్తల్లోకి ఎక్కారు. తిరుపతి లో మోహన్ బాబు యూనివర్సిటీ వద్ద ధర్నా చేస్తున్న ఎస్ ఎఫ్ ఐ సంఘం వాళ్ళను కిడ్నాప్ చేయించారని మోహన్ బాబు, మంచు విష్ణు, సతీష్ లపై తిరుచానూరు పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు అయ్యింది. రీసెంట్ గానే రేణిగుంట విమానాశ్రయం లో పోలీసులు సతీష్ ని అదుపులోకి తీసుకున్నారు. మరి ఇప్పుడు మోహన్ బాబు, మంచు విష్ణులను కూడా అదుపులోకి తీసుకుంటారో లేదో చూడాలి. పూర్తి వివరాల్లోకి వెళ్తే మోహన్ బాబు యూనివర్సిటీ లో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని చాలా కాలం నుండి ఆరోపణలు వస్తున్న సంగతి తెలిసిందే. మోహన్ బాబు చిన్న తనయుడు మంచు మనోజ్ కూడా ఈ విషయం పై పెద్ద పోరాటమే చేసాడు. కొట్లాట వరకు వెళ్లి పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కాల్సిన పరిస్థితి వచ్చింది.అయితే రీసెంట్ విద్యార్థి సంఘాలు కూడా మోహబ్ బాబు యూనివర్సిటీ ఎదుట ధర్నాలు చేయడం మొదలు పెట్టాయి. విద్యార్థుల నుండి అన్యాయంగా అధిక ఫీజులు వసూలు చేసారని, తక్షణమే వాళ్లకు ఆ ఫీజులను తిరిగి చెల్లించాలని నేతలు డిమాండ్ చేశారు. దీంతో ఆగ్రహించిన మోహన్ బాబు తన బౌన్సర్ల చేత వాళ్ళను కిడ్నాప్ చేయించినట్టు తెలుస్తోంది. కారులో వచ్చిన మోహన్ బాబు బౌన్సర్లు సినీ ఫక్కీలో విద్యార్థుల సంఘాల నేతలను ఎక్కించుకొని, మోహన్ బాబు ఫామ్ హౌస్ లో బంధించారు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే మోహన్ బాబు ఫామ్ హౌస్ కి వెళ్లి విద్యార్థుల సంఘం నేతలను విడిపించి బౌన్సర్లను అరెస్ట్ చేశారు. ఈ ఘటనకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియా లో బాగా వైరల్ అయ్యాయి. అయినప్పటికీ ఈ వ్యవహారం పై మోహన్ బాబు ఎలాంటి రెస్పాన్స్ కూడా ఇవ్వలేదు.విద్యార్థుల నుండి అక్రమంగా వసూలు చేసిన అదనపు ఫీజులను తిరిగి చెల్లించాలని ప్రభుత్వం ఆదేశించినప్పటికీ మోహన్ బాబు పట్టించుకోకపోవడం తో విద్యార్థులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు.ఈ నేపథ్యం లో వాళ్ళ బాధను అర్థం చేసుకున్న ఎాఈఎ సంఘం, మరియు ఇతర విద్యార్థుల సంఘాలు యూనివర్సిటీ వద్ద ధర్నా చేపట్టి విద్యార్థుల బాధని మోహన్ బాబు కి అర్థం చేసే ప్రయత్నం చేశారు. అలాంటి వాళ్లకు సర్దిచెప్పి పంపాల్సింది పోయి, అహంకారంతో ఇలా కిడ్నాప్ చేయడం అమానుషం అంటూ సోషల్ మీడియా లో నెటిజెన్స్ కామెంట్స్ చేస్తున్నారు.

# బిజెపి తొలితరం నేత, దక్షిణ భారతదేశం తొలి బీజేపీ ఎంపీ చందుపట్ల జంగారెడ్డి -నేడు ఆయన వర్ధంతి


( పెండ్యాల రామ్ కుమార్, మంథని )



బిజెపి తొలితరం నాయకుడు, దక్షిణ భారతదేశం తొలి బీజేపీ ఎంపీ చందుపట్ల జంగారెడ్డి.. ఈయన 1935, నవంబరు 18న అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఇప్పటి తెలంగాణ రాష్ట్రంలోని పరకాల గ్రామంలో జన్మించాడు. తెలంగాణ రాష్ట్రం వరంగల్ జిల్లా నివాసం హన్మకొండలో ఉన్నాడు. శ్రీమతి సుదేష్మాను 1953లో వివాహమాడాడు. తెలంగాణ ప్రాంతానికి హనుమకొండ నుంచే 1984 వరంగల్ జిల్లాలో కాదు అప్పటి మొత్తం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి లోక్ సభలో బీజేపీకి ప్రాతినిధ్యం వహించిన ఏకైక వ్యక్తి చందుపట్ల జంగారెడ్డి కావడం విశేషం. ఇక ఆ ఎన్నికల్లో వాజ్ పాయ్, అద్వానీ వంటి బీజేపీ అగ్రనాయకులందరూ పరాజయం పాలయ్యారు. ఆ భారతీయ జనతా పార్టీ జిల్లాలో మొదటి వ్యక్తి. జంగారెడ్డి కొద్ది రోజులు ప్రభుత్వ పాఠశాలలో హయ్యర్ సెకండరీ (టీచర్) బడిపంతులుగా పనిచేశాడు. పరకాల నియోజకవర్గం నుండి శాసనసభ్యునిగా భారతీయ జనసంఘ పార్టీ నుండి ఇండిపెండెంట్ బి. కైలాసం పై గెలిచి శాసనసభలో అడుగుపెట్టాడు. ఇదే పరకాల అసెంబ్లీ నియోజకవర్గం నుండి శాసనసభ్యునిగా మళ్ళీ భారతీయ జనసంఘ పార్టీ నుండి 1972లో పోటీచేసి పింగళి ధర్మా రెడ్డి చేతిలో ఓటమి చెందాడు. తరువాత 1978లో మళ్ళీ పింగళి ధర్మా రెడ్డి పై శాసనసభ్యునిగా మళ్ళీ భారతీయ జనసంఘ పార్టీ నుండి విజయం సాధించాడు. దీనికి వేదిక మాత్రం శాయంపేట అసెంబ్లీ నియోజకవర్గం అయింది. పరకాల అసెంబ్లీ నియోజకవర్గం ఎస్సి రిజర్వ్ కావడం మూలానా ఇద్దరు కూడా రెడ్డి సామాజికవర్గం వారు కావడం వలన పరకాల పక్కనే ఉన్న జనరల్ సీటు శాయంపేట అసెంబ్లీ నియోజకవర్గం నుండి తలపడ్డారు.1984 లో భాజపా 543 నియోజకవర్గాలలో కేవలం రెండింటిని గెలుపొందింది ఒకటి అవిభాజ్య ఆంధ్ర ప్రదేశ్ లోని హనుమకొండ కాగా, ఏకె పటేల్ అనే బీజేపీ అభ్యర్థి గెలుపొందిన గుజరాత్ లోని మెహ్సానా నియోజక వర్గం రెండోది. హనుమకొండ నుంచే కాదు మొత్తం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం నుంచి లోక్ సభలో బీజేపీకి ప్రాతినిధ్యం వహించిన ఏకైక వ్యక్తి చందుపట్ల జంగారెడ్డి. మాజీ ముఖ్యమంత్రిగా, కాంగ్రెస్‌లో కీలక నేతగా దేశంలోనే ఆర్థిక సంస్కరణలకు శ్రీకారం చుట్టిన దివంగత మాజీ ప్రధాని పాములపర్తి వెంకట నరసింహారావు పై 54వేల పైచిలుకు ఓట్లతో విజయం సాధించి దక్షిణ భారతదేశం తొలి బీజేపీ తొలి పార్లమెంటు సభ్యుడుగా హనుమకొండ నుండి జంగారెడ్డి ఎంపికయ్యాడు. దక్షిణ భారతదేశం నుంచి ఆయనే తొలి బీజేపీ ఎంపీ కావడం ఓ రికార్డు. ఆ సమయంలో స్థానికుడు కావడం వలన అభిమానంతో జనం జంగారెడ్డిని ఆదరించారు. ఆ విజయం చరిత్ర పుటల్లో భద్రంగా ఉంది. 1989,1991,1996లో కాంగ్రెస్ పార్టీ నుండి కమాలుద్దీన్ అహ్మద్ చేతిలో జంగారెడ్డి భారతీయ జనతా పార్టీ నుండి పోటీచేసి ఓటమి చెందారు. జంగారెడ్డి 87 యేళ్ళ వయసులో అనారోగ్యంతో బాధపడుతూ 2022, ఫిబ్రవరి 5న హైదరాబాదులో మరణించాడు. ఆయనకు కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

# మణిపూర్ కొత్త సీఎంగా కేమ్‌చంద్

ఇంపాల్, ఫిబ్రవరి 04 (భారత శక్తి):



మణిపూర్‌లో ఏడాదిగా కొనసాగుతున్న రాష్ట్రపతి పాలన త్వరలో ముగియనుంది. ఈ ఈశాన్య రాష్ట్రానికి కొత్త ముఖ్యమంత్రిగా బీజేపీ నేత యుమ్నమ్ కేమ్‌చంద్ సింగ్ ఎన్నికయ్యారు. కుకీ, మైతీ జాతుల మధ్య ఘర్షణలతో అట్టుడికిన రాష్ట్రంలో, బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేయాలని నిర్ణయించుకుంది. బీరేన్ సింగ్ సహా ఐదుగురి పేర్లు పరిశీలించిన తర్వాత కేమ్‌చంద్‌ను అధిష్ఠానం ఎంపిక చేసింది. దీంతో ఆయన మణిపూర్‌కు రెండో బీజేపీ సీఎం కానున్నారు. వచ్చే ఏడాది ఎన్నికలు జరగనున్నాయి.ఈశాన్య రాష్ట్రంలో మణిపూర్‌లో ఏడాదిగా కొనసాగుతోన్న రాష్ట్రపతి పాలన త్వరలోనే ముగిసి, ప్రజాస్వామ్య ప్రభుత్వం అధికారం చేపట్టనుంది. ఆ రాష్ట్ర కొత్త ముఖ్యమంత్రిగా యుమ్నమ్ కేమ్‌చంద్ సింగ్ (62) ఎన్నికయ్యారు. మంగళవారం జరిగిన బీజేపీ శాసనసభాపక్ష సమావేశంలో కేమ్‌చంద్‌ను తమ నాయకుడిగా బీజేపీ ఎమ్మెల్యేలు ఎన్నుకున్నారు. రెండేళ్లకుపైగా కుకీ, మైతీ తెగల మధ్య ఘర్షణలతో అట్టుడికిన మణిపూర్‌లో ఏడాది కిందట ముఖ్యమంత్రి పదవికి బీరేన్ సింగ్ రాజీనామా చేయడంతో అప్పటి నుంచి రాష్ట్రపతి పాలన కొనసాగుతోంది. మరో ఏడాదిలో ఎన్నికలు జరగనుండగా.. ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయాలని బీజేపీ నిర్ణయించుకుంది. ఈ క్రమంలో ముఖ్యమంత్రిగా కేమ్‌చంద్‌కు అవకాశం కల్పించింది. మణిపూర్ రాష్ట్రానికి రెండో బీజేపీ సీఎం కాబోతున్నారు. సీఎం రేసులో బీరేన్ సింగ్ సహా ఐదుగురు పేర్లు వినిపించగా.. కేమ్‌చంద్‌వైపు అధిష్ఠానం మొగ్గుచూపింది. మే 2023లో మైతీ, కుకీ తెగల మధ్య ఘర్షణలతో మణిపూర్‌లో హింస చెలరేగి వందల మంది ప్రాణాలు కోల్పోయారు. వేల మంది నిరాశ్రయులు కాగా.. ఆస్తులు భారీ ఎత్తున ధ్వంసమయ్యాయి.న్యూఢిల్లీలో బీజేపీ అగ్రనేతలు సమావేశమై మణిపూర్ కొత్త సీఎం ఎంపికపై చర్చించారు. అనంతరం ఇంఫాల్‌లో జరిగిన బీజేపీ లెజిస్లేటివ్ పార్టీ సమావేశంలో మాజీ స్పీకర్ అయిన కేమ్‌చంద్‌ను తమ నేతగా ఎన్నుకున్నారు. ఇక, కేమ్‌చంద్ సింగ్జామై నియోజకవర్గం నుంచి వరుసగా రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. తొలిసారి 2017 ఎన్నికల్లో గెలిచిన ఆయనకు స్పీకర్ పదవి వరించింది. ఐదేళ్ల పాటు పూర్తికాలం స్పీకర్‌గా కొనసాగారు. మళ్లీ 2022 మణిపూర్ అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ విజయం సాధించారు.మణిపూర్‌లో ప్రస్తుతం పరిస్థితులు చక్కబడినట్టు పైకి కనిపిస్తున్నా.. పది రోజుల కిందట తన భార్యను చూసేందుకు నేపాల్ నుంచి వచ్చిన మైతీ వ్యక్తిని దారుణంగా కాల్చి చంపారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. భార్యతో సంతోషంగా గడుపుతున్న అతడ్ని.. ముసుగులు ధరించి వచ్చిన కొందరు దుండగులు విచక్షణారహితంగా కాల్చి చంపారు.

# వికారాబాద్ లో వేడెక్కిన రాజకీయం

హైదరాబాద్, ఫిబ్రవరి 04 (భారత శక్తి):

పురపాలిక ఎన్నికలు సమీపించిన వేళ వికారాబాద్ జిల్లాలో రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. ఈ ఎన్నికల్లో రాజకీయ పార్టీలకే కాకుండా స్థిరాస్తి (రియల్ ఎస్టేట్) వ్యాపారుల పాత్ర మరింత కీలకంగా మారిందని తెలుస్తోంది. తాండూరు, వికారాబాద్, పరిగి, కొడంగల్ పురపాలికల్లో మొత్తం వందకు పైగా వార్డులు ఉండగా, వాటిలో 30 నుంచి 40 వార్డుల్లో స్థిరాస్తి వ్యాపారుల ప్రభావం స్పష్టంగా కనిపించనుంది. నేరుగా బరిలోకి దిగడం, లేదా అనుచరులను రంగంలోకి దించడం ద్వారా ఎన్నికల ఫలితాలను తమకు అనుకూలంగా మలచుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని సమాచారం.ఎన్నికల్లో నేరుగా పోటీ చేసి గెలవకపోయినా, రిజర్వేషన్ విధానం ప్రకారం ఛైర్మన్ పదవులు దక్కించుకోవచ్చన్న లెక్కలతో చాలామంది వ్యాపారులు ముందడుగు వేస్తున్నారు. వార్డుల ఫలితాల ఆధారంగా బలమైన కౌన్సిలర్ల మద్దతు సాధిస్తే, తర్వాత ఛైర్మన్ ఎన్నికలో కీలక పాత్ర పోషించవచ్చన్నది వారి వ్యూహం. అందుకే ఇప్పటి నుంచే అన్ని విధాలా సిద్ధమవుతూ రాజకీయ సమీకరణాలను తమవైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నారు.: తాండూరులో ఒక ప్రముఖ స్థిరాస్తి వ్యాపారి ఎన్నికల గోదాలోకి దిగకముందే తన వ్యూహాన్ని అమలు చేశారు. పోటీ చేయనున్న వార్డులో ఇంటింటికీ తిరుగుతూ ఓటర్లను కలిసి, స్థానిక సమస్యలపై చర్చించారు. ఓటు బ్యాంకు ఉన్న నాయకులను గుర్తించి వారికి తాయిలాలు ముట్టజెప్పినట్లు ప్రచారం సాగుతోంది. ఇదే పట్టణంలో ప్రధాన పార్టీ అభ్యర్థికి దీటుగా మరో పార్టీ నుంచి స్థిరాస్తి వ్యాపారి బరిలోకి దిగుతున్నారని సమాచారం. దీంతో తాండూరులో పోటీ మరింత ఉత్కంఠభరితంగా మారింది. వికారాబాద్ పట్టణంలో కొన్ని వార్డుల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల ఖర్చులను స్థిరాస్తి వ్యాపారులు భరిస్తున్నారన్న ప్రచారం జోరుగా వినిపిస్తోంది. ప్రచారం, సభలు, వాహనాలు, కార్యకర్తల నిర్వహణ వంటి అంశాలకు భారీగా ఖర్చు అవుతుండటంతో అభ్యర్థులు వ్యాపారులపై ఆధారపడాల్సి వస్తోంది. దీని ద్వారా వ్యాపారులు భవిష్యత్తులో పురపాలిక నిర్ణయాల్లో తమ మాట చెల్లుబాటు అయ్యేలా చేసుకోవాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. కొడంగల్, పరిగి పురపాలికల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. కొన్నిచోట్ల వ్యాపారులు స్వయంగా పోటీ చేస్తుండగా, మరికొన్నిచోట్ల అనుచరులను బరిలోకి దింపుతున్నారు. స్థానిక రాజకీయ నాయకులతో పొత్తులు పెట్టుకుని, గెలుపు కోసం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. ఈ పరిణామాలు పురపాలిక రాజకీయాలపై స్థిరాస్తి రంగం ఎంత ప్రభావం చూపుతోందో సూచిస్తున్నాయి.వికారాబాద్ జిల్లా పురపాలికలకు హైదరాబాద్‌తో ఉన్న అనుసంధానం స్థిరాస్తి వ్యాపారుల రాజకీయ ఆసక్తికి ప్రధాన కారణంగా మారింది. హైదరాబాద్ నుంచి 78 నుంచి 119 కిలోమీటర్ల దూరంలోనే ఈ పట్టణాలు ఉన్నాయి. రాజధాని పరిసరాల్లో ఎకరం భూమి ధర రూ.100 కోట్లకు పైగా పలుకుతుండగా, ఈ పురపాలికల సమీపంలోని భూములు రూ.50 లక్షల నుంచి రూ.కోటి వరకు మాత్రమే ఉన్నాయి. ఈ ధరల తేడానే పెట్టుబడిదారులను ఇక్కడికి ఆకర్షిస్తోంది. హైదరాబాద్ వ్యాపారులు స్థానికులతో కలిసి భూములు కొనుగోలు చేసి, వెంచర్లు అభివృద్ధి చేసి భారీ లాభాలు పొందుతున్నారు.కొందరు స్థిరాస్తి వ్యాపారులు నేరుగా ఎన్నికల్లో పోటీ చేయకుండా, వెనకుండి తంతు నడుపుతున్నారు. తమకు నమ్మకమైన అనుచరులను బరిలోకి దింపి, అవసరమైన ఆర్థిక వనరులను సమకూరుస్తున్నారు. అనుచరులు గెలిచిన తర్వాత కీలక సందర్భాల్లో ఛైర్మన్ అభ్యర్థికి మద్దతు ఇచ్చి, భవిష్యత్తులో పురపాలిక ద్వారా లాభాలు పొందాలన్నది వారి ఆలోచన. మొత్తంగా చూస్తే, వికారాబాద్ జిల్లా పురపాలిక ఎన్నికల్లో స్థిరాస్తి వ్యాపారుల ప్రభావం ఈసారి మరింత పెరిగింది. రాజకీయాలు, వ్యాపారం ఒకదానితో ఒకటి ముడిపడుతున్న పరిస్థితి స్పష్టంగా కనిపిస్తోంది. ఎన్నికల ఫలితాలు ఎలా ఉన్నా, భవిష్యత్తులో పురపాలికల పాలనపై స్థిరాస్తి రంగం ఎంత ప్రభావం చూపుతుందన్నది మాత్రం ఆసక్తికరంగా మారింది.

# బాల్యాన్ని కాపాడుదాం -- ఆపరేషన్ స్మైల్-- XII లో భాగంగా

# 66 మంది పిల్లలను రెస్క్యూ చేసి తల్లితండ్రులకు అప్పజెప్పిన నిర్మల్ పోలీస్

## –జిల్లా వ్యాప్తంగా నెల రోజుల వ్యవధిలో 54 కేసుల నమోదు: జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల




ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 04 (భారత శక్తి): రాష్ట్రవ్యాప్తంగా జనవరి 1వ తేదీన ప్రారంభమైన ఆపరేషన్ స్మైల్ -- శ××, నెల రోజుల వ్యవధిలో నిర్మల్ జిల్లాలోని అన్ని శాఖల సమన్వయంతో దిగ్విజయంగా కొనసాగిందని జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్ తెలిపారు.

దీనికి నోడల్ ఆఫీసర్ గా అడిషనల్ ఎస్పీ ఉపేందర్ రెడ్డి, ఆపరేషన్ స్మైల్ బృందం విస్తృత గాలింపు చర్యల్లో భాగంగా,జిల్లాలో ముఖ్యంగా హోటల్ల యందు,పశువులు కాసే వద్ద, వెల్డింగ్ షాప్ ల వద్ద,నిర్మాణ పనుల నందు, వ్యాపార సముదాయాల నందు పనిచేస్తున్న బాల కార్మికులను గుర్తించారు.

జిల్లాలోని బాలబాలికలు పాఠశాలకు బదులు పనిలోకి వెళ్తున్న వారిని గుర్తించి ఆపరేషన్ స్మైల్ -- శ×× బృందం వారిని రెస్క్యూ చేసి మళ్ళీ బడికి వెళ్ళేలా ప్రోత్సహించడం జరిగింది.

పెంబి గ్రామంలో గొర్రెల కాపరిగా పనిచేస్తున్న 12 ఏళ్ల బాలుడిని గుర్తించిన స్మైల్ బృందం, తల్లిదండ్రులతో కౌన్సిలింగ్ నిర్వహించి తిరిగి పాఠశాలలో చేర్పించారు. అతనికి స్కూల్ యూనిఫాం, పుస్తకాలు అందజేయడంతో పాటు హాస్టల్ వసతి కల్పించేలా ఏర్పాట్లు చేశారు.

భైంసా పట్టణంలో రాయల్ పౌల్ట్రీ అండ్ చికెన్ షాప్ లో బుచర్‌గా పనిచేస్తున్న 11 ఏళ్ల బాలుడను రక్షించి, యజమాని పై ఎఫ్ఐఆర్ నమోదు చేసి బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించారు.

మహారాష్ట్రకు చెందిన 13 ఏళ్ల బాలిక 4వ తరగతి మధ్యలోనే చదువు మానేసి లోకేశ్వరం మండలం రాయపూర్ (కే) సమీపంలోని ఇటుక బట్టీలో 200 ? రోజువారి కూలీగా పనిచేస్తుండగా ఆమెను గుర్తించి, యజమాని పై కేసు నమోదు చేసి తిరిగి స్కూల్‌లో చేర్పించారు.

నిజామాబాద్ జిల్లా నవీపేట్ మండలానికి చెందిన 13 ఏళ్ల బాలుడు ?5000 వేతనంతో బాసరలోని గోదావరి ఫారెస్ట్ చెక్‌పోస్ట్ వద్ద గొర్రెల కాపరిగా పనిచేస్తుండగా, స్మైల్ బృందం రెస్క్యూ చేసి యజమాని పై కేసు నమోదు చేసి తల్లిదండ్రులకు అప్పగించారు.

15 ఏళ్ల బాలుడు శ్రీ భవాని బ్యాంగిల్స్ అండ్ జనరల్ స్టోర్‌లో షాప్ కీపర్‌గా పనిచేస్తుండగా, తండ్రి సమక్షంలో కౌన్సిలింగ్ నిర్వహించి యజమాని పై కేసు నమోదు చేసి తిరిగి బడికి వెళ్లేలా చేశారు.అదేవిధంగా సోఫీనగర్‌కు చెందిన16 ఏళ్ల బాలుడు 9వ తరగతి మధ్యలోనే చదువు మానేసి ఇంటి నిర్మాణ పనుల్లో పనిచేస్తుండగా, స్మైల్ బృందం గుర్తించి తిరిగి పాఠశాలలో చేర్పించారు. బీరవెల్లి గ్రామానికి చెందిన 15 ఏళ్ల బాలుడు తల్లిదండ్రుల బలవంతంతో చదువు మానేసి ఇటుక బట్టీలో పనిచేస్తుండగా, స్మైల్ బృందం గుర్తించి యజమాని పై కేసు నమోదు చేసి బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించి తిరిగి స్కూల్‌లో చేర్పించారు.వడ్డేపల్లి గ్రామానికి చెందిన 14 ఏళ్ల బాలుడు గొర్రెలు కాస్తూ చదువు మానేయగా, అతడిని ఆపరేషన్ స్మైల్ బృందం పొంకల్ ప్రభుత్వ పాఠశాలలో తిరిగి చేర్పించారు.





నిర్మల్ పట్టణంలోని సనా బట్టల షాపులో పనిచేస్తున్న 16 ఏళ్ల బాలికను రక్షించి, తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ నిర్వహించి యజమాని పై కేసు నమోదు చేసి తిరిగి పాఠశాలకు పంపించారు కుబీర్‌కు చెందిన 15 ఏళ్ల బాలుడు కుటుంబ ఆర్థిక ఇబ్బందుల కారణంగా గ్యారేజీలో మెకానిక్‌గా పనిచేస్తుండగా, స్మైల్ బృందం గుర్తించి యజమాని పై కేసు నమోదు చేసి తిరిగి స్కూల్‌లో చేర్పించారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్ మాట్లాడుతూ... బాల కార్మిక వ్యవస్థ నేరమని, పిల్లలను పనుల్లో పెట్టే యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పిల్లల చదువు భవిష్యత్తే సమాజ బాధ్యత అని తెలిపారు.బాల కార్మికులు కనిపిస్తే వెంటనే 1098 (చైల్డ్ హెల్ప్‌లైన్) లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. ఇలా ఒకరు కాదు ఇద్దరు కాదు నెల రోజుల వ్యవధిలో ఆపరేషన్ స్మైల్ --XII బృందం మొత్తం 66 మంది పిల్లల జీవితాలల్లో మార్పును తీసుకొని రావడం జరిగింది.

జిల్లాలోని రెండు డివిజన్ లలో కలిపి మొత్తం 66 మంది బాలబాలికలను గుర్తించినట్లు తెలిపారు.అందులో 54 మంది పై కేసు నమోదు చేయగా మిగతా వారికి జరిమానా విధించారు.నిర్మల్ డివిజన్ లో 34 మరియు భైంసా సబ్ డివిజన్ లో 32 మంది బాలబాలికలను రెస్క్యూ చేసి తల్లి తండ్రులకు అప్పజెప్పి కౌన్సిలింగ్ ఇచ్చారు.ఇందులో 61 మంది బాలురు కాగా ఐదుగురు బాలికలు ఉన్నారు. ఈ ఆపరేషన్ స్మైల్-- XII లో, పోలీస్ శాఖ విద్యాశాఖ రెవెన్యూ శాఖ కార్మిక శాఖ బాలల రక్షణ విభాగమ అధికారులు భాగమయ్యారని పేర్కొన్నారు.ఈ అధికారుల అందరి సమన్వయంతో జిల్లాలో ఉన్న కార్మికుల గుర్తించి వాళ్ళని బడిలో చేర్పించేందుకు అందరు కృషి చేశారని పేర్కొన్నారు.

బాల కార్మిక వ్యవస్థ ప్రోత్సహిస్తున్న వారిపై కేసు నమోదు చట్టపరంగా చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ హెచ్చరించారు.మళ్ళీ ఎవరైన యజమానులు పిల్లలను పనిలో పెట్టుకుంటే డయల్ 100 లేదా 1098 నంబరుకు ఫోన్ చేసి సమాచారం అందించాలని పేర్కొన్నారు.

జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆపరేషన్ స్మైల్ కి నోడల్ ఆఫీసర్ గా నిర్మల్ జిల్లా అడిషనల్ ఎస్పీ ఉపేందర్ రెడ్డి, డిసిపిఓ మురళి, ఎస్ఐ లు నరేష్, దయాళ్ సింగ్, హనుమాండ్లు,హెడ్ కానిస్టేబుళ్లు పాండు నాయక్, రమేష్, కానిస్టేబుళ్లు రాకేష్, గగన్, చంద్ర శేఖర్, రజిత, లక్ష్మీ, హెల్త్ డిపార్ట్మెంట్, ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ వారు, లేబర్ డిపార్ట్మెంట్, ఎన్జీవో సభ్యులు, రెండు డివిజన్ లకు చెందిన ఆపరేషన్ స్మైల్ టీం లు పాల్గొన్నారు.

# కరీంనగర్ బీఆర్ఎస్ లో నిరసనలు

కరీంనగర్ ఫిబ్రవరి 04 (భారత శక్తి):

కరీంనగర్ జిల్లాలో మున్సిపల్ ఎన్నికల వేడి రోజురోజుకూ పెరుగుతోంది. నామినేషన్లు వేసిన అభ్యర్థులకు పార్టీ నుంచి బీ?ఫాములు అందకపోవడంతో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారింది.

మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్పై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బీ?ఫాములు డబ్బులకు అమ్ముడుపోయాయంటూ పార్టీ కార్యకర్తలు గంగుల నివాసం ముందు బైఠాయించి నిరసనకు దిగారు.

మంత్రి గంగుల ఇంటి ముందు టిఆర్ఎస్ పార్టీ కండువాలు మరియు టిఆర్ఎస్ పార్టీ నుంచి ముద్రించుకున్న ప్రచార పత్రాలను తగలబెట్టారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కరీంనగర్ రెండో డివిజన్కు చెందిన కొలగాని సాగర్కు బీఆర్ఎస్ టికెట్ విషయంలో మోసం జరిగిందంటూ అభ్యర్థులు పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. బీ?ఫామ్ ఇస్తామని హామీ ఇచ్చి చివరి నిమిషంలో మాట మార్చారని, కేవలం పది రోజుల క్రితమే పార్టీలో చేరిన వ్యక్తికి ఎలా బీ?ఫామ్ ఇస్తారని బాధితులు ప్రశ్నిస్తున్నారు.టికెట్ ఇస్తామని నమ్మించి మోసం చేశారంటూ ఎమ్మెల్యే గంగుల ఇంటి ముందు నిరసనలు కొనసాగుతుండగా, ఈ వ్యవహారం కరీంనగర్ రాజకీయాల్లో కొత్త ఉద్రిక్తతకు దారితీస్తోంది.

# హాస్టల్ పై భవనం నుండి పడి బిటెక్ విద్యార్థి మృతి

చంద్రగిరి ఫిబ్రవరి 04 (భారత శక్తి):

మోహన్ బాబు యూనివర్సిటీలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థి బాలాజీ హాస్టల్ పై భవనం నుండి పడి విద్యార్థి మృతి చెందాడు. రంగంపేట లో ఉన్న ఓ ప్రైవేటు హాస్టల్ లో ఘటన జరిగింది. ఒంగోలు జిల్లాకు చెందిన విద్యార్థి హాస్టల్ పై భాగము నుండి క్రింద పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. చంద్రగిరి పోలీసులు విచారిస్తున్నారు.

# తెలంగాణ సామజిక న్యాయ దినోత్సవం శుభాకాంక్షలు తెలియచేసిన సీఎం రేవంత్

హైదరాబాద్ ఫిబ్రవరి 04 (భారత శక్తి):

"తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవం" సందర్భంగా ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు శుభాకాంక్షలు తెలియజేశారు. అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం, సామాజిక సాధికారత కల్పించేందుకు ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

బడుగు, బలహీన వర్గాలు, మైనారిటీల సంక్షేమానికి ప్రభుత్వం ఒక బాధ్యతగా, 'సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ, కుల సర్వే' ను ఎంతో నిబద్ధతతో శాస్త్రీయ పద్ధతిలో పూర్తి చేసిందని గుర్తుచేశారు. అంతే కాకుండా, దశాబ్దాల నుంచి అపరిష్కృతంగా ఉన్న ఎస్సీ ఉపకులాల వర్గీకరణకు పరిష్కారం చూపించిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని తెలిపారు.

అన్ని వర్గాలకు సమాన, సముచిత న్యాయం కల్పించాలనే ఆశయంతో తీసుకున్న నిర్ణయాల నేపథ్యంలో, ప్రతి ఏటా ఫిబ్రవరి 4వ తేదీని తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవంగా జరుపుకోవాలని నిర్ణయించిన విషయాన్ని గుర్తుచేశారు. సామాజిక న్యాయం కోసం ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని పునరుద్ఘాటించారు.

# రాజమండ్రి ఢిల్లీ పబ్లిక్ స్కూల్ సమీపంలో పెద్దపులి కలకలం

**ఎస్‌వీపీఎస్ ఫంక్షన్ హాల్, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ మధ్య ఉన్న కొబ్బరి తోటలోకి పెద్దపులి వెళ్లినట్లు గుర్తింపు**

**సీసీ కెమెరాలో రికార్డయిన పెద్దపులి కదలికలు**

యాందోళనలకు గురవుతున్న ప్రజలు

ఇంత వరకు ఏలూరు జిల్లా ఏజెన్సీ ప్రాంతాన్ని వణికించిన పెద్దపులి ఇప్పుడు తూర్పుగోదావరి జిల్లాలోకి ప్రవేశించినట్లు అధికారులు భావిస్తున్నారు. ఫిబ్రవరి 1న రాజమండ్రి రూరల్ పరిధిలోని తొర్రేడులో పశువులపై దాడి చేసి చంపిన ఘటన కూడా కలకలం రేపింది. ఆ ఘటనపై స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు మీడియా సమావేశం నిర్వహిస్తున్న సమయంలోనే వారి వెనకాలే పెద్దపులి కనిపించడం ఆందోళనను మరింత పెంచింది. పులి సంచారంపై అటవీ శాఖ అప్రమత్తమైంది. రాజమహేంద్రవరం సర్కిల్ సీసీఎఫ్ బి.ఎన్.ఎన్.మూర్తి ఆధ్వర్యంలో డీఎఫ్‌వో ప్రభాకరరావు, ఎఫ్ఆర్‌వో దావీదురాజు నాయుడు, డీఆర్‌వో శ్రీనివాస్‌రావు, రాష్ట్ర సిల్వికల్చరిస్ట్ ఆర్.శ్రీనివాసరావు తదితర అధికారులు క్షేత్రస్థాయిలో పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. పులిని పట్టుకునేందుకు పూణేలోని నిపుణులతో సంప్రదింపులు జరుపుతున్నామని, బుధవారం ఉదయానికి వారిని రాజమహేంద్రవరం రప్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

# పార్లమెంట్ ప్రజల ఆస్తి.. బీజేపీ సొత్తు కాదు

## రాహుల్ గాంధీ గొంతు నొక్కడం ప్రజాస్వామ్య విరుద్ధం: శివ చరణ్ రెడ్డి.

హైదరాబాద్, భారత శక్తి: "పార్లమెంట్ అనేది ప్రజల గొంతుక వినిపించే అత్యున్నత వేదిక. అది కేవలం బీజేపీ సొత్తు కాదు, ప్రజలందరి ఆస్తి" అని తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్ రెడ్డి అన్నారు. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని మాట్లాడనివ్వకుండా బీజేపీ నేతలు అడ్డుకోవడాన్ని నిరసిస్తూ బుధవారం యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు.

సచివాలయం నుంచి లిబర్టీ వరకు నిరసన

రాష్ట్ర సచివాలయం వద్ద ఉన్న మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహం నుండి లిబర్టీ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వరకు యువజన కాంగ్రెస్ కార్యకర్తలు భారీ నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని నరేంద్ర మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం లిబర్టీ జంక్షన్ వద్ద ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు.

భయం వల్లే అడ్డుకుంటున్నారు: శివ చరణ్ రెడ్డి

ఈ సందర్భంగా శివ చరణ్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజా సమస్యలపై పార్లమెంట్‌లో నిలదీస్తున్న రాహుల్ గాంధీని చూసి బీజేపీ ప్రభుత్వం వణికిపోతోందని విమర్శించారు. రాహుల్ గాంధీ మాట్లాడితే మోదీ ప్రభుత్వ నియంతృత్వ పోకడలు బయటపడతాయనే ఉద్దేశంతోనే సభలో కావాలని అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. ప్రతిపక్ష నాయకుడికి మాట్లాడే అవకాశం ఇవ్వకపోవడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని ఆయన ధ్వజమెత్తారు.

పాల్గొన్న ముఖ్య నేతలు:

ఈ నిరసన కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర కో-ఇంచార్జ్‌లు రోష్ని జైస్వాల్, భవ్య, లీగల్ సెల్ చైర్మన్ నిఖిల్ రెడ్డి, జిల్లా ఇంచార్జ్ శ్యామ్ చరణ్ రెడ్డి పాల్గొన్నారు. వారితో పాటు ప్రధాన కార్యదర్శులు శివంత్ రెడ్డి, రాం రెడ్డి, పీర్ మునీర్, జిల్లా అధ్యక్షులు హరిధర్, ముట రాహుల్, నాగేందర్ రెడ్డి, బొమ్మక్ అజయ్, సామిడి చరణ్ మరియు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.




# సంరెడ్డి లక్ష్మమ్మ దశదిన కర్మలో పాల్గొన్న చివరింత నరసింహారెడ్డి

బడంగ్‌పేట (నాదర్‌గుల్), ఫిబ్రవరి 4:



మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని నాదర్‌గుల్ డివిజన్ చప్పిడి అడవి రెడ్డి గార్డెన్స్‌లో అల్మాస్‌గూడకు చెందిన కీ.శే. సంరెడ్డి లక్ష్మమ్మ దశదిన కర్మ బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు హాజరై లక్ష్మమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.

ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ వైస్ చైర్మన్ చిగిరింత నరసింహారెడ్డి మాట్లాడుతూ.. లక్ష్మమ్మ మృతి వారి కుటుంబానికి తీరని లోటని పేర్కొన్నారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ, కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు వంగేటి ప్రభాకర్ రెడ్డి, పెద్దబావి సుదర్శన్ రెడ్డి మరియు ఇతర కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. లక్ష్మమ్మ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో హాజరై ఆమెకు అశ్రు నివాళి అర్పించారు.

# డీఎస్పీ నుంచి సిఐగా డిమోషన్

హైదరాబాద్, ఫిబ్రవరి 4,

తెలంగాణ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. ఓ డీఎస్పీకి డిమోషన్ ఇచ్చింది. అతడికి డీఎస్పీ హోదా రద్దు చేసి ఇన్‌స్పెక్టర్ స్థాయికి తగ్గిస్తూ హోంశాఖ సంచలన ఉత్తర్వులు జారీ చేసింది. ఫోన్ అక్రమ ట్యాపింగ్ కేసులో కీలక నిందితుడు, ప్రస్తుతం సస్పెన్షన్‌లో ఉన్న దుగ్యాల ప్రణీత్ రావు డీఎస్పీ హోదాను రద్దు చేస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ అయ్యాయి. తక్కువ కాలంలోనే రూల్స్‌కు విరుద్ధంగా డీఎస్పీగా పదోన్నతి పొందటం పాటు.. ప్రొబేషన్ కాలంలోనే విధుల దుర్వినియోగానికి పాల్పడినందుకు గాను సర్కార్ ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు హోంశాఖ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సీవీ ఆనంద్ ఉత్తర్వులు జారీ చేశారు.దీంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రణీత్‌రావుకు కల్పించిన యాక్సిలరేటెడ్ పదోన్నతి క్యాన్సిల్ అయింది. ఇకపై ఆయన ఇన్‌స్పెక్టర్ హోదాతోనే కొనసాగనున్నారు. సాధారణంగా తీవ్రవాద, ఉగ్రవాద కార్యకలాపాల అణచివేతలో విశేష ప్రతిభ కనబరిచిన పోలీస్ అధికారులకు మాత్రమే తక్కువ కాలంలో యాక్సిలరేటెడ్ ప్రమోషన్ కల్పించే విధానం తెలంగాణలో అమల్లో ఉంది. అలాంటి కార్యకలాపాల్లో ప్రణీత్ రావు పనిచేయకపోయినా రాజకీయ లబ్ధి కోసం డీఎస్పీగా పదోన్నతి కల్పించడం అప్పట్లోనే కలకలం రేపింది. 2007 ఎస్సై బ్యాచ్‌లో దాదాపు 300 మంది విధులు నిర్వహిస్తుండగా.. ఒక్క ప్రణీత్ రావుకు మాత్రమే డీఎస్పీగా పదోన్నతి కల్పించారు. ఈ ఘటన వివాదానికి దారితీసింది.ప్రణీత్‌రావు సర్వీస్ చూసినట్లయితే.. ఎస్సై హోదాలో 2016 అక్టోబరు 24న స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్‌కు బదిలీ అయ్యారు. 2023 డిసెంబరు 13 వరకు అక్కడే పనిచేశారు. ఎస్ఐబీలో ఉన్నప్పుడే ఇన్‌స్పెక్టర్‌గా, యాక్సిలరేటెడ్ విధానంలో డీఎస్పీగా కూడా ప్రమోషన్ పొందాడు. ఎస్ఐబీలో ఆయన నేతృత్వంలోనే స్పెషల్ ఆపరేషన్స్ టార్గెట్ ఏర్పాటైంది. 2023 అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన మరుసటి రోజు అంటే డిసెంబరు 4న ఎస్ఐబీ భవనంలోని సీసీ కెమెరాలను స్విచ్ఆఫ్ చేసి, ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్లలోని హార్డ్‌డిస్క్‌లు, అందులోని డేటాను ధ్వంసం చేశారు. ఈ వ్యవహారంలో ప్రణీత్‌రావు కీలకపాత్ర పోషించినట్లు సిట్ దర్యాప్తులో తేలింది. దీంతో అతడ్ని సస్పెండ్ చేయాలని నాటి ఇంటెలిజెన్స్ విభాగం అదనపు డీజీపీ 2024 జనవరి 17న ప్రభుత్వానికి సిఫారసు చేశారు. ఈ క్రమంలో అదే ఏడాది మార్చిలో ప్రణీత్‌రావును అధికారులు సస్పెండ్ చేశారు. ఆ తర్వాత జైలుకు కూడా పంపారు. తాజాగా అతడికి డిమోషన్ కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది

# మేడారం భక్తుల వాహనం బోల్తా ఐదుగురికి తీవ్ర గాయాలు

ములుగు జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 4(భారత శక్తి) :



సమ్మక్క--సారలమ్మ జాతరకు వెళ్తున్న భక్తుల వాహనం అదుపుతప్పి బోల్తా పడిన ఘటన ములుగు జిల్లా తాడ్వాయి మండల పరిధిలో బుధవారం జరిగింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల ప్రాంతం నుంచి భక్తులతో మేడారానికి వెళ్తున్న వాహనం తాడ్వాయి మండల కేంద్రం దాటిన రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రమాదకర మలుపు వద్ద అదుపుతప్పి ప్రమాదానికి గురైంది. డ్రైవర్ వాహనాన్ని నియంత్రించలేకపోవడంతో ఒక్కసారిగావారిని మెరుగైన వైద్యం కోసం ములుగు జిల్లా ఆసుపత్రికి తరలించినట్లు అధికారులు తెలిపారు. సంఘటనపై తాడ్వాయి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మేడారం జాతర రద్దీ నేపథ్యంలో వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రమాదకర మలుపుల వద్ద వేగ నియంత్రణ పాటించాలని పోలీసులు సూచిస్తున్నారు.

# రామచంద్రాపురంలో రూ. 40.70 కోట్లతో అభివృద్ధి పనులు



రామచంద్రాపురం, ఫిబ్రవరి 4: భారత శక్తి

రామచంద్రాపురం డివిజన్ పరిధిలో రూ. 40.70 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు బుధవారం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు జరిగాయి. నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ప్రారంభోత్సవాలు:

మౌలిక సదుపాయాలు: శ్రీనివాస్‌నగర్‌లో హిందూ స్మశానవాటిక, ఓల్డ్ రామచంద్రాపురంలో మీట్ మార్కెట్, వివిధ కాలనీల్లో నిర్మించిన సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ పనులు.

వినోదం & పర్యావరణం:

గాంధీ బాలవిహార్ పార్క్, రాయసముద్రం చెరువు సుందరీకరణ, చెరువులోకి మురికినీరు చేరకుండా చేపట్టిన మళ్లింపు పనులు, థీమ్ పార్క్.

భవనాలు: మహిళా సమాఖ్య భవనం, నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హాళ్లు.

శంకుస్థాపనలు:

శ్రీనివాస్‌నగర్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మాణంతో పాటు రామచంద్రాపురంలో కొత్తగా మంజూరైన సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు పునాది రాయి వేశారు. ఈ పనుల ద్వారా డివిజన్‌లో మౌలిక సదుపాయాలు మెరుగుపడతాయని నాయకులు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు పుష్ప నాగేష్, సింధు ఆదర్శ్ రెడ్డి, జోనల్ కమిషనర్ హేమంత్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# కొత్తగూడెంలో గులాబీ జెండా ఎగరడం ఖాయం: ఎంపీ వద్దిరాజు



కొత్తగూడెం ఫిబ్రవరి 04 (భారత శక్తి):

కొత్తగూడెం మునిసిపల్ కార్పొరేషన్ గా అవతరించిన తర్వాత జరుగుతున్న మొట్టమొదటి ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరడం ఖాయమని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ధీమా వ్యక్తం చేసారు. బీఆర్ఎస్ శ్రేణులు ఉత్సాహంగా ముందుకు సాగుతున్నారని,అన్ని వర్గాల ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తుందని, ఇంతకుముందు కూడా ఈ మునిసిపాలిటీ ఛైర్ పర్సన్ తమ పార్టీకి చెందినవారేనని చెప్పారు.ఎంపీ రవిచంద్ర బుధవారం తనను కలిసిన ఒక టీవీ ఛానెల్ ప్రతినిధితో మాట్లాడుతూ, ధర్మం-అధర్మానికి జరుగుతున్న పోరులో తప్పకుండా ధర్మమే గెలుస్తుందన్నారు.బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చనందున బడుగు బలహీన వర్గాల వారంతా కాంగ్రెస్ పాలకులపై మండిపడుతున్నారన్నారు.వృద్ధులు,దివ్యాంగుల పింఛన్లు పెంచలేదని,రైతుబంధు సక్రమంగా ఇవ్వట్లేదని, నిరుద్యోగ యువతకు,కౌలు రైతులకు చేసిన వాగ్దానాలను తుంగలో తొక్కారని ఎంపీ రవిచంద్ర ఆవేదన వ్యక్తంచేశారు.మాజీ మంత్రి హరీష్ రావు బొగ్గు కుంభకోణాన్ని వెతికి తీయడంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కక్ష సాధింపు చర్యలకు దిగి తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు,ఆయన కుటుంబ సభ్యులకు వరుసగా నోటీసులిచ్చి "డైవర్షన్ పాలిటిక్స్"చేస్తున్నారని ఎంపీ రవిచంద్ర వ్యాఖ్యానించారు.కాంగ్రెస్ సర్కార్ పనితీరును చూసి తాము నష్టపోయ్యిందేమిటో ప్రజలు బాగా అర్థం చేసుకోవడం జరిగిందని ఎంపీ రవిచంద్ర వివరించారు.కొత్తగూడెంతో పాటు ఖమ్మం ఉమ్మడి జిల్లాలోని అన్ని మునిసిపాలిటీల్లో బీఆర్ఎస్ ప్రచారం ముమ్మరంగా సాగుతున్నదని,అన్ని చోట్లా కూడా గులాబీ జెండా రెపరెపలాడడం తథ్యమని ఎంపీ వద్దిరాజు స్పష్టం చేశారు.

# పోరుమామిళ్ల యస్ ఐ గా హనుమంతు బాధ్యతలు

పోరుమామిళ్ల, భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 04: పోరుమామిళ్ల మండలము ఎస్ ఐ కొండా రెడ్డి బద్వేల్ అర్బన్



కి బదిలీ కాగా పోరుమామిళ్ల మండలానికి నూతన యస్ ఐ గా హనుమంతు బాధ్యతలు స్వీకరించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ మండలములో అసాంఘీక కార్యకలాపాలు జరుగకుండా కట్టడి చేస్తానని ఆయన పేర్కొన్నారు. ఎమైనా ప్రజా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

# వృద్ధ మహిళ హత్య కేసును 24 గంటల్లో ఛేదించిన పోలీసులు

దుండిగల్, భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 4:

దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన వృద్ధ మహిళ హత్య కేసును 24 గంటల్లో ఛేదించినట్లు మేడ్చల్ డివిజన్ ఏసీపీ సీ.హెచ్. శంకర్ రెడ్డి ఈ రోజు దుండిగల్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో తెలిపారు. ఈ కేసుకు సంబంధించి జతీ.చీశీ:108/2026 ఖ/ం 103, 305 బిఎన్ఎస్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించారు.



దుండిగల్ లోని చర్చి గాగిలాపూర్‌కు చెందిన చిన్నబత్తిని సుశీలమ్మ (85) అనే వృద్ధ మహిళ ఒంటరిగా నివాసం ఉంటుందని తెలిపారు. కాగా గతంలో నిందితురాలు పి. కవిత (36), అదే గ్రామానికి చెందిన వ్యక్తి కాగా, మృతురాలి వద్ద 15 రోజుల పాటు మేస్త్రీ పని చేసినట్లు వెల్లడించారు. 2026 ఫిబ్రవరి 2వ తేదీ మధ్యాహ్నం 2:30 గంటల సమయంలో సుశీలమ్మ ఇంట్లో ఒంటరిగా ఉన్నప్పుడు కవిత సుత్తెతో తలపై మొది హత్య చేసింది. అనంతరం సుశీలమ్మ వద్ద ఉన్న బంగారు చెవి కమ్మలు, చేతి వేలి ఉంగరాన్ని దొంగిలించి పరారైనట్లు ఏసీపీ వివరించారు.

సాంకేతిక ఆధారాలతో నిందితురాలిని గుర్తించి, తేదీ ఈ నెల 3వ తేదీన రాత్రి 9:30 గంటలకు అరెస్ట్ చేసినట్లు తెలిపారు. నిందితురాలి వద్ద నుంచి ఒక జత బంగారు చెవికమ్మలు, ఒక బంగారు ఉంగరాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. దుండిగల్ పోలీస్, సీసీఎస్, ఎస్ఓటీ పోలీసులు బృందాలు గా ఏర్పడి కేసును ఛేదించాయని చెప్పారు. ఈ కేసు దర్యాప్తు లో కీలకంగా మారిన సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసిన చర్చి గాగిలాపూర్‌కు చెందిన శ్రీకర్ రెడ్డి ని సన్మానించనున్నట్లు తెలిపారు.

ఈ కేసును మేడ్చల్ ఏసీపీ సీ.హెచ్. శంకర్ రెడ్డి పర్యవేక్షణలో దుండిగల్ పోలీస్, సీసీఎస్, ఎస్ఓటీ బృందాలు తక్కువ సమయంలో ఛేదించారు. ఈ దర్యాప్తులో సీసీఎస్ ఏసీపీ వై. నాగేశ్వరరావు, పీ. సతీష్ (దుండిగల్ ఇన్‌స్పెక్టర్), ఎం. బాలరెడ్డి (దుండిగల్ డీఐ), పీ. దాలి నాయుడు (మేడ్చల్ సీసీఎస్ ఎస్ఐ), టి. శంకర్ (మేడ్చల్ సీసీఎస్ ఎస్ఐ), డీఎన్ ఈశ్వర్ (దుండిగల్ ఎస్ఐ) తదితర క్రైమ్ సిబ్బంది సమష్టిగా దర్యాప్తు చేశారు.

# కాంగ్రెస్ నాయకులను నిలదీయండి : సత్యవతి రాథోడ్

ములుగు జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 4 (భారత శక్తి) : ములుగు జిల్లా లోని మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో ఓట్ల కోసం వచ్చే కాంగ్రెస్ నాయకులను నిలదీయాలని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల బాకీ కార్డును బుధవారం ములుగులో బీఆర్ఎస్ నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ ఎన్నికల ఇన్చార్జ్, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలు, ఆరు గ్యారెంటీలపై ప్రజలు నిలదీయాలని, తప్పుడు హామీలతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ కు తగిన బుద్ధి చెప్పి బీఆర్ఎస్ కార్పొరేటర్ల ను అధిక మెజార్టీతో గెలిపించి ములుగు మునిసిపాలిటీని అభివృద్ధి చేసుకోవాలని ఆమె అన్నారు..




# రాష్ట్రంలో జీవించే ప్రజలందరికీ సమాన హోదా, సమాన హక్కులు కల్పిస్తుంది.

## ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్

భద్రాద్రి జిల్లా బ్యూరో, (భారతశక్తి)ఫిబ్రవరి 4:

తెలంగాణ రాష్ట్రంలో జీవించే ప్రజలందరికీ సమాన హోదా, సమాన అవకాశాలు, సమాజంలో వెనుకబడిన ఆఖరి వ్యక్తికి కూడా తగిన వనరులు ప్రాతినిథ్యం, ఆత్మగౌరవం కల్పించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందని ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్ అన్నారు. బుధవారం ఐటిడిఏ సమావేశం మందిరంలో తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవం సందర్భంగా ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అధికారిక పనులపై వెళ్లి అందుబాటులో లేనందున యూనిట్ అధికారుల సమక్షంలో మహనీయుల చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కులాల సర్వే తో పాటు షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణ దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తూ పేద ప్రజలందరికీ సమాన హక్కులు కల్పించే విధంగా పాటుపడుతుందని తెలిపారు. ఈ హక్కులు సాధించడానికి తమ జీవితాలను ధారపోసిన మహనీయుల మనకు మార్గదర్శకాలని, అందరి అభ్యున్నతయే లక్ష్యంగా మహాత్మా గాంధీ కలగన్న సర్వోదయ నుంచి అణగారిన వర్గాలకు విద్యా, గౌరవం కోసం మహాత్మా జ్యోతిరావు పూలే చేసిన పోరాటం అలాగే భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బోధించిన సామాజిక ప్రజాస్వామ్య విలువల వరకు మనందరికీ



నిరంతర ప్రేరణ అని పేర్కొన్నారు. ప్రగతి అనేది ఒక గమ్యం కాదని అది నిరంతర సామాజిక న్యాయ పోరాటమని, ప్రతిభకు అవకాశాలు తోడైనప్పుడు కుల మతాల భేదం లేకుండా ప్రతి ఒక్కరూ తమ కలలను సహకారం చేసుకునే సమాజాన్ని మనం నిర్మించాలని, భారతదేశ అభివృద్ధిలో ప్రతి పౌరులు భాగస్వామి అయ్యేలా సమ్మిళిత భారతావని కోసం మనమందరం కలిసికట్టుగా కృషి చేద్దామని ఆయన తెలిపారు. అనంతరం ఐటిడిఏ యూనిట్ అధికారులు సిబ్బందితో కలిసి సామాజిక న్యాయ దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ పవర్ వేణు, ఈ ఈ ట్రైబల్ వెల్ఫేర్ మధుకర్, పీవీటీజీ అధికారి గన్యా, ఏసీఎంవో రమేష్, ఏవో సున్నం రాంబాబు, డి టి ఎల్ టి ఆర్ నాగేశ్వరరావు, వివిధ శాఖలకు చెందిన అధికారులు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# వన దేవతల తిరుగువారం పండుగ ఘనంగా జరిగింది: మంత్రి సీతక్క

## 4 వేల మంది కార్మికులతో పారిశుధ్య పనులు

మేడారం/ములుగు జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 4 (భారత శక్తి) : మేడారం లోని సమ్మక్క సారలమ్మ జాతర తిరుగువారం పండుగను వనదేవతల పూజారులు ఘనంగా నిర్వహించారు.

ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారం సమ్మక్క సారలమ్మ మహా జాతరకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., ఎస్పీ సుధీర్ రామ్ నాథ్ కేకన్ లతో కలిసి అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.





అనంతరం మంత్రి సీతక్క జిల్లా కలెక్టర్ ఎస్పీ లతో కలిసి జాతర చుట్టూ పరిసర ప్రాంతాలను పరిశీలించి నిరంతరం పారిశుధ్య పనులు చేపట్టాలని స్వచ్ఛమైన మేడారం గ్రామాన్ని గ్రామస్తులకు అందించే విధంగా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ బుధవారం మేడారం జాతర తిరుగువారం న సుమారు 5 లక్షల మంది భక్తులు వనదేవతలను దర్శించుకున్నారని తెలిపారు.

ప్రధాన జాతర ముగిసిన అనంతరం కూడా భక్తుల రద్దీ కొనసాగుతున్న నేపథ్యం లో వారందరికీ ఎటువంటి ఇబ్బంది లేకుండా తాగునీరు,శానిటేషన్ గానీ రవాణా సౌకర్యం ఎటువంటి లోపం లేకుండా చర్యలు తీసుకున్నామని ఆమె అన్నారు. 2026 మేడారం మహా జాతరకు సుమారు రెండు కోట్ల మందికి పైగా భక్తులు వచ్చారని ఇంకా వారం రోజులపాటు భక్తుల రద్దీ కొనసాగుతుందని పేర్కొన్నారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా అధికార యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టడం జరిగిందని మంత్రి స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి,డీఎస్పీ,ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# 8వ వార్డు అభివృద్ధి కోసం బరిలోకి సీనియర్ నాయకుడు కోనేరు శేషరావ్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 04 (భారత శక్తి) భైంసా మున్సిపాలిటీ 8వ వార్డు పరిధిలో ప్రజా సమస్యలపై అనుభవం కలిగిన సీనియర్ నాయకుడు కోనేరు శేషరావ్ ఎస్టీ (షెడ్యూల్డ్ ట్రైబ్) రిజర్వేషన్ కేటగిరీ కింద కౌన్సిలర్ పదవికి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భైంసా మున్సిపాలిటీలో సుమారు గత 50 సంవత్సరాల తర్వాత ఎరుకలోడా జాతికి రిజర్వేషన్ ప్రకారం వచ్చిన ఈ అవకాశం చారిత్రాత్మకమైనదని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, తమ వర్గంతో పాటు వార్డు మొత్తం అభివృద్ధి కోసం పనిచేయాలనే లక్ష్యంతో ఎన్నికల బరిలోకి దిగినట్లు తెలిపారు.గత అనేక సంవత్సరాలుగా వార్డు ప్రజల సమస్యలను దగ్గరగా గమనిస్తూ, వాటి పరిష్కారానికి పోరాటాలు చేసిన అనుభవం తనకు ఉందని అన్నారు. రోడ్లు, తాగునీరు, పారిశుధ్యం, మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తానని, ప్రజల నమ్మకంతోనే ముందుకు సాగుతానని తెలిపారు. వార్డు ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ, తమపై నమ్మకం ఉంచి, ఫిబ్రవరి 11న జరగనున్న ఎన్నికల్లో లిసీరియల్ నెంబర్--3 (బ్యాట్ గుర్తు)లిలిపై ఓటు వేసి ఆశీర్వదించాలని ఆయన కోరారు.



# ఏకలవ్య మోడల్ సంక్షేమ విద్యాలయాల్లో దరఖాస్తులకు ఆహ్వానం

భద్రాద్రి జిల్లా బ్యూరో, (భారతశక్తి)ఫిబ్రవరి 4: 2026-27 విద్యాసంవత్సరమునకు తెలంగాణ ప్రభుత్వ ఏకలవ్య మోడల్ సంక్షేమ విద్యాలయాల్లో ఆరవ తరగతిలో ప్రవేశంనకు గిరిజన విద్యార్థిని విద్యార్థులు సులభంగా దరఖాస్తు చేసుకోవడానికి ఐటీడీఏ భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయడం జరిగిందని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఈ ఎం ఆర్ ఎస్ పాఠశాలల్లో ప్రవేశాల కొరకు దరఖాస్తులు చేసుకోవడానికి ఐదవ తరగతి చదువుతున్న గిరిజన విద్యార్థినీ విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థుల యొక్క పాస్పోర్ట్ సైజ్ ఫోటో, ఆధార్ కార్డు, ఐదవ తరగతి స్టడీ సర్టిఫికేట్, రేషన్ కార్డ్, కులం, ఆదాయ ధృవీకరణ పత్రం జిరాక్స్ ప్రతులు తీసుకొని వంద రూపాయలు చెల్లించి ఆన్లైన్ ద్వారా ఎంట్రన్స్ పరీక్షలకు అప్లై చేసుకోవాలని ఆయన తెలుపుతూ ఇట్టి సదా అవకాశాన్ని విద్యార్థినీ విద్యార్థుల తల్లిదండ్రులు వినియోగించుకోవాలని ఆయన కోరారు.



# తరగతి గది నుంచి బయట ప్రపంచాన్ని చూడేలా విద్యార్థులను తీర్చిదిద్దాలి: జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్

భద్రాద్రి జిల్లా బ్యూరో, (భారతశక్తి)ఫిబ్రవరి 4:తరగతి గదిలో పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా, బయట ప్రపంచంలో ఎదురయ్యే అనేక సమస్యలకు పరిష్కారాలు ఆలోచించే విధంగా విద్యార్థులను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. విద్యార్థులు నూతన ఆవిష్కరణలు చేయడం ద్వారా తమ ఆలోచనలను కార్యరూపంలోకి తీసుకు రావాలంటే ఉపాధ్యాయుల ప్రోత్సాహం కీలకమని ఆయన తెలిపారు. భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పాల్వంచలోని అనుబోస్ ఇంజనీరింగ్ కళాశాలలో జిల్లాలోని పీఎం శ్రీ పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులకు మూడు రోజులపాటు నిర్వహించనున్న “ఇన్నోవేషన్, డిజైన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్” బూట్ క్యాంప్‌ను బుధవారం జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు నిత్యజీవితంలో ఎదుర్కొనే సమస్యలను గుర్తించి, వాటికి పరిష్కారాలు చూపేలా ప్రాజెక్టులు రూపొందించేందుకు ఉపాధ్యాయులు మార్గనిర్దేశం చేయాలని సూచించారు. అలాంటి ప్రాజెక్టులను ఉత్పత్తుల రూపంలోకి తీసుకువచ్చే దిశగా విద్యార్థులను ప్రోత్సహించేలా ఈ బూట్ క్యాంప్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ బూట్ క్యాంప్ ద్వారా ఉపాధ్యాయులు పొందిన జ్ఞానం, అనుభవాలను తరగతి గదిలో విద్యార్థులకు అందించి, వారి సృజనాత్మక ఆలోచనలు, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థులు రూపొందించిన నవకల్పనలను ఉత్పత్తులుగా అభివృద్ధి చేయడంలో వాద్వానీ ఫౌండేషన్, భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ, పీఎం శ్రీ పాఠశాలలు భాగస్వాములుగా వ్యవహరించి విద్యార్థులను ప్రోత్సహించాలని ఆయన అన్నారు.




ఈ కార్యక్రమంలో అఖిల భారత సాంకేతిక విద్యా మండలి నుండి విభం వ్యాస్, వాద్వానీ ఫౌండేషన్ నుండి శ్యామ్, డాక్టర్ హెచ్. శ్రీనివాస్ వరప్రసాద్, అనుబోస్ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ భరత్ కృష్ణ, ప్రిన్సిపాల్ రవికుమార్, జిల్లా విద్యాశాఖ అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఏ. నాగరాజశేఖర్‌తో పాటు భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్, హనుమకొండ, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల నుండి పీఎం శ్రీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# అవగాహనతోనే మార్పు సాధ్యం

**-ప్రమాదానికి గురైన కారును ప్రజలకు కనిపించే విధంగా ఏర్పాటు.**

**-రిబ్బన్ కట్ చేసే ప్రారంభించిన జిల్లా ఎస్పీ.**

**-ప్రాణం విలువ తెలిపేందుకే ప్రమాదానికి గురైన కారును ఏర్పాటు: జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్.**




ఆదిలాబాద్ జిల్లా ఫిబ్రవరి 04 (భారత శక్తి )

"అరైవ్ అలైవ్" లో భాగంగా జిల్లాలో రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన ఐపిఎస్ నూతనంగా ప్రజలకు అవగాహన కల్పించేందుకు రోడ్డు ప్రమాదంలో అతివేగంతో ప్రమాదానికి గురైన కారును వాహనదారులకు కనిపించే విధంగా "కుప్టి ఘాట్" రోడ్ లో ఏర్పాటుచేసి ఈ రోజు దానిని ప్రారంభించడం జరిగింది. ఈ సంవత్సరం ప్రమాదాలను తగ్గించి ప్రాణం విలువ తెలిపాలని ప్రజలకు అవగాహనతోనే సాధ్యమవుతుందని వివిధ రకాలైన ప్రజాహిత కార్యక్రమాలతో ప్రజలకు చేరుకోవడం జరుగుతుంది. అందులో ప్రజలకు అర్థమయ్యే రీతిలో వేగం వల్ల ప్రాణం పోతుందనే విషయాన్ని తెలియజేసే విధంగా ఇలాంటి కార్యక్రమాలతో ముందుకు వెళ్తున్నట్టు తెలిపారు. ప్రజలు వీటిని దృష్టిలో ఉంచుకొని వేగాన్ని తగ్గించి, వాహన నియమ నిబంధనలు పాటించాలని సూచించారు. ముఖ్యంగా రాష్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్, రాంగ్ రూట్ డ్రైవింగ్, ఓవర్ స్పీడ్ లాంటివి చేయకుండా ఉండాలని తెలిపారు. మద్యం మత్తులో వాహనాలను నడపడం వల్ల ప్రమాదాలకు గురయ్యా అవకాశాలు ఉంటాయని గుర్తు చేశారు. ఒక్క క్షణం నిర్లక్ష్యం ప్రాణ నష్టానికి కారణమవుతుందని విషయాన్ని గుర్తు ఉంచుకోవాలని ప్రతి వాహనదారుడు గమనిస్తూ వాహనాన్ని నడపాలని తెలిపారు. ఇలాంటి వాటిని చూసి నేర్చుకొని ప్రమాదాలకు గురికాకుండా ఉండాలని తెలిపారు. ఈ కారును జిల్లా పోలీసులు మరియు కేఎన్ఆర్ హైవే సంస్థ వారి సహకారంతో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కెఎన్ఆర్ సంస్థ సిబ్బంది ఇచ్చోడా సీఐ బండారి రాజు, నేరడిగొండ ఎస్సై ఇమ్రాన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అలోచించి,అందుబాటులో ఉండే నాయకుడికి ఓటు వేయండి: ఎమ్మెల్యే చింత ప్రభాకర్

సంగారెడ్డి,భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 4 :

సంగారెడ్డి,సదాశివాపేట మున్సిపాలిటీల్లో అవినీతి లేని పాలన కావాలంటే భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ అన్నారు.సంగారెడ్డి మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రచార రథాన్ని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అభ్యర్థుల క్యారెక్టర్‌ను పరిశీలించి, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండే వారిని గెలిపించాలని ప్రజలను కోరారు. అవినీతికి తావులేకుండా పనిచేసే బిఆర్ఎస్ అభ్యర్థులకే ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు.గత పది సంవత్సరాలలో బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి ప్రజల కళ్లముందే ఉందని, ప్రస్తుతం కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి శూన్యమైందని విమర్శించారు. మంచి మున్సిపాలిటీలను కాపాడుకోవాలంటే బిఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన




అవసరం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో ఇంచార్జి రాజ నర్సు,మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, కంది మండల పార్టీ అధ్యక్షులు మందుసూద్ రెడ్డి, చిన్న, సోమిరెడ్డి తదితర పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి: డిఎస్పీ రవీందర్ రెడ్డి

మణుగూరు, ఫిబ్రవరి 04 (భారతశక్తి): సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని డిఎస్పీ వి.రవీందర్ రెడ్డి అన్నారు. బుధవారం సింగరేణి ఏరియాలోని క్యాంటీన్ లో సింగరేణి ఏరియా జనరల్ మేనేజర్ ఆధ్వర్యంలో కార్మికులకు, ఉద్యోగస్థులకు సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ సైబర్ నేరాలు బాగా పెరిగాయని, ఆన్‌లైన్ మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. వాట్సప్‌లో వచ్చే లింక్‌లు ఓపెన్ చేయొద్దని సూచించారు. సైబర్ నేరాల్లో విద్యావంతులు, ఉద్యోగస్తులు అధికంగా మోసపోతుండడం బాధాకరమన్నారు. మల్టీలెవల్ మార్కెటింగ్, ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్, క్యూ ఆర్ కోడ్ స్కానింగ్, ఇతర ఆన్‌లైన్ మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయని తెలిపారు. ఏ పోలీస్ అధికారి నేరుగా వాట్సప్ వీడియోకాల్స్ చేయరని, డిజిటల్ అరెస్టులు అని ఎవరైనా కాల్స్ వస్తే సంబంధిత పోలీస్ స్టేషన్లో వెంటనే సమాచారం ఇవ్వాలని తెలిపారు. ప్రజల బలహీనతలే సైబర్ నేరగాళ్లకు బలంగా మారిందని, మారుతున్న టెక్నాలజీతో మోసగాళ్ళ చెలరేగిపోతున్నారని తెలియజేశారు. అప్రమత్తంగా ఉంటేనే నష్టం జరగదన్నారు. సైబర్ నేరగాళ్ల చేతిలో నష్టపోతే తక్షణమే టోల్ ఫ్రీ 1930కు ఫిర్యాదు చేయాలన్నారు. మైనర్లకు వాహనాలు నడపడానికి ఇవ్వొద్దని, ఎవరైనా తల్లిదండ్రులు ఇస్తే వాహనాలు సీజ్ చేసి తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐ పాటి నాగబాబు, ఎస్సైలు, సింగరేణి ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్, డిజిఎం పర్సనల్ రమేష్, ఎస్వో టు జీఎం శ్రీనివాసచారి, సింగరేణి అధికారులు, కార్మికులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.??



# వన దేవతల సన్నిధిలో భక్తులు - తిరుగువారం అదే తీరు



మేడారం/ములుగు జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 4 (భారత శక్తి) : ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం లోని వనదేవతల మహా జాతర సమ్మక్క సారలమ్మ తల్లుల సన్నిధిలో భక్తుల రద్దీతో బుధవారం తిరుగువారం కావడంతో అదే తీరుగా బారులు తీరారు. నలుమూలల నుండి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మొదటగా జంపన్న వాగు లో పుణ్య స్నానాలు ఆచరించి వన దేవతలకు ఎత్తు బంగారం, ఒడి బియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

భక్తుల రద్దీ కొనసాగుతున్నా తరుణం లో అధికారులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

జాతర పరిసర ప్రాంతాలలోని వ్యర్థాలను పారిశుధ్య కార్మికుల ద్వారా తొలగిస్తూ వ్యాధులు ప్రబలకుండా అధికారులు తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.తిరుగువారం సందర్భంగా వన దేవతల పూజారులు కన్నేపల్లి ఆలయం లో శుద్ధి కార్యక్రమం నిర్వహించి వన దేవతలకు దీప దూప నైవేద్యాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం అమ్మవార్ల పూజ సామాగ్రి,పట్టు వస్త్రాలను పూజారులు భద్రపరుస్తారు.

# మున్సిపల్ ఎన్నికల్లో సిపిఎం అభ్యర్థులను గెలిపించండి: సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి

సూర్యాపేట(భారతశక్తి జిల్లా ప్రతినిధి)ఫిబ్రవరి 4:



మున్సిపల్ ఎన్నికల్లో నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడే సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మల్లు వెంకట నరసింహారెడ్డి భవన్ లో జరిగిన సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గశీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల్లో సూర్యాపేట, కోదాడ, హుజూర్ నగర్, నేరేడుచర్ల, తిరుమలగిరి మున్సిపాలిటీలో కలిపి 11 వార్డులలో పోటీ చేస్తున్నామన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో సిపిఎం అభ్యర్థులను గెలిపిస్తే ప్రజా సమస్యలపై మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ప్రజా సమస్యలపై గళం విప్పుతారని అన్నారు. అవినీతి రహిత పాలన కమ్యూనిస్టులకే సాధ్యమన్నారు. అవకాశవాదులను, అవినీతిపరులను ఓడించాలని ఓటర్లకు పిలుపునిచ్చారు. సిపిఎం పోటీ చేయని స్థానాలలో వామపక్ష అభ్యర్థులకు మద్దతిస్తున్నామన్నారు. మిగిలిన స్థానాలలో లౌకిక, ప్రజాస్వామ్య శక్తులను గెలిపించాలన్నారు. ఈ ఎన్నికల్లో మతోన్మాద ఫాసిస్టు విధానాలు అనుసరిస్తున్న బిజెపిని ఓడించాలన్నారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కోలిశెట్టి యాదగిరిరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మట్టిపల్లి సైదులు, కోట గోపి పాల్గొన్నారు.

# కుమ్మర్లకు నామినేటెడ్ పదవులు ఇవ్వాలి

# "మానవ నాగరికతకు కుమ్మరి తొలి మెట్టు ఆరోగ్యానికి కుండ ఆయువు పట్టు"

మానవుడికి వంట నేర్పి మానవ జాతి చరిత్ర నిర్ధారణకు సంస్కృతి' వారసత్వ విశేషాల అధ్యయనానికి దోహదపడే కుమ్మర వృత్తి అంతరించే దశకు చేరుకుంది. మానవాళికి వంట వండటానికి వంట పాత్రలు సమకూర్చి మానవ జాతికి శాస్త్రీయ పరిజ్ఞానం అందించి ప్రజారోగ్యాన్ని పర్యావరణ పరిరక్షణకు ప్రతినిధిగా నిలిచిన కుమ్మర వృత్తి కార్మికులు ఉపాధిలేక దుర్భరమైన జీవితాలను వెళ్ళ దీస్తున్నారు.

మానవ మనుగడబి కుమ్మర వృత్తి

మనిషి పుట్టుక 'పెళ్లి''చావు' .'దైవ' కార్యక్రమాల్లో కుమ్మర్ల ఉత్పతులు కుండలు' గురుగులు' వంట కొరకు ఎసులలు 'అటికెలు నీటి నిల్వకు తొట్టీలు రంజన్లు' కధువలు పెళ్ళిళ్ళలో "ఐరేని కుండలు" వినియోగిస్తారు. కుమ్మర్లవృత్తి మానవ జాతి మనుగడలో ప్రధాన పాత్ర పోషిస్తుందనడంలో అతిశయోక్తిలేదు. చారిత్రక వాస్తవం "మొహంజదారో' "హరప్పా" "మసపుటోనియా"" "సింధూ"



నాగరికత అధ్యయనాలలో వెల్లడైంది. గృహ ప్రవేశం ప్రభుత్వ భవనాల భూమి పూజ 'అమ్మవారికి సమర్పించే భోనాలు' తెలంగాణ సంస్కృతిని చాటే గోల్కొండ బోనాలు"శుభ" "దైవ"కార్యక్రమాల్లో కుమ్మరి కుండలు ఉపయోగిస్తారు. మట్టిని నమ్ముకొని పర్యావరణ పరిరక్షణకు కవచంగా నిలిచిన కుమ్మర వృత్తి ఉనికిని కోల్పోయే స్థితిలో వుంది.

కుమ్మర్లు కేంద్ర' రాష్ట్ర ప్రభుత్వాల నిరాదరణకు గురై కుల వృతుల( మట్టి పాత్రలకు) ఉత్పతులకు గిరాకీ తగ్గటం వల్ల కుమ్మర వృత్తి పై ఆధారపడిన కుమ్మర్లు వృత్తిని వదిలి పట్టణాలకు వలస పోతున్నారు. అల్పవేతనాలకు పనిచేస్తూ శ్రమ దోపిడీకి గురౌతున్నారు. తెలంగాణ రాష్ట్రంలో 14 లక్షల జనాభా కలిగి 8 లక్షల ఓటర్లు ఉన్న కుమ్మర్లు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి మద్ధత్తు ఇచ్చారు. కుమ్మర్లు తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించారు. స్వరాష్ట్ర సాధనలో తెగించి కొట్లాడారు. సకల జనుల సమ్మె ' మిలియన్ మార్చ్ లో కుమ్మర్లు కుటుంబ సభ్యులతో పాల్గొన్నారు. చాలా మంది కుమ్మర్లు గ్రామ 'మండల జిల్లా స్థాయిలో కాంగ్రెస్ పార్టీ కార్యవర్గంలో వివిధ హోదాల్లో కాంగ్రెస్ పార్టీకి అంకిత భావంతో సేవలు అందిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ విధానాలను క్షేత్ర స్థాయిలో ప్రజలవద్దకు చేర్చి పార్టీ పట్ల ప్రజల విశ్వాసాన్ని సమీకరించడంలో గణనీయమైన కృషి చేశారు.

చట్టసభల్లో ప్రవేశించని కుమ్మర్లు

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటై 10 సంవత్సరాలు గడిచినా గత ప్రభుత్వం కుమ్మర్లకు చట్టసభల్లో నామినేటెడ్ పదవులు ఇవ్వలేదు. భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78సంవత్సరాలైనప్పటికీ కుమ్మర కులస్థులు చట్ట సభల్లో నేటికి ప్రవేశించలేదు. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచార సభల్లో చట్ట సభల్లో ప్రవేశం లేని కులాలకు నామినేటెడ్ పదవులు ఇస్తామన్న రాష్ట్ర ముఖ్య మంత్రి ఎ' రేవంత రెడ్డి హామీతో కుమ్మర్లు కోటి ఆశలు పెట్టుకున్నారు.దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 యేళ్లు ఐనప్పటికీ ఏఒక్క రాజకీయ పార్టీ అసెంబ్లీ ' లోకసభకు పోటీ చేయడానికి కుమ్మర్లకు టిక్కెట్లు ఇవ్వక పోవడం వల్ల కుమ్మర్లకు చట్ట సభల్లో ప్రవేశం లభించలేదు. ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేసేఆర్థిక స్థోమత లేని నామినేటెడ్ పదవుల్లో కుమ్మర్లకు రాజకీయ పార్టీలు అవకాశం కల్పించక పోవడం వల్ల రాజ్యాధికారం లోవాటా కుమ్మర్లకు దక్కలేదు. కుమ్మర్లను బీ 'సీ "బి" జాబితాలోచేర్చినప్పటికీ ఆశించిన విధంగా కుమ్మర్ల సామాజిక 'ఆర్థిక 'రాజకీయ వికాసం జరుగలేదు. నేటి వరకు కుమ్మర్లకు రాష్ట్రం నుండి అసెంబ్లీ 'లోకసభ 'రాజ్యసభ' కౌన్సిల్ సభ్యులుగా ఒక్కరికి కూడా అవకాశం రాలేదు.

ఉత్తరాది రాష్ట్రాల్లో కుమ్మర్లను ప్రజాపతి 'కుమార్ 'కుంభార్ ' కుమావత్ ' కుంభాకార్ అనే పేర్లతో పిలుస్తారు.ఒకే దేశం ఒకే రాజ్యాంగం ఒకే చట్టం ఒకే రిజర్వేషన్ అంటూ చెబుతున్న నాయకులకు ఉత్తర' దక్షిణ 'భారత దేశ ప్రాంతాల మధ్య వివక్ష చూపడం వల్ల ప్రభుత్వాలు పార్టీలు అవలంబిస్తున్న దంద్వ వైఖరి వల్ల తెలుగు రాష్ట్రాలలో ఉన్న కుమ్మర్లు చట్ట సభల్లో ప్రవేశానికి నోచుకోలేదు.కుమ్మర్లను "ఎమ్మెల్సీ" 'కార్పొరేషన్స్ కు ఛైర్మెన్ పదవుల్లో నామినేట్ చేయక పోవడం వల్ల రాజ్యాధికారం కుమ్మర్లకు అందని ద్రాక్ష అయ్యింది.

కుమ్మర్లకు ఉచిత మట్టి ఉచిత కలప తీసుకునే జి 'వోలు కాగితాలకే పరిమితం అయ్యాయి

గతంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన మిషన్ కాకతీయ వల్ల చెరువుల్లో' 'కుంటల్లో మట్టి తవ్వకం వల్ల కుండలు చేయడానికి ఉపయోగించే బంక మట్టి కొరత ఏర్పడింది. మట్టి లభించే చెరువులు' కుంటలు రియల్ ఎస్టేట్ వ్యాపారుల కబ్జాల్లోకి వెళ్ళటం వల్ల ఉచితంగా లభించే మట్టికి డబ్బులు చెల్లంచే పరిస్థితి వచ్చింది. కుంటల్లో చెరువుల్లో కుమ్మర్లకు ఉచితంగా మట్టి లభించే ప్రభుత్వ ఉత్తర్వులు అమలు కాలేదు.కుమ్మర వృత్తికి ముడిసరుకు మట్టి కలప లభించని పరిస్థితులు దాపురించాయి.ఈ పరిస్థితి కుమ్మర వృత్తిదారులు కుల వృత్తిని వదిలి పట్టణాలకు నగరాలకు వలసకు దారితీసింది . ఉపాధి కొరకు గల్ఫ్ దేశాలకు వలస వెళ్లారు.

ప్లాస్టిక్ అల్యూమినియం పాత్రలతో మట్టి పాత్రలు పోటీ

ప్లాస్టిక్ 'అల్యూమినియం పాత్రలు మార్కెట్లో లభించడం వల్ల కుండలకు వంట చేసుకునే మట్టి పాత్రలకు డిమాండ్ తగ్గింది. కుమ్మర్ల రెండు రకాలుగా నష్టపోయారు.

ముడి సరుకు కొరత బిమార్కెటింగ్ లేకపోవడం

కుండలు 'వంట పాత్రలకు కావలసిన ముడి సరుకు మట్టి కొరత ఒక వైపు మార్కెట్లో గిరాకీ తగ్గడం మరో వైపు సమస్యలుగా పరిణమించి కుమ్మర వృత్తి కుదేలైంది. "కులవృత్తిని మించింది లేదు గువ్వల చెన్న" అన్న నానుడి కుల వృత్తిని వదిలిందే మిన్న అనేది నేడు విధానమైంది.ఉత్తరాది రాష్ట్రాల్లో కుమ్మర్లు ఎ'ఎస్సీ ఎస్ 'టి జాబితాలో వుండడం వల్ల అనేక రాజకీయ అవకాశాలు వచ్చాయి.అనేక మంది కుమ్మర్లు శాసన సభ్యులుగా ఎం'పి 'లుగా 'శాసన మండలి సభ్యులుగా 'మంత్రులుగా తమ ప్రతిభను చాటుతున్నారు.

ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ లో తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటి వరకు చట్ట సభల్లో అవకాశం రాలేదు. ఐ 'ఎ 'ఎస్ 'ఐ'పి' ఎస్ అధికారులుగా అవకాశం రావడం లేదు. తెలంగాణ ఉద్యమంలో కుమ్మర్లు తమ "సారే "కుల వృత్తులు ప్రదర్శిస్తూ ఉద్యమంలో అలుపెరుగని పోరాటం చేశారు.అరెస్ట్ అయ్యి లాఠీ దెబ్బలు తిని జైళ్లకు వెల్లారు.తెలంగాణ ఏర్పడి 11యేళ్లు ఐనప్పటికీ కుమ్మర కులస్థులకు చట్టసభల్లో ప్రవేశం లభించలేదు. రాష్ట్రంలోని119 నియోజక వర్గాల్లో అసెంబ్లీ అభ్యర్థుల గెలుపు ఓటములు నిర్ణయించడంలో గణనీయమైన ఓటు బ్యాంకు వున్న కుమ్మర్లు నామినేటెడ్ పదవుల్లో నియమించ బడలేదు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలపుడు అనేక పార్టీలు కుమ్మర సామాజిక వర్గానికి రాజకీయ ప్రాతినిధ్యం ఇస్తామని తమ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న పార్టీలు ఓట్ల అనంతరం కుమ్మర సామాజిక వర్గాన్ని గుర్తించకపోవడంలో పోటీ పడడం శోచనీయం .చట్ట సభల్లో ప్రవేశం ప్రాతినిధ్యం లేని కులమైన కుమ్మర్లకు "ఎమ్మెల్సీ 'పదవికి నామినేట్ చేస్తానన్న రాజకీయ హామీ నేటికీ నెరవేరలేదు.

తెలంగాణలో కాంగ్రెస్ అద్వర్యంలో ఏర్పడిన నూతన ప్రభుత్వం ప్రజా పాలనలో ఇతర కుల వృత్తులకు ఆదుకున్నట్లే కుమ్మరవృత్తి దారులను ఆదుకోవాలి. కుమ్మర్ల సంక్షేమ చర్యలు చేపట్టాలి.

కుమ్మర వృత్తికి ఆధునిక సాంకేతికతను అందించాలి.

యువతలో నైపుణ్యాభివృద్ధి కిపెద్ద పీట వేయాలి.ప్రతి మండల జిల్లా కేంద్రంలో అధునాతన పాటరీ కలంకారీఉత్పత్తి కేంద్రాలను "స్కిల్ డెవలప్మెంట్ "ప్రోగ్రాం ఏర్పాటు చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి.

కుమ్మర్లకు మౌలిక వసతుల కల్పన పన్నుల్లో రాయితీలు కల్పించాలి

కుమ్మర వృత్తి అభివృద్ధికి మౌలిక వసతులు "వాము" బట్టీల కొరకు ఉచితంగా స్థలం సమకూర్చాలి.మట్టి సేకరణ వాము కాల్చడానికి పోరుక అడవినుండి కలప ఉచితంగా పొందడానికి ప్రభుత్వం జారీ చేసిన "జీవో" లు అమలు చెయ్యాలి.వాము' కొరకు కుండల' బట్టి కొరకు 'షేడ్ కొరకు ప్రభుత్వం ఉచితంగా భూమి కేటాయించాలి.ప్రభుత్వం విధించే "సీవరేజ్ సేస్ "వృత్తి పన్ను నుండి కుమ్మర వృత్తిని మినాహాయించాలి.చాకలి 'మంగలి వృత్తులకు ఇస్తున్న "ఉచిత విద్యుత్తు" సౌకర్యం కుమ్మర్లు ఉపయోగించే "సారే" కు వర్తింప చేయాలి.

కుమ్మర్లకు గ్రామపంచాయతీ మున్సిపాలిటీ షాపింగ్ కాంప్లెక్స్ లో ఉచితంగా వసతి కల్పించాలి

కుమ్మర్లకు గ్రామ పంచాయతీ 'మున్సిపాలిటీ' మున్సిపల్ కార్పొరేషన్లలో షాపింగ్ కాంప్లెక్స్ ల్లో వసతి ఉచితంగా కల్పించాలి. కుమ్మర్ల ఉత్పత్తులకు "రైతు బజార్లలో" స్టోరేజ్ సౌకర్యం మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించాలి. పాటరీ కోర్స్ ను విశ్వ విద్యాలయాలలో పాఠ్యాంశంగా చేర్చాలి. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి.

కుమ్మర్లకు ప్రమాద బీమా భవిష్య నిధి పథకం వర్తింప చేయాలి

కేంద్ర ప్రభుత్వ భవిష్య నిధి పథకం ఇన్సూరెన్స్ ఆరోగ్యబీమా ప్రమాద బీమా సౌకర్యం కార్మిక మంత్రిత్వ శాఖ కుమ్మర వృత్తి దారులకు లేబర్ గుర్తింపు కార్డులు ఆరోగ్య కార్డులు ఉచితంగా ఇవ్వాలి.

కుమ్మర్లను పూజారులుగా నియమించాలి

ప్రభుత్వం ఎండోమెంట్స్ శాఖ ద్వార

గ్రామదేవాలయలలో( పోచమ్మ 'మైసమ్మ' గ్రామ దేవతలు) కుమ్మర కులస్తులను పూజారులుగా నియమిస్తూ జీ 'వో.జారీ చెయ్యాలి.కుమ్మర వృత్తిదారులు పెన్షన్ సౌకర్యం కల్పించాలి. కుమ్మర వృత్తి దారులకు ఉచితంగా విద్యుత్తుతో నడిచే సారె( ఆదునిక పరికరం) ఇవ్వాలి.

కుమ్మర శాలివాహన ఫైనాన్స్ ఫెడరేషన్ పునరుద్ధరించి పాలకమండలిని నియమించాలి

రాష్ట్ర ప్రభుత్వం కుమ్మర్ల సమగ్రాభివృద్ధికి ఆర్థిక వికాసానికి వృత్తి నైపుణ్య అభివృధి దోహదపడే "కుమ్మర / శాలివాహన ఫైనాన్స్ ఫెడరేషన్ కు రూ" "2000 కోట్ల బడ్జెట్ కేటాయించాలి. కుమ్మర ఫైనాన్స్ ఫెడరేషన్ ను పునరుద్ధరించి ఫెడరేషన్ కు ఛైర్మెన్' మరియు అన్నిజిల్లాకు ప్రాతినిధ్యం ఇస్తు పాలక వర్గాన్ని నియమించి కుమ్మర్లలో 'ఆత్మ గౌరవాన్ని" పెంపొందించాలి.

కుమ్మర్లలో రాజకీయ నాయకత్వాన్ని ప్రోత్సహించాలి

కుమ్మర్లలో నాయకత్వాన్ని ప్రోత్సహించే వాతావరణం

కల్పించేచర్యలుతీసుకోవాలి.కుమ్మర్లకు కార్పొరేషన్ పదవుల్లో నామినేట్ చేసి రాజ్యాధికారంలో భాగ స్వాములను చేయాలి.పర్యావరణ పరిరక్షణకు ప్రజారోగ్యానికి దోహదపడే మట్టి పాత్రల ఉత్పత్తితో కుమ్మర వృత్తి చేస్తున్న కార్మికులను ఆదుకోవాలి.కుమ్మర సామాజిక వర్గాన్ని ఆర్థికంగా విద్యా ఉపాధి అవకాశాలు కల్పించి ఆదుకోవాలి."కుమ్మర వృత్తిని రక్షించడమంటే మన జాతి నాగరికతను సంస్కృతిని రక్షించడమే" అన్న వాస్తవాన్ని మరవద్దు. కుమ్మర్ల సమగ్ర అభివృద్ధి కి సంక్షమానికి దోహధపడే విధానాలను రూపొందించి అమలు చేయాల్సిందిగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి కి విజ్ఞప్తి చేయనైనది.

# సినిమా



## 3 వారాల్లోనే స్ట్రీమింగ్

చార్మింగ్ స్టార్ శర్వానంద్ నటించిన లేటెస్ట్ మూవీ 'నారీ నారీ నడుమ మురారి'. 'సామజవరగమన' ఫేమ్ రామ్ అబ్బరాజు తెరకెక్కించిన ఈ చిత్రం.. క్లీన్ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకుల మనసు గెలుచుకుంది. ఈ ఏడాది సంక్రాంతి సీజన్‌లో భారీ సినిమాల మధ్య పోటీ ఉన్నప్పటికీ, తనదైన వినోదంతో బాక్సాఫీస్ వద్ద సూపర్‌హిట్ టాక్‌తెచ్చుకుంది. ఇక ఈ చిత్రం ఇప్పుడు ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ అవుతోంది. ఈ విషయాన్ని ఓటీటీ సంస్థ అధికారికంగా సోషల్ మీడియా వేదికగా వెల్లడిస్తూ కొత్త పోస్టర్‌ను విడుదల చేసింది. థియేటర్లలో విడుదలైన కేవలం 3 వారాల్లోనే ఈ సినిమా డిజిటల్ అరంగేట్రం చేయడం విశేషం. తెలుగుతో పాటు తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో, ఇంగ్లీష్ సబ్‌టైటిల్స్‌తో అందుబాటులో ఉంది. ఈ మూవీలో శర్వానంద్ సరసన సంయుక్త మేనన్, సాక్షి వైద్య హీరోయిన్లుగా నటించారు. సునీల్, నరేష్ విజయకృష్ణ, సంపత్ రాజ్, వెన్నెల కిషోర్, గెటప్‌శ్రీను, సిరి హనుమంతు, సంపత్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. యంగ్ హీరో శ్రీ విష్ణు స్పెషల్ క్యామియోలో కనిపించడం అభిమానులకు సర్‌ప్రైజ్‌గా మారింది. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రామబ్రహ్మం సుంకర ఈ చిత్రాన్ని నిర్మించగా, విశాల్ చంద్రశేఖర్ మ్యూజిక్‌అందించాడు.




## మెగా ఫ్యాన్స్‌కు సర్‌ప్రైజ్ గిఫ్టు

మెగా ఫ్యామిలీలో సందడి వాతావరణం నెలకొంది. ఇటీవల రామ్ చరణ్ సతీమణి ఉపాసనకు కవల పిల్లలు జన్మించడంతో అభిమానులు సైతం ఆనందంలో మునిగిపోయారు. ఇప్పటికే ఈ జంటకు క్లీంకార అనే కూతురు పుట్టిన సంగతి తెలిసిందే. తాజాగా ఉపాసనకు ట్విన్స్ జన్మించడంతో ఈ ఆనందం మరింత రెట్టింపైంది. అయితే ఈ శుభ సందర్భాన్ని పురస్కరించుకుని రామ్ చరణ్ దంపతులు మెగా ఫ్యాన్స్‌కు సర్‌ప్రైజ్ ఇచ్చారు. ఈ సంతోషం సమయంలో అభిమానులకు స్వీట్స్ పంపించారు. ఈ మేరకు ఓ అభిమాని గిఫ్ట్ బాక్స్ ఓపెన్ చేస్తున్న వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేసింది. ఇందులో రెండు రకాల స్వీట్స్ ఉన్నాయి. ఈ బహుమతిపై రామ్ చరణ్ ఉపాసనకు అభినందనలు. అపోలో నుంచి ఈ గిఫ్ట్ వచ్చిందని క్యాప్షన్ రాశారు. ఈ మెగా ఫ్యామిలీ వేడుకలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని ఫ్యాన్స్ అంటున్నారు. ఇక సినిమాల విషయానికి వస్తే.. రామ్‌చరణ్ ప్రస్తుతం పెద్ది అనే సినిమాలో నటిస్తున్నాడు. ఉప్పెన ఫేమ్ బుచ్చిబాబు సనా తెరకెక్కిస్తోన్న ఈ విలేజ్ స్పోర్ట్స్ డ్రామాలో బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ హీరోయిన్ గా నటిస్తోంది. అలాగే కన్నడ సూపర్ స్టార్ శివరాజ్ కుమార్ మరో కీలక పాత్రలో కనిపించనున్నారు.




## 'డెకాయిట్' మరోసారి వాయిదా.. కొత్త రిలీజ్ డేట్ ఇదే




అడివి శేష్ హీరోగా తెరకెక్కుతున్న రొమాంటిక్ యాక్షన్ మూవీ 'డెకాయిట్'. ఈ సినిమా వాయిదా పడనున్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న విషయం తెలిసిందే. తాజాగా ఆ వార్తలను నిజం చేస్తూ చిత్రబృందం కొత్త విడుదల తేదీని ప్రకటించింది. ఏప్రిల్ 10న దీన్ని రిలీజ్ చేయనున్నట్లు తెలిపింది. 2026 ఉగాదిని పురస్కరించుకుని మార్చి 19న ఈ సినిమాని విడుదల చేయాలని భావించారు. పోస్ట్ ప్రొడక్షన్ పనులు ఇంకా పూర్తికాకపోవడంతో దీన్ని వాయిదా వేసినట్లు తెలుస్తోంది. షానీల్ డియో దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సుప్రియ యార్లగడ్డ నిర్మిస్తున్నారు. బాలీవుడ్ దర్శక, నటుడు అనురాగ్ కశ్యప్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఆయన నటిస్తున్న తొలి తెలుగు చిత్రమిదే. విభిన్న ప్రేమకథతో తెరకెక్కుతున్న ఈ సినిమాలో తొలుత హీరోయిన్‌గా శ్రుతిహాసన్‌ను అనుకున్నారు.. కానీ, ఆమె స్థానంలోకి మృణాల్ ఠాకూర్ వచ్చారు. ఇటీవలే దీని షూటింగ్ కూడా పూర్తయింది. మొదట ఈ సినిమాను గతేడాది డిసెంబర్‌లో విడుదల చేయాలని భావించారు. ఆ తేదీ మార్చి 19కు మారింది. ఇప్పుడు మరోసారి వాయిదా వేసి ఏప్రిల్ 10న విడుదల చేయనున్నారు.

## ఆనంద క్షణాలను అసహ్యంగా మార్చకండి

### : వాళ్లకు లావణ్య త్రిపాఠి స్ట్రాంగ్ కౌంటర్



సోషల్ మీడియాలో వ్యక్తిగత విషయాల గురించి మాట్లాడటానికి ఆసక్తి చూపని లావణ్య.. ప్రస్తుతం చేసిన పోస్ట్ వైరల్‌గా మారింది. రామ్‌చరణ్ ఉపాసన దంపతులకు ఇటీవల కవలలు జన్మించడంతో మెగా అభిమానులు సంబరాలు చేసుకున్నారు. ఈసందర్భంగా చిరంజీవి కూడా మీడియాతో మాట్లాడుతూ తన ఆనందాన్ని వ్యక్తంచేశారు. అయితే, కొందరు చిరంజీవి ప్రెస్‌మీట్‌ను తప్పుపడుతూ విమర్శలు చేశారు. ఈతరంలో కూడా వారసుడి కోసం కోరుకునేవాళ్లు ఉన్నారా.. అని ఒక వ్యక్తి పెట్టిన పోస్ట్‌కు లావణ్య స్పందించారు. స్ట్రాంగ్ కౌంటర్ ఇస్తూ పోస్ట్ పెట్టారు. ''సాధారణంగా నేను ఇలాంటి పోస్ట్‌లపై స్పందించను. వాటిని అసలు పట్టించుకోను. కానీ, మీలాంటి వారి నుంచి ఇలాంటి వ్యాఖ్యలు ఊహించలేదు. మీ పోస్ట్ చాలా అభ్యంతరకరంగా ఉంది. ఆనంద క్షణాలను మీ కామెంట్స్‌తో అసహ్యంగా మార్చకండి. చిరంజీవి మా అందరితో ఎలా ఉంటారో మీకు తెలుసా.. ఆయన కుటుంబంలోని మహిళలను ముఖ్యంగా మనవరాళ్లను ఎలా చూసుకుంటారో మీకు తెలియదు. ఆయన మహిళలపై చూపే గౌరవంలో ఒక్క శాతం చూపే పురుషులు కూడా బయట తక్కువే. మీకు తెలియని విషయాల గురించి కామెంట్స్ చేయకపోవడం మంచిది'' అని తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. లావణ్య స్పందించిన అనంతరం ఆ వ్యక్తి తన పోస్ట్‌ను తొలగించడం గమనార్హం. ఉపాసన జనవరి 31న కవలలకు జన్మనిచ్చిన విషయం తెలిసిందే. ఆరోజు రాత్రే సోషల్ మీడియాలో ఆనందం వ్యక్తంచేసిన చిరంజీవి.. మరుసటి రోజు మీడియాతో మాట్లాడారు. చాలా సంతోషంగా ఉందని.. అభిమానులు దీన్ని పండుగలా భావిస్తున్నారని అన్నారు. వారి ఆనందానికి అవధుల్లేవని తెలిపారు.



## ఎమ్మెల్సీ ఆఫర్ రిజెక్ట్

టాలీవుడ్‌లో బండ్ల గణేష్ అంటే ముందుగా గుర్తొచ్చేది ఆయన ముక్కుసూటితనం. ఏ విషయం అయినా ముఖం మీదే చెప్పే స్వభావం, వెనుకా ముందు ఆలోచించకుండా మాట్లాడే స్టైల్‌తో ఆయన ప్రసంగాలు తరచూ సోషల్ మీడియాలో వైరల్ అవుతుంటాయి. అదే సమయంలో పవన్ కల్యాణ్‌పై ఆయనకు అచంచలమైన భక్తిభావం ఉంది. ఎవరు ఎంత ప్రలోభ పెట్టినా, పవన్‌పై మాత్రం తన అభిప్రాయం ఎప్పుడూ మారదని ఆయన ఎన్నో సందర్భాల్లో నిరూపించాడు. ఈ నేపథ్యంలో తాజాగా ఆయన ఇచ్చిన ఓ ఇంటర్వ్యూ వీడియో సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. ఒక రాజకీయ పార్టీకి చెందిన వ్యక్తి తనకు ఫోన్ చేసి పిలిచాడట. అక్కడికి వెళ్లిన తర్వాత ఎమ్మెల్సీ పదవి ఇస్తామని చెప్పాడట. అయితే ప్రతిరోజూ ప్రెస్ మీట్ పెట్టి పవన్ కళ్యాణ్‌ను విమర్శించాలని షరతు పెట్టారట. మరి పవర్ స్టార్‌పై వీరాభిమానం కలిగిన బండ్ల ఒప్పుకుండాటా.. తన శరీరం బూడిద అయిపోయినా, ఆ బూడిద కూడా పవన్ కల్యాణ్‌ను తిట్టదని ఆ ఆఫర్‌ను తిరస్కరించి బయటకు వచ్చేశాడట.



## 'వారణాసి'కి 'అవతార్'తో పోలిక.. రాజమౌళి ఏమన్నారంటే!

రాజమౌళి దర్శకత్వంలో మహేశ్ బాబు హీరోగా రానున్న 'వారణాసి' ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రెండింగ్ అవుతోంది. ఎన్నో రోజుల నుంచి అప్‌డేట్స్ కోసం ఎదురుచూసిన అభిమానులకు ఈరోజు చాలా విశేషాలు వచ్చేశాయి. చిత్రబృందం ఓ హాలీవుడ్ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో 'వారణాసి' గురించి పంచుకుంది. దీంతో ఈ చిత్రం ఒక్కసారిగా సోషల్‌మీడియాలో ట్రెండ్ అవుతోంది. రాముడిగా కనిపించనున్నట్లు మహేశ్‌బాబు అధికారికంగా వెల్లడించారు. ఇక రాజమౌళి ఈ సినిమా నిడివితో పాటు 'అవతార్'తో పోల్చడం గురించి మాట్లాడారు. ''నాకు ఉన్న కొన్ని కమిట్‌మెంట్‌ల కారణంగా మహేశ్‌బాబుతో సినిమా ఆలస్యం అయింది. లేదంటే 15 ఏళ్ల క్రితమే తీసేవాడిని. ఇప్పుడు వారణాసిని భారీ స్థాయిలో విడుదల చేస్తున్నాం. ప్రపంచవ్యాప్తంగా ఐమ్యాక్స్‌లలో సందడి చేయనుంది. నేను సినిమాలు ఆలస్యం చేస్తాననే చెడ్డపేరు ఉంది. ప్రొడక్షన్ పనులు లేట్ చేస్తానని వాయిదాలు వేస్తానని అంటారు. ఈ విషయంలో నెటిజన్లు కూడా చాలాసార్లు కామెంట్స్ చేశారు. 'వారణాసి' 3.20 గంటల నిడివితో విడుదలవుతుంది. ఇంత ఎక్కువ నిడివిలో మూడు నిమిషాలు ఆసక్తిగా లేకపోయినా వెంటనే ఆడియన్స్ ఫోన్ తీసుకుంటారు. మేం అందుకే చాలా జాగ్రత్తగా ఎక్కడా బోర్ కొట్టకుండా దీన్ని రూపొందిస్తున్నాం. ప్రేక్షకుడికి ప్రతి క్షణం ఆసక్తి కలిగేలా.. కొత్త అనుభవాన్ని ఇచ్చేలా దీన్ని తీర్చిదిద్దుతున్నాం'' అని రాజమౌళి తెలిపారు. హాలీవుడ్ దర్శకుడు జేమ్స్ కామెరూన్ సృష్టించిన ప్రపంచం 'అవతార్'తో రాజమౌళి 'వారణాసి'ని పోల్చడంపై ఆయన మాట్లాడారు. ''అలాంటి వ్యక్తితో పోల్చడాన్ని చాలా గౌరవంగా భావిస్తున్నా. కానీ, ఆయనతో నన్ను పోల్చొద్దు. ఆయన ఒక శిఖరం. ఆయన మాస్టర్. నేను ఇంకా విద్యార్థినే. 'వారణాసి'లో 25 నిమిషాలు పురాణాలపై చిత్రీకరించాం. ప్రేక్షకులు ఎప్పటికీ ఆ సన్నివేశాలను మర్చిపోలేరు. ప్రస్తుతం ఇంతవరకూ మాత్రమే చెప్పగలను'' అని దర్శకధీరుడు తెలిపారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.



# బీసీలను రాజ్యాధికారానికి దూరం చేస్తున్న మోడీ ప్రభుత్వం

* జనగణనలోనే కులగణన చేయాలి
* కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి

ఆదిలాబాద్ జిల్లా, ఫిబ్రవరి 04 (భారత శక్తి): కేంద్రంలోని మోడీ ప్రభుత్వం బీసీ ప్రధానమంత్రి అని చెబుతూ బీసీలను రాజ్యాధికారానికి దూరం చేస్తుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి విమర్శించారు.బోథ్ మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి తో కలిసి పాత్రికేయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 30, 2025న కేంద్ర కేబినెట్ జనగణన లోనే కులగణన నిర్వహిస్తామని చెప్పి జనవరి 22న కేవలం జనగణన కోసం నోటిఫికేషన్ విడుదల చేశారని తెలిపారు.తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కులగణన జరిపి దేశానికే రోల్ మోడల్ గా నిల్చామని, కులాల వారిగా వాటాలు తేల్చి రాజకీయ రిజర్వేషన్లు కూడా కల్పించామని పేర్కొన్నారు.జనగణలో కేవలం ఎస్సీ, ఎస్టీల జనగణ మాత్రమే చేస్తున్నారని అన్ని కులాలు, ఉప కులాల వారిగా నిర్ధారించి బడ్జెట్ కేటాయింపులు, సంక్షేమ ఫలాలు, ప్రత్యేక రాయితిలు కల్పించే అవకాశం ఉంటుందని మేమెంతో మాకంతా నినాదాన్ని తుంగలో తొక్కి దొడ్డి దారిలో రాజ్యాధికారానికి దూరం చేస్తుందని విమర్శించారు.రాష్ట్రంలోని బీసీ సంఘాలు



బిజెపి ఎంపీలపై ఒత్తిడి పెంచి పార్లమెంట్లో చర్చ జరిపించే విధంగా ఒత్తిడిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అందూర్ గ్రామ సర్పంచ్ పెందూర్ పృథ్వీరాజ్, నక్కలవాడ గ్రామ సర్పంచ్ అడప నవీన్ కుమార్, దన్నూర్ సర్పంచ్ ఎల్మ రోహిణి వినయ్ రెడ్డి, కుచలాపూర్ ఉపసర్పంచ్ సుద్దుల అరుణ్ రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ మహమ్మద్ అబ్రార్, సీనియర్ నాయకులు మెరుగు భోజన్న, పన్నాల చమేందర్ రెడ్డి, కోలా ప్రశాంత్, తరుణ్, యువ నాయకులు అచ్యుతానంద రెడ్డి, ఎస్టీ సెల్ జిల్లా నాయకులు ఉమేష్ జాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## పార్టీకి వ్యతిరేకంగా పనిచేసిన ముగ్గురు కాంగ్రెస్ నాయకులపై సస్పెన్షన్ వేటు

సంగారెడ్డి, ఫిబ్రవరి 4 (భారత శక్తి): కాంగ్రెస్ పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా కౌన్సిలర్ ఎన్నికల్లో పనిచేస్తున్న ముగ్గురు నాయకులను పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు సమన్వయ కమిటీ సభ్యులు తోపాజి అనంత కిషన్, రఘుగౌడ్, బొంగుల రవి బుధవారం తెలిపారు. 29 వార్డులో సునీల్ జై కుమార్, 30 వార్డులో నవాత్ నాగరాజు, 18 వార్డులో సల్మాన్ మాలిక్ యువజన కాంగ్రెస్ నాయకుడిని పార్టీ నుంచి బహిష్కరించినట్లు వారు సంయుక్తంగా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ అభ్యర్థులకు వ్యతిరేకంగా పనిచేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల్లో



పార్టీ నిర్ణయాలకు కట్టుబడి పనిచేయాలని, దిశా నిర్దేశం చేశారు. బీఫాంలు అందుకున్న అభ్యర్థుల విజయానికి అంతిమంగా కృషి చేయాలని సూచించారు. పార్టీకి నష్టం చేకూర్చేలా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని శ్రేణులను హెచ్చరించారు.

## ఫార్మాస్యూటికల్ పరిశోధనలో డాక్టర్ ఆంజనేయులుకు పీహెచ్.డీ

సంగారెడ్డి, ఫిబ్రవరి 4 (భారత శక్తి): ఫార్మాస్యూటికల్ పరిశోధనను విజయవంతంగా పూర్తిచేసిన హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ పరిశోధక విద్యార్థి పాటంశెట్టి ఆంజనేయులును డాక్టరేట్ వరించింది. 'ఎంచుకున్న ఔషధాల (ఇరినోటెకాన్, సునిటినిబ్) మెరుగైన క్యాన్సర్ నిరోధక సామర్థ్యం కోసం అల్ట్రాసౌండ్ఆధారిత నానోబబుల్ ఔషధ పంపిణీకి మార్గదర్శనం' అనేఅంశంపైఆయనఅధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న ఫార్మసీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.శివకుమార్ బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు.కొలొరెక్టర్ క్యాన్సర్ చికిత్సలో వైద్యపరంగా ఆమోదించబడిన క్యాన్సర్ నిరోధక మందులు, ఇరినోటెకాన్, సునిటినిబ్ ల చికిత్సా సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి డెక్స్ట్రాన్ఆధారిత, అల్ట్రాసౌండ్ప్రతిస్పందించే



నానోబబుళ్లను అభివృద్ధి చేయడంపై డాక్టర్ ఆంజనేయులు పరిశోధన దృష్టి సారించినట్టు తెలియజేశారు. ఈ అధ్యయనం గణనీయంగా మెరుగైన ఔషధ విడుదల, జీవ లభ్యత, క్యాన్సర్ నిరోధక కార్యకలాపాలను, తగ్గిన దైహిక విషప్రక్రియను ప్రదర్శించిందన్నారు. ఈ పరిశోధన ఫలితాలు నానోబబుల్ సహాయ ఔషధ పంపిణీని లక్ష్య, ఉద్దీపనలకు ప్రతిస్పందించే క్యాన్సర్ చికిత్సకు ఒక ఆశాజనక వేదికగా నిర్ధారిస్తాయని, భవిష్యత్తులో క్లినికల్ అనువాదానికి బలమైన సామర్థ్యాన్ని అందిస్తాయని వివరించారు. డాక్టర్ ఆంజనేయులు సమర్పించిన సిద్ధాంత వ్యాసం పీహెచ్డీ పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం విశ్వవిద్యాలయం, హైదరాబాద్ అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, పలు విభాగాల అధిపతులు, సిబ్బంది పలువురు అభినందించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్‌గా జల్కె పాండురంగ్ రెండోసారి ఎన్నిక

ఆదిలాబాద్ జిల్లా, ఫిబ్రవరి 04 (భారత శక్తి): ఆదిలాబాద్ జిల్లా బజార్ హత్నూర్ మండల కాంగ్రెస్ పార్టీ కన్వీనర్‌గా జల్కె పాండురంగ్‌ను రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం మండల కేంద్రంలోని తిరుమల ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన మండల స్థాయి సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు.ఈ సమావేశానికి మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సమావేశంలో జల్కె పాండురంగ్ పేరును ప్రతిపాదించగా, హాజరైన సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. గత కాలంలో మండల స్థాయిలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడంలో, ప్రజా సమస్యలపై పోరాటం చేయడంలో ఆయన పోషించిన కీలక పాత్రను గుర్తించి మరోసారి ఈ బాధ్యతలు అప్పగించినట్లు పార్టీ నాయకులు పేర్కొన్నారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన మండల



కన్వీనర్ జల్కె పాండురంగ్ మాట్లాడుతూ, తనపై మరోసారి నమ్మకం ఉంచిన కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం, నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడతానని తెలిపారు. కార్యకర్తలందరినీ కలుపుకొని మండలంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా పనిచేస్తానని స్పష్టం చేశారు.సమావేశంలో పాల్గొన్న మండల కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, జల్కె పాండురంగ్ నాయకత్వంలో పార్టీకి మండలంలో మంచి ప్రజాదరణ లభించిందని తెలిపారు. రానున్న రోజుల్లో ఆయన నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలంగా ఎదుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మండల, గ్రామ స్థాయి కాంగ్రెస్ పార్టీ నాయకులు, సీనియర్ కార్యకర్తలు, యువ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రూ.15 లక్షల లంచం.. ఏసీబీకి చిక్కిన కూకట్‌పల్లి ఎస్‌ఈ

హైదరాబాద్, ఫిబ్రవరి 4 (భారత శక్తి): ఏసీబీ అధికారుల వలలో భారీ అవినీతి తిమింగలం పడింది. రూ. 15 లక్షలు లంచం తీసుకుంటూ కూకట్‌పల్లి జోన్ ఎస్‌ఈ చిన్నారెడ్డి అధికారులకు చిక్కారు. జీహెచ్ఎంసీ కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో ఏసీబీ తనిఖీలు చేపట్టింది. వివిధ పత్రాలను అధికారులు పరిశీలిస్తున్నారు. చిన్నారెడ్డి ఆస్తులు, ఇతర అంశాలపై ఏసీబీ ఆరా తీస్తోంది. బిల్లులు మంజూరు చేయాలంటే లంచం ఇవ్వాలని ఒక కాంట్రాక్టర్‌ను డిమాండ్ చేసినట్లు సమాచారం. దీంతో సదరు కాంట్రాక్టర్ ఏసీబీని ఆశ్రయించారు.

## భైంసా మున్సిపాలిటీలో ఎన్నికల ఖర్చులపై అవగాహన సమావేశం

* ఎన్నికల వ్యయాల పరిశీలన తేదీలపై అభ్యర్థులకు స్పష్టత

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 04 (భారత శక్తి):తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న రెండో సాధారణ పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో, భైంసా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఎన్నికల ఖర్చులు మరియు ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై అభ్యర్థులకు అవగాహన కల్పించే ప్రత్యేక సమావేశం భైంసా మున్సిపల్ కౌన్సిల్ హాలులో నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. జిల్లా ఎక్స్‌పెండిచర్ అబ్జర్వర్ సుజా ఉద్దీన్ మరియు నోడల్ అధికారి జె. నర్సింహ నేతృత్వంలో ఈ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా ఎన్నికల ఖర్చులకు సంబంధించిన నిబంధనలను అధికారులు వివరించడంతో పాటు, అభ్యర్థులు వ్యక్తం చేసిన సందేహాలను నివృత్తి చేశారు.




ఎన్నికల ఖర్చుల ఖాతాల పరిశీలన మరియు సమన్వయ (స్క్రూటినీ / రికన్సిలియేషన్) సమావేశాలు భైంసా మున్సిపల్ కార్యాలయం రెండో అంతస్తులో నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సమావేశాలకు అభ్యర్థులు లేదా వారి అధీకృత ఎన్నికల ఏజెంట్లు తప్పనిసరిగా హాజరై, ఎన్నికల ఖర్చుల ఖాతాలు, ప్రత్యేక బ్యాంకు ఖాతా స్టేట్‌మెంట్, అసలు బిల్లులు, వౌచర్లు, రసీదులు, వాహన అనుమతులు, లాగ్‌బుక్స్ తదితర అవసరమైన పత్రాలను సమర్పించాలని సూచించారు. షాడో అబ్జర్వేషన్ రిజిస్టర్ (SOB)లో నమోదు చేసిన వివరాలకు అనుగుణంగా ఖర్చుల వివరాలు సరైనవిగా ఉండాలని, సమావేశాలకు హాజరు కాకపోతే లేదా అవసరమైన పత్రాలు సమర్పించకపోతే ఎన్నికల నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

## విద్యార్థుల ప్రతిభ వెలికితీతకు జీడిమెట్లలో టాలెంట్ టెస్ట్

జీడిమెట్ల, ఫిబ్రవరి 4 (భారత శక్తి): విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయాలనే ఉద్దేశంతో, ఫ్రెండ్లీ పోలీసు కార్యక్రమంలో భాగంగా జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఐదు ప్రభుత్వ పాఠశాలల 10వ తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించామని జీడిమెట్ల ఇన్ స్పెక్టర్ గడ్డం మల్లేష్ తెలిపారు. చిల్డ్రన్ ఫ్రెండ్లీ పోలీస్ భావనకు అనుగుణంగా ఈ టాలెంట్ టెస్ట్‌కు జీడిమెట్ల ప్రాంతంలోని ఐదు ప్రభుత్వ పాఠశాలల నుంచి మొత్తం 366 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థుల జ్ఞానం, ఆలోచనా సామర్థ్యం, విశ్లేషణాత్మక నైపుణ్యాలను గుర్తించే విధంగా ప్రశ్నాపత్రం రూపొందించామన్నారు.ఈ పరీక్షలో ప్రతిభ చూపిన ప్రతి పాఠశాల నుంచి ముగ్గురు చొప్పున ఉత్తమ విద్యార్థులను ఎంపిక చేసి, వారికి నేషనల్



రిమోట్ సెన్సింగ్ సెంటర్‌కు విజిట్ ఏర్పాటు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ విజిట్ ద్వారా విద్యార్థులకు విజ్ఞానశాస్త్రం, సాంకేతిక పరిజ్ఞానం పట్ల ఆసక్తి పెంపొందించడమే లక్ష్యంగా ఉందన్నారు. పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఇటువంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తామని, విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించడంలో పోలీసు శాఖ ఎల్లప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు.

## మార్కెట్‌లో హ్యాండ్‌బ్యాగ్ చోరీ, ముగ్గురు దొంగల అరెస్టు

సైబరాబాద్, , ఫిబ్రవరి 4 (భారత శక్తి): కూరగాయల మార్కెట్‌లో రద్దీని ఆసరాగా చేసుకుని మహిళల హ్యాండ్‌బ్యాగులు దొంగిలిస్తున్న ముగ్గురు మహిళలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌హెచ్‌ఓ కె.వి.సుబ్బారావు తెలిపారు.మూసాపేట ప్రగతినగర్‌కు చెందిన లోపెట్టి నాగమణి గత నెల 13న రాత్రి స్థానిక మార్కెట్‌లో కూరగాయలు కొంటుండగా గుర్తుతెలియని వ్యక్తులు ఆమె హ్యాండ్‌బ్యాగ్‌ను అపహరించారు. అందులో రూ.40 వేల నగదు ఉన్నట్లు బాధితురాలు జనవరి 17న పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టి ఈరోజు ఉదయం వై జంక్షన్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ముగ్గురు మహిళలను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో వారు ఫతేనగర్, సనత్‌నగర్‌కు చెందిన




బండారి షాలిని(34), గంబూ మహేశ్వరి(43), ఉప్పు సరిత(38)గా గుర్తించారు. నిందితులు రద్దీగా ఉండే ప్రాంతాలు, జాతరలను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్నట్లు ఎస్‌హెచ్‌ఓ వెల్లడించారు. నిందితుల నుంచి రూ.1,500 నగదును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మార్కెట్లు, మాల్స్ వంటి రద్దీ ప్రదేశాలకు వెళ్లే మహిళలు తమ వెంట తెచ్చుకునే బ్యాగులు, నగదు విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

## కుష్టు రహిత సమాజ స్థాపనకు కృషి చేయండి

* జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

వైయస్సార్ కడప, ఫిబ్రవరి 4(భారత శక్తి): కుష్టు రహిత సమాజ స్థాపనకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. సభ భవన్ లో స్పర్శ లేప్రసి అవగాహన కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టరు డాక్టర్ శ్రీధర్ చెరుకూరి,జిల్లా జాయింట్ కలెక్టర్ నిధి మీనా,డిఆర్ఓ విశ్వేశ్వర్ నాయుడు లతో కలసి జనవరి 30 నుండి ఫిబ్రవరి 13న తేది వరకు జిల్లా వ్యాప్తంగా లెప్రసి వ్యాధిపై అవగాహన కార్యక్రమాలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఏ వ్యక్తి కి అయిన స్పర్శ లేని తెలుపు, ముదురు గోధుమ రంగు మచ్చలు ఉంటే సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. రోగి రోగ నిరోధక శక్తి పెంపొందించుకోవడం ద్వారా వ్యాధులు



దరిచేరమన్నారు.కుష్టు రహిత సమాజ స్థాపనకు కృషి చేయాలని,జనవరి 30 నుండి ఫిబ్రవరి 13న తేది వరకు జిల్లావ్యాప్తంగా లెప్రసి వ్యాది పై అవగాహన కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో విజయవంతంగా నిర్వహించాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య శాఖ అధికారి డా.నాగరాజు, అదనపు జిల్లా వైద్యాధికారి డా.రవి సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా ప్రక్షాళనకు రాజకీయ పార్టీలు సహకరించాలి

* **ఎల్బీ నగర్ నియోజకవర్గ ఈ.ఆర్.ఓ.బి. వంశీ కృష్ణ,సరూర్ నగర్ ఏఈఆర్ఓ బి. శ్రీనివాస్, ఎల్బీ నగర్ డిప్యూటీ కమిషనర్ కె. మల్లికార్జున్,**
* **రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం**
* **బూత్ స్థాయి ఏజెంట్ల(BLA) నియామకానికి ఆదేశం**



ఎల్బీనగర్, ఫిబ్రవరి 4 (భారత శక్తి) : ఓటర్ల జాబితాను పారదర్శకంగా, దోషరహితంగా రూపొందించడంలో రాజకీయ పార్టీల పాత్ర కీలకమని ఎల్బీ నగర్ నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్, హయత్ నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శ్రీ బి. వంశీ కృష్ణ అన్నారు. బుధవారం ఉదయం 11 గంటలకు ఆయన కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, ఓటర్ల జాబితాలో తప్పులు లేకుండా చూడటమే లక్ష్యంగా 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ 2002' ప్రక్రియను చేపట్టామని వివరించారు.

* **క్షేత్రస్థాయిలో సమన్వయం అవసరం:**

ఓటర్ల జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరికీ చోటు కల్పించాలని, అదే సమయంలో చనిపోయిన వారు, చిరునామాలు మారిన వారి పేర్లను తొలగించాలని వంశీ కృష్ణ సూచించారు. ఇందుకోసం ప్రతి రాజకీయ పార్టీ తమ తరపున ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలో బూత్ స్థాయి ఏజెంట్లను (BLA) వెంటనే నియమించుకోవాలని కోరారు. నిర్ణీత ప్రొఫార్మాలో వీరి వివరాలను కార్యాలయానికి సమర్పించాలని, తద్వారా వారు క్షేత్రస్థాయిలో బూత్ స్థాయి అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఇంటింటి సర్వే సజావుగా సాగేలా చూడాలని కోరారు.

* **పాల్గొన్న అధికారులు - ప్రతినిధులు:**

ఈ సమావేశంలో సరూర్ నగర్ ఏఈఆర్ఓ బి. శ్రీనివాస్, ఎల్బీ నగర్ డిప్యూటీ కమిషనర్ కె. మల్లికార్జున్ రావు, హయత్ నగర్ డిటీ అనిల్ కుమార్, ఎన్నికల డిటీ పి.వి.ఎల్. కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. రాజకీయ పార్టీల తరపున కాంగ్రెస్ ప్రతినిధులు బుడ్డ సత్యనారాయణ, చర్ల రమేష్, సీపీఐ నుంచి బాతరాజు నర్సిమ్మ, రమావత్ సక్రు నాయక్, సీపీఐ(ఎం) నుంచి కె. నర్సిరెడ్డి, చింతపల్లి కృష్ణయ్య, సీపీఎం నుంచి ఎ. యల్లయ్య, ఎం. నరహరి, కె. గణేష్ గౌడ్ మరియు విద్యార్థుల రాజకీయ పార్టీ ప్రతినిధి కె. అనికేత్ హాజరయ్యారు. ఓటర్ల జాబితా సవరణలో తాము పూర్తి సహకారం అందిస్తామని ఈ సందర్భంగా పార్టీ ప్రతినిధులు అధికారులకు హామీ ఇచ్చారు.

## కొత్తపేట కార్పొరేటర్ పవన్ కుమార్ మాతృమూర్తి కన్నుమూత



కొత్తపేట, ఫిబ్రవరి 4 (భారత శక్తి) : కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయకోటి పవన్ కుమార్ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. ఆయన మాతృమూర్తి శ్రీమతి నాయకోటి సులోచన (68) బుధవారం తుదిశ్వాస విడిచారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె, పరిస్థితి విషమించడంతో పరమపదించారు. సులోచన గారి మరణవార్త తెలియగానే నియోజకవర్గంలో విషాద ఛాయలు అలముకున్నాయి. ఆమె మృతి పట్ల పలువురు రాజకీయ నాయకులు, సామాజిక కార్యకర్తలు మరియు డివిజన్ ప్రజలు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.

**ప్రముఖుల సంతాపం:**

పవన్ కుమార్ మాతృమూర్తి మరణం పట్ల స్థానిక నాయకులు సంతాపం ప్రకటించారు. "ఈ కష్ట సమయంలో పవన్ కుమార్ గారికి, వారి కుటుంబ సభ్యులకు ఆ భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని, దివంగత ఆత్మకు శాంతి చేకూరాలని" వారు ప్రార్థించారు. సులోచన గారు మృదుస్వభావిగా, సేవా దృక్పథం కలిగిన వ్యక్తిగా పేరుపొందారు. ఆమె అంతిమ యాత్ర రేపు ఉదయం జరగనున్నట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. ఆమె మృతికి సంతాపంగా పలువురు కార్యకర్తలు తమ సామాజిక మాధ్యమాల వేదికగా నివాళులర్పిస్తున్నారు.





## హయత్ నగర్ అభివృద్ధికి మహర్దశ
# రూ. 83 లక్షలతో రహదారుల నిర్మాణం..!

* **డివిజన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం.. నాణ్యతలో రాజీ పడొద్దు**
* **పనులకు శంకుస్థాపన చేసిన కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి**



హయత్ నగర్, , ఫిబ్రవరి 4 (భారత శక్తి): భారత శక్తి హయత్ నగర్ డివిజన్ వ్యాప్తంగా మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా అభివృద్ధి పనులు పరుగులు పెడుతున్నాయి. బుధవారం డివిజన్ పరిధిలోని వివిధ కాలనీల్లో సుమారు 83 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న నూతన సీసీ రోడ్ల నిర్మాణ పనులకు స్థానిక కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి గారు శంకుస్థాపన చేశారు. శివశక్తి నగర్, సూర్య తేజ కాలనీ, విద్యా నగర్ కాలనీలలో జరిగిన ఈ కార్యక్రమాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని పనులను ప్రారంభించారు.

* **శివశక్తి నగర్‌లో రూ. 16.50 లక్షల పనులు**

శివశక్తి నగర్ వాసుల చిరకాల వాంఛను నెరవేరుస్తూ రూ. 16.50 లక్షల వ్యయంతో సీసీ రోడ్ల పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్రజలు ఎదుర్కొంటున్న రహదారి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు నాణ్యమైన సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. వర్షాకాలంలో ప్రజలకు రవాణా ఇబ్బందులు కలగకుండా త్వరితగతిన పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

* **సూర్య తేజ కాలనీలో రూ. 23.50 లక్షలతో శ్రీకారం**

సూర్య తేజ కాలనీలో అంతర్గత రహదారుల అభివృద్ధికి రూ. 23.50 లక్షల నిధులను వెచ్చించనున్నట్లు నవజీవన్ రెడ్డి తెలిపారు. "నా పదవీ కాలం ముగియనున్నప్పటికీ, గత ఐదేళ్లుగా ప్రజలకు ఏ విధంగా అందుబాటులో ఉన్నానో.. రాబోయే రోజుల్లో కూడా అదే అంకితభావంతో సేవ చేస్తాను" అని ఆయన పేర్కొన్నారు. కాలనీల సమగ్ర అభివృద్ధి కోసం దశలవారీగా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వెల్లడించారు.

* **విద్యా నగర్‌లో రూ. 43 లక్షల భారీ వ్యయంతో..**

విద్యా నగర్ కాలనీలో అత్యంత ప్రాధాన్యత కింద రూ. 43 లక్షల అంచనా వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ప్రతి వీధి అభివృద్ధి చెందితేనే డివిజన్ మొత్తం ఆదర్శంగా మారుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, ఎక్కడా రాజీ పడకూడదని అధికారులకు మరియు కాంట్రాక్టర్లకు స్పష్టం చేశారు.

* **గర్వంగా ఉందన్న కాలనీ వాసులు:**

చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న తమ రోడ్ల సమస్యలను పరిష్కరించేందుకు కార్పొరేటర్ చొరవ తీసుకోవడం పట్ల కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాల్లో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి భాస్కర్, నాయకులు సంఘీ అశోక్, గంగాని శ్రీనివాస్ మరియు ఆయా కాలనీల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, పెద్ద సంఖ్యలో కాలనీవాసులు




## సిద్ధి వినాయక హిల్స్‌లో సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేసిన కార్పొరేటర్ ముద్దుల వచ్చిరెడ్డి

బీఎన్ రెడ్డి నగర్, ఫిబ్రవరి 4 (భారత శక్తి): డివిజన్ పరిధిలోని శ్రీ సిద్ధి వినాయక హిల్స్ కాలనీలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. సుమారు రూ. 19 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్ల పనులకు స్థానిక కార్పొరేటర్ ముద్దు లచ్చిరెడ్డి బుధవారం ఘనంగా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీవాసుల చిరకాల కోరిక మేరకు నిధులు మంజూరు చేయించామని, త్వరలోనే పనులు ప్రారంభించి నాణ్యతతో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. డివిజన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని, కాలనీల్లోని సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. మౌలిక వసతుల కల్పనలో ఎక్కడా రాజీ పడబోమని ఆయన పేర్కొన్నారు.

**పాల్గొన్న ముఖ్యులు:**

ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, రాజకీయ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.
కాలనీ కమిటీ: అధ్యక్షుడు సుబ్బారావు యాదవ్, ఉపాధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్, గీతారాణి, ప్రధాన కార్యదర్శి మహేందర్ రెడ్డి, కోశాధికారి సుధాకర్ రెడ్డి.
సలహాదారులు & సభ్యులు: కైలాసవతి, భాస్కర్, బ్రహ్మయ్య, సంపత్ కుమార్, వెంకటేశ్వరరావు, శ్రీకాంత్, భారతి తదితరులు.
పార్టీ ప్రతినిధులు: డివిజన్ ప్రధాన కార్యదర్శి గంగం ప్రేమ్ నాథ్, విష్ణువర్ధన్ రెడ్డి, బీజేవైఎం అధ్యక్షులు సురేష్ కుమార్ పాల్గొన్నారు.

## ఆధునిక హెల్త్ కేర్ టెక్నాలజీ పై
# ఐఐటీలో జాతీయ వర్క్ షాప్



సంగారెడ్డి, ఫిబ్రవరి 4 (భారత శక్తి): ఆరోగ్య పరిశోధన సాంకేతిక పురోగతులపై ఏఎన్ఆర్ఎఫ్ పేర జాతీయ వర్క్ షాప్ ను ఐఐటి హైదరాబాద్ కంది లో మంగళవారం నిర్వహించారు. ఏఎన్ఆర్ ఎఫ్ పేరు కార్యక్రమం కింద దేశవ్యాప్తంగా ఐదు స్పోక్ సంస్థలకు మార్గ నిర్దేశం చేసేలా హబ్ సంస్థ ఐఐటిహెచ్ వ్యవహరిస్తుందన్నారు. ఏఐ యాదారిత నిర్ణయాలు బయోటెక్నాలజీ ట్రాన్స్ నేషనల్ పరిశోధనలపై నిపుణుల ఉపన్యాసాలు ప్రాక్టికల్ శిక్షణ పై ప్రత్యేక దృష్టి సారించారు. భారతీయ సాంకేతిక సంస్థ హైదరాబాద్ అనుసంధాన పరిశోధనల వేగవంతం చేయడానికి ఉద్దేశించిన అనుసంధాను నేషనల్ రీచార్జ్ ఫౌండేషన్ ఆరోగ్య పరిశోధన సాంకేతిక పురోగతులు అనే అంశంపై మూడు రోజుల జాతీయ వర్క్ షాపు జనవరి 29 నుంచి 31 వరకు నిర్వహించడం జరిగింది. ఈ వర్క్ షాప్ ప్రధాన ప్రాజెక్టు లపై విస్తృతంగా వర్క్ షాపులో చర్చించడం జరిగింది. ఆరోగ్య పరిశోధనలో జాతీయ స్థాయిలో కీలక ప్రేరక శక్తిగా నిలుపుతుందన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు స్కాలర్లు విద్యార్థులు పాల్గొన్నారు.

## క్యాన్సర్ రహిత సమాజమే లక్ష్యం: టీకేఆర్ విద్యా సంస్థల్లో ప్రపంచ రికార్డు

**పదివేల మంది విద్యార్థులతో భారీ 'పింక్ రిబ్బన్' రూపకల్పన**

**వరల్డ్ బుక్ ఆఫ్ లండన్‌లో చేరిన మహేశ్వరం ఘనత.**



మహేశ్వరం, ఫిబ్రవరి 4 (భారత శక్తి): ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మహేశ్వరం నియోజకవర్గంలోని తీగల కృష్ణారెడ్డి (టీకేఆర్) ఇంజనీరింగ్ కళాశాల వేదికగా అరుదైన ఘట్టం ఆవిష్కృతమైంది. టీకేఆర్ ఎడ్యుకేషన్ సొసైటీ, బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పదివేల మందికి పైగా విద్యార్థులు పాల్గొని 'పింక్ రిబ్బన్' ఆకారాన్ని ప్రదర్శించారు. క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తూ విద్యార్థులు చేసిన ఈ ప్రతిజ్ఞ 'వరల్డ్ బుక్ ఆఫ్ లండన్'లో చోటు సంపాదించుకుంది.

* **ఇండోనేషియా రికార్డు కనుమరుగు:**

గతంలో ఇండోనేషియాలో 8,000 మందితో నిర్వహించిన క్యాన్సర్ రిబ్బన్ కార్యక్రమమే ఇప్పటివరకు ప్రపంచ రికార్డుగా ఉండేది. తాజాగా టీకేఆర్ కళాశాల విద్యార్థులు 10,000 మందికి పైగా పాల్గొని ఆ రికార్డును అధిగమించారు. ఈ సందర్భంగా 'వరల్డ్ బుక్ ఆఫ్ లండన్' ప్రతినిధి డాక్టర్ ఇలియాజర్ కళాశాల యాజమాన్యానికి రికార్డు పత్రాన్ని అందజేశారు. "10000 Hearts One Ribbon Pledge" పేరుతో నిర్వహించిన ఈ కార్యక్రమం క్యాన్సర్ రహిత రేపటి కోసం ఒక బలమైన ఆకాంక్షను చాటిచెప్పింది.

* **అవగాహనే ఆయుధం: తీగల కృష్ణారెడ్డి**

కళాశాల వ్యవస్థాపక చైర్మన్ తీగల కృష్ణారెడ్డి మాట్లాడుతూ, వయస్సుతో సంబంధం లేకుండా నేడు క్యాన్సర్ మహమ్మారి అందరికీ విస్తరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం విద్యాబోధనే కాకుండా, సామాజిక బాధ్యతగా విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకే ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. వేలాది మంది విద్యార్థులు ఒక్కటిగా చేరి ఈ ప్రపంచ రికార్డు సృష్టించడం సంతోషకరమన్నారు.

* **ముందస్తు పరీక్షలతోనే నివారణ:**

బసవతారకం ఆస్పత్రి సీఈఓ కృష్ణయ్య మాట్లాడుతూ, ఆహారపు అలవాట్లు, జన్యుపరమైన కారణాల వల్ల క్యాన్సర్ ముప్పు పెరుగుతోందని హెచ్చరించారు. లక్షణాలను ముందుగానే గుర్తించి వైద్యుల సలహాలు తీసుకోవడం ద్వారా ప్రాణాపాయం నుంచి బయటపడవచ్చు. బసవతారకం ఆస్పత్రి ద్వారా పేదలకు అందుబాటులో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం. గతంలో టీకేఆర్ కళాశాల వేదికగా మొబైల్ స్క్రీనింగ్ బస్సు ద్వారా ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించామని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు టాస్క్ సీఈఓ శ్రీకాంత్ సింహ, సీఎఫ్ఓ అల్వాల్ నారాయణ, మెడికల్ ఆంకాలజిస్ట్ రాకేష్ పిన్నింటి, టీకేఆర్ విద్యా సంస్థల కార్యదర్శి హరినాథ్ రెడ్డి, కోశాధికారి అమర్నాథ్ రెడ్డి మరియు కళాశాల సిబ్బంది, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# మైక్రో ఎంట్రప్రెన్యూర్లుగా వెనుకబడిన వర్గాలు... కార్యాచరణ సిద్ధం చేయాలన్న సీఎం చంద్రబాబు

అమరావతి, ఫిబ్రవరి 4 (భారత శక్తి): వెనుకబడిన వర్గాలను (బీసీ) కేవలం సంక్షేమ లబ్ధిదారులుగా పరిమితం చేయకుండా, వారిని సూక్ష్మ పారిశ్రామికవేత్తలుగా (మైక్రో ఎంట్రప్రెన్యూర్లు), ఎంఎస్ఎంఈలుగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఇందుకు అనుగుణంగా పటిష్టమైన కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. బుధవారం సచివాలయంలో బీసీ సంక్షేమ శాఖపై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. కులవృత్తుల వారికి ఆధునిక సాంకేతికతను అందించే లక్ష్యంతో 'ఆదరణ3' పథకం ద్వారా ఆధునిక పనిముట్లను పంపిణీ చేసేందుకు వెంటనే చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. విద్యా రంగంలో బీసీ విద్యార్థులకు అత్యుత్తమ మౌలిక వసతులు కల్పించడంపై సమీక్షలో ప్రధానంగా చర్చించారు. రాష్ట్రంలో రూ.60 కోట్ల సాస్కీ (SASKI) నిధులతో కొత్తగా బీసీ రెసిడెన్షియల్ పాఠశాలలు, హాస్టళ్ల నిర్మాణాన్ని చేపట్టాలని సీఎం ఆదేశించారు. ఇప్పటికే ఉన్న 814 బీసీ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు సురక్షితమైన తాగునీరు అందించేందుకు రూ.17 కోట్ల వ్యయంతో మార్చిలోగా ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేస్తామని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. హాస్టళ్లలో పారిశుధ్యం, విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యత విషయంలో ఏమాత్రం రాజీ పడొద్దని, అత్యుత్తమ ప్రమాణాలు పాటించాలని చంద్రబాబు స్పష్టం చేశారు. విద్యార్థుల ఆరోగ్యం, విద్యాబోధన వంటి అన్ని అంశాల్లోనూ ఉత్తమ పద్ధతులను (బెస్ట్ ప్రాక్టీసెస్) అనుసరించాలని సూచించారు. విద్యార్థుల విద్యాపరమైన పురోగతిని పర్యవేక్షించేందుకు వీలుగా అపార్ (APAR) ఐడీలను నమోదు చేసి, అనుసంధానం చేయాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్మాణ దశలో ఉన్న బీసీ భవనాల పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే పేరుతో నడుస్తున్న 6 రెసిడెన్షియల్ పాఠశాలలను జూనియర్ కళాశాలల స్థాయికి అప్‌గ్రేడ్ చేయాలని నిర్ణయించారు. రాబోయే రోజుల్లో ప్రతి నియోజకవర్గంలో ఒక బీసీ రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటు చేసే ఆలోచన ఉందని ముఖ్యమంత్రి వెల్లడించారు. బీసీ స్టడీ సర్కిళ్లను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని, కూటమి ప్రభుత్వం వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని, వారికి ప్రయోజనం చేకూరేలా పథకాలు రూపొందించాలని చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

## తెలంగాణలో కొత్త విద్యుత్ కనెక్షన్ల జారీలో మార్పులు

హైదరాబాద్, ఫిబ్రవరి 4 (భారత శక్తి):తెలంగాణలో విద్యుత్ కొత్త కనెక్షన్ల జారీలో రేపటి నుంచి భారీ మార్పులు చోటు చేసుకోనున్నాయి. రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి ఇందుకోసం కొత్త మార్గదర్శకాలను జారీ చేసింది. గతంలో స్తంభాలు, లైన్స్ కోసం వినియోగదారుల నుంచి దూరాన్ని బట్టి ఒక్కో విధంగా ఫీజు వసూలు చేసేవారు. రేపటి నుంచి ఫిక్స్డ్ ఛార్జీలు ఉండనున్నాయి. గృహ విద్యుత్ కనెక్షన్లకు 1 కిలో వాట్ వరకు రూ.500 వరకు వసూలు చేస్తారు. 1 కిలో వాట్ నుంచి 5 కేవీ వరకు రూ.500 వసూలు చేస్తారు. ఆపై ప్రతి అదనపు కిలో వాట్‌కు రూ.600 చొప్పున వసూలు చేస్తారు. 5 కిలో వాట్ల నుంచి 20 కిలో వాట్ల వరకు రూ.2,900 వసూలు చేస్తారు. అక్కడ్నించి ప్రతి అదనపు కిలో వాట్‌కు రూ.1,500 చొప్పున వసూలు చేస్తారు. 20 కిలో వాట్లు ఆ పైన.. రూ.10,000 వసూలు చేయనున్నారు. వాణిజ్య కనెక్షన్లు అయితే 1 కిలో వాట్ వరకు రూ.1,000 వసూలు చేస్తారు.

## బూతుల నేతలకు పరామర్శలా? జగన్‌పై టీడీపీ నేతల ఎదురుదాడి

అమరావతి, ఫిబ్రవరి 4 (భారత శక్తి): వైసీపీ అధినేత జగన్ తీరుపై అధికార తెలుగుదేశం పార్టీ నేతలు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గుంటూరులో అంబటి రాంబాబును పరామర్శించేందుకు జగన్ చేసిన పర్యటనను ఒక డ్రామాగా అభివర్ణించారు. వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, సీడాప్ ఛైర్మన్ దీపక్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ అశోక్ బాబు... జగన్‌పై తీవ్ర విమర్శలు చేశారు.

**పరామర్శ పేరుతో డ్రామా: అచ్చెన్నాయుడు**

మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. "అసభ్యంగా బూతులు మాట్లాడిన నేతలను దండించాల్సింది పోయి, పరామర్శ పేరుతో జగన్ డ్రామాలు చేస్తున్నారు. తాడేపల్లి నుంచి గుంటూరుకు 34 కిలోమీటర్ల దూరాన్ని కేవలం 30 నిమిషాల్లో చేరుకోవచ్చు. కానీ, మునిగిపోతున్న వైసీపీని కాపాడుకునే విఫల ప్రయత్నంలో భాగంగా జగన్ ఈ ప్రయాణాన్ని 9 గంటల పాటు సాగదీశారు. తిరిగి మాత్రం అరగంటలోనే వచ్చేశారు. ఇది ప్రజాబలం లేక టీవీ సీరియల్ మాదిరి సాగదీసిన యాత్ర" అని ఎద్దేవా చేశారు. తమ పార్టీ నాయకులు అంబటి ఇంటికి వెళ్లి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తే, దానిని దాడిగా చిత్రీకరిస్తున్నారని అన్నారు. ఈ ఘటనను ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా ఖండించారని, హింసా రాజకీయాలకు తమ ప్రభుత్వంలో తావులేదని స్పష్టం చేశారు. "గత ఐదేళ్ల జగన్ జంగిల్ రాజ్ పాలనను చూసే ప్రజలు 151 సీట్ల నుంచి 11 సీట్లకు పరిమితం చేశారు. ప్రజా సమస్యలపై మాట్లాడాలంటే రోడ్లపై కాదు, దమ్ముంటే అసెంబ్లీకి రండి" అని జగన్‌కు సవాల్ విసిరారు.

*** అరాచకానికి బీజం వేసింది జగనే: వర్ల రామయ్య**

టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య మాట్లాడుతూ.. "గత ఐదేళ్లు రాష్ట్రాన్ని అరాచకమయం చేసి, ఇప్పుడు ప్రజాస్వామ్యం గురించి జగన్ మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుంది" అని తీవ్రంగా ధ్వజమెత్తారు. అసలు రాష్ట్రంలో జంగిల్ రాజ్‌కు బీజం వేసిందే జగన్ అని ఆరోపించారు. అంబటి రాంబాబు లాంటి వ్యక్తిని సౌమ్యుడని కితాబివ్వడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గతంలో చంద్రబాబును ఇంటి గేటుకు తాళ్లు కట్టి అడ్డుకోవడం, మాచర్లలో టీడీపీ నేతలపై హత్యాయత్నం, అచ్చెన్నాయుడిని అక్రమంగా అరెస్టు చేయడం వంటివి జంగిల్ రాజ్ కాదా అని ప్రశ్నించారు. కొల్లు రవీంద్ర, ధూళిపాళ్ల నరేంద్ర, దేవినేని ఉమా వంటి నేతలపై అక్రమ కేసులు బనాయించి వేధించారని గుర్తుచేశారు. చంద్రబాబు ఇంటిపై దాడికి తెగబడిన జోగి రమేశ్‌ను మంచివాడని చెప్పడం సిగ్గుచేటన్నారు.

*** 11 మందితో అసెంబ్లీకి రండి: దీపక్ రెడ్డి**

సీడాప్ ఛైర్మన్ దీపక్ రెడ్డి మాట్లాడుతూ.. "వంద ఎలుకలను తిన్న పిల్లి కాశీకి వెళ్లినట్లు ఉంది జగన్ తీరు" అని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వంలో గన్నవరం టీడీపీ ఆఫీసును తగలబెట్టడం, పట్టాభి ఇంటిపై దాడి చేసి మహిళలను భయభ్రాంతులకు గురిచేయడం, ఎంపీ రఘురామకృష్ణరాజుపై థర్డ్ డిగ్రీ ప్రయోగించడం వంటివి జంగిల్ రాజ్ కాదా? అని నిలదీశారు. "11 మంది సభ్యులు మీకు ఒక క్రికెట్ టీమ్ లాంటి వారు. అందుకే మీకు 'నెంబర్ 11 సైకో టీమ్' అని పేరు పెట్టాం. ఈ నెల 11న, 11 గంటలకు అసెంబ్లీకి వచ్చి కనీసం 11 నిమిషాల పాటు 11 ప్రశ్నలు అడిగే ధైర్యం ఉందా?" అని జగన్‌కు సవాల్ విసిరారు.

*** లడ్డూ నెయ్యిలో కల్తీ నిజం: అశోక్ బాబు**

మాజీ ఎమ్మెల్సీ అశోక్ బాబు మాట్లాడుతూ.. తిరుపతి లడ్డూ నెయ్యిలో కల్తీ జరిగిందనేది పచ్చి నిజమని స్పష్టం చేశారు. 2024 జులై 16న ఎన్డీడీబీ ఇచ్చిన రిపోర్టులో బీఫ్ ఫ్యాట్ (ఆవు/ఎద్దు కొవ్వు), లార్డ్ (పంది కొవ్వు) ఉన్నట్లు స్పష్టంగా ఉందని తెలిపారు. వైసీపీ నేతలు టెక్నికల్ అంశాల పేరుతో దీన్ని కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ వ్యవహారంపై ఎక్కడైనా, ఎప్పుడైనా బహిరంగ చర్చకు సిద్ధమని వైసీపీకి సవాల్ విసిరారు. జగన్ రిపోర్టులు చదవకుండా మాట్లాడటం ఆయన అపరిపక్వతకు నిదర్శనమని విమర్శించారు.

## రెండున్నర గంటలపాటు సాగిన చంద్రబాబు, పవన్ సమావేశం

అమరావతి, ఫిబ్రవరి 4 (భారత శక్తి): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మధ్య అమరావతిలో జరిగిన కీలక భేటీ ముగిసింది. ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసంలో ఈ సమావేశం సుమారు రెండున్నర గంటల పాటు కొనసాగింది. రాష్ట్రంలో తాజా రాజకీయ పరిణామాలు, కూటమి పక్షాల మధ్య సమన్వయం, భవిష్యత్ కార్యాచరణ వంటి అనేక కీలక అంశాలపై ఇరువురు నేతలు సుదీర్ఘంగా చర్చించారు. ప్రధానంగా, వైసీపీ అనుసరిస్తున్న వైఖరి పైనే ఈ సమావేశంలో ఎక్కువగా చర్చ జరిగినట్లు తెలుస్తోంది. కుల రాజకీయాలను రెచ్చగొట్టడం ద్వారా వైసీపీ లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తోందని, ఆ పార్టీ పన్నుతున్న వ్యూహాలను సమర్థవంతంగా ఎదుర్కోవాలని ఇరువురు నేతలు నిర్ణయించుకున్నారు. వైసీపీ ట్రాప్‌లో పడకుండా కూటమి శ్రేణులను అప్రమత్తం చేసేందుకు ఉమ్మడి వ్యూహంతో ముందుకు సాగాలని తీర్మానించుకున్నారు. క్షేత్రస్థాయిలో టీడీపీ, జనసేన కార్యకర్తల మధ్య వైసీపీ చిచ్చు పెట్టేందుకు ప్రయత్నిస్తోందని, అందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఇరువురు నేతలు ఓ అభిప్రాయానికి వచ్చారు. ఈ భేటీలో రాజకీయ అంశాలతో పాటు పరిపాలనాపరమైన విషయాలు కూడా ప్రస్తావనకు వచ్చాయి. త్వరలో ఖాళీ కానున్న నాలుగు రాజ్యసభ స్థానాల భర్తీపై నేతలు ప్రాథమికంగా చర్చించినట్లు సమాచారం. అలాగే, చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియను వేగవంతం చేయాలని కూడా నిర్ణయించినట్లు తెలుస్తోంది. వివిధ కార్పొరేషన్లకు ఛైర్మన్లతో పాటు డైరెక్టర్ల నియామకంపై కూడా సమాలోచనలు జరిపారు. టీడీపీ, జనసేన, బీజేపీ మధ్య క్షేత్రస్థాయిలో సమన్వయం మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ఈ సమావేశంలో అభిప్రాయానికి వచ్చినట్లు తెలుస్తోంది. తిరుమల లడ్డూ ప్రసాదం వంటి అంశాలపై వైసీపీ సోషల్ మీడియాలో చేస్తున్న విష ప్రచారాన్ని సమష్టిగా తిప్పికొట్టాలని, ఇందుకోసం కూటమిలోని మూడు పార్టీల నేతలు కలిసి ఉమ్మడి మీడియా సమావేశాలు నిర్వహించాలని పవన్ సూచించినట్లు సమాచారం. రాబోయే 15 ఏళ్లు కూటమే అధికారంలో కొనసాగేలా పటిష్టమైన భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకోవాలనే దిశగా కూడా వీరి మధ్య చర్చలు సాగినట్లు తెలుస్తోంది. నిన్న కేబినెట్ భేటీకి ముందు చంద్రబాబు, పవన్ క్లుప్తంగా మాట్లాడుకున్నప్పటికీ, అన్ని అంశాలపై విపులంగా చర్చించేందుకు ఈరోజు ప్రత్యేకంగా భేటీ అయ్యారు.

## కేసీఆర్.. నువ్వేలా జాతిపిత అవుతావు?: రేవంత్ రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 4 (భారత శక్తి): "భార్యాభర్తలు మాట్లాడుకుంటే దొంగచాటుగా విన్న సన్నాసివి, నువ్వేలా జాతిపిత అవుతావు?" అని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ కేసును ఉద్దేశించి ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు. నల్గొండ జిల్లా మిర్యాలగూడలో బుధవారం జరిగిన 'ప్రజా పాలన ప్రగతిబాట' భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా కేసీఆర్ కుటుంబంపై, బీఆర్ఎస్ నేతలపై నిప్పులు చెరిగారు. కొంతమంది 'జాతిపిత'ను విచారిస్తారా అని అడుగుతున్నారని, అసలు "ఎవరికిరా నువ్వు జాతిపిత? నీ జాతికి నువ్వు పిత కావొచ్చు.. మాకు కాదు" అని రేవంత్ రెడ్డి అన్నారు. "ఆంధ్రప్రదేశ్‌లో పార్టీ మొత్తం కనుమరుగైనా తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన సోనియమ్మ తెలంగాణ తల్లి అవుతుంది. తెలంగాణ కోసం సర్వం త్యాగం చేసిన ప్రొఫెసర్ జయశంకర్ జాతిపిత అవుతాడు. లు*, సన్నాసి, దొంగ అయిన నువ్వేలా జాతిపిత అవుతావు?" అంటూ కేసీఆర్‌ను ఉద్దేశించి తీవ్ర పదజాలంతో విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్ అంశంపై మాట్లాడుతూ.. "అన్నం తినేవాళ్లు ఎవరైనా భార్యాభర్తలు మాట్లాడుకుంటే వింటారా? సిగ్గుతో తలదించుకోవాలి. నిజానికి కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు ముఖాలకు ముసుగులు తొడిగి పోలీసులు విచారణకు తీసుకురావాల్సింది" అని వ్యాఖ్యానించారు. తాము జాతిపిత అయితే కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్‌హౌస్, కేటీఆర్ జన్వాడ ఫామ్‌హౌస్, హరీశ్‌రావు మొయినాబాద్ ఫామ్‌హౌస్‌లతో పాటు వేల కోట్ల ఆస్తులను తెలంగాణ ప్రజలకు రాసిస్తారా అని సవాల్ విసిరారు. తెలంగాణ ఉద్యమకారుడు శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మకు కనీసం చిన్న పదవి కూడా ఇవ్వలేదని ఆరోపించారు.

*** స్థానిక నేతపై విమర్శలు, అభివృద్ధి పనులకు శ్రీకారం**

సభకు ముందు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మిర్యాలగూడలో రూ.200 కోట్లతో నిర్మించ తలపెట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు శంకుస్థాపన చేశారు. అనంతరం మహిళా సంఘాలకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే భాస్కర్ రావును 'నమ్మకద్రోహి', 'నక్క జిత్తుల వ్యక్తి' అని అభివర్ణించారు. "జానారెడ్డి చెప్పులు, నీళ్లసీసాలు మోసిన భాస్కర్‌రావు, ఎమ్మెల్యేగా గెలిచాక ఆత్మగౌరవాన్ని ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కేసీఆర్ పాదాల దగ్గర పెట్టాడు. అలాంటి వ్యక్తికి మళ్లీ ఓటేస్తారా? గంగిరెద్దుల్లా ఓట్లు అడగడానికి వస్తే కర్రు కాల్చి వాత పెట్టండి" అని ప్రజలకు పిలుపునిచ్చారు.

*** ప్రభుత్వ పథకాలే గెలిపిస్తాయి**

తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి మున్సిపల్ ఎన్నికల్లో తీర్పు ఇవ్వాలని ప్రజలను కోరారు. "పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదు. మేము లక్షలాది కార్డులిచ్చి సన్న బియ్యం అందిస్తున్నాం. ప్రతి ఇంటికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రైతులకు ఎకరానికి రూ.6 వేల రైతు భరోసా, రూ.500 బోనస్‌తో పాటు రుణమాఫీ చేశాం. 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశాం" అని ప్రభుత్వ విజయాలను వివరించారు. ఓటు వేసే ముందు ఈ పథకాలన్నింటినీ గుర్తు చేసుకోవాలని కోరారు. మున్సిపల్ శాఖ తన వద్దే ఉందని, కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే పట్టణాలను అద్దంలా తీర్చిదిద్దే బాధ్యత తనదని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎంపీ రఘువీర్ రెడ్డి, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

## తెలుగు రాష్ట్రాల్లో భారీగా ఎయిడ్స్ మరణాలు.. ఐటీ రంగంలో విస్తరిస్తున్న హెచ్ఐవీ

ఫిబ్రవరి 4 (భారత శక్తి):ఏపీ, తెలంగాణల్లో ఎయిడ్స్ మరణాలు ఆందోళనకర స్థాయిలో ఉన్నాయి. గత ఐదేళ్లలో హెచ్ఐవీ బారిన పడి మరణించిన వారి సంఖ్య ఆందోళన కలిగిస్తోంది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన గణాంకాల ప్రకారం... 20202024 మధ్య కాలంలో దేశ వ్యాప్తంగా 1.81 లక్షల మంది హెచ్ఐవీ కారణంగా చనిపోయారు. వీరిలో తెలుగు రాష్ట్రాల్లో మరణించిన వారి సంఖ్య 44,140గా ఉంది. ఏపీలో 32,642 మంది చనిపోగా... తెలంగాణలో 11,498 మంది మృతి చెందారు. మరో షాకింగ్ విషయం ఏమిటంటే... ఐటీ రంగంలో హెచ్ఐవీ వైరస్ విస్తృతంగా వ్యాపిస్తోంది. ఈ విషయాన్ని జాతీయ ఎయిడ్స్ నియంత్రణ వ్యవస్థ వెల్లడించింది. విదేశీ తరహా జీవనశైలికి అలవాటు పడటం ఐటీ రంగంలో హెఐవీ వ్యాప్తి కావడానికి కారణమవుతోందని తెలిపింది. ఈ రంగంలో హెచ్ఐవీ పరీక్షల సంఖ్యలను పెంచాల్సి ఉందని సూచించింది.

## తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ తరపున పవన్ కల్యాణ్ ప్రచారం

హైదరాబాద్, ఫిబ్రవరి 4 (భారత శక్తి): తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల హడావుడి జోరందుకుంది. అన్ని పార్టీలు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ముఖ్యంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు వీలైనన్ని ఎక్కువ స్థానాలను గెలుచుకునే లక్ష్యంతో వ్యూహాలకు పదును పెడుతున్నాయి. ఈ తరుణంలో బీజేపీ కీలక ప్రకటన చేసింది. బీజేపీకి జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మద్దతు ప్రకటించారని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు ప్రకటించారు. పవన్ కల్యాణ్ తో తాను, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సమావేశమయినట్టు రాంచందర్ రావు ఎక్స్ వేదికగా తెలిపారు. తెలంగాణ మున్సిపల్ ఎన్నికలతో పాటు పలు కీలక అంశాలపై తమ మధ్య చర్చ జరిగిందని వెల్లడించారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీకి పవన్ పూర్తి మద్దతు ప్రకటించారని... బీజేపీ తరపున ప్రచారం చేయడానికి అంగీకరించారని పేర్కొన్నారు. పవన్ మద్దతు తెలంగాణ బీజేపీకి తిరుగులేని బలాన్ని, వేగాన్ని ఇస్తుందని అన్నారు.

## 2.5 కోట్ల ఆధార్ కార్డులను డీయాక్టివేట్ చేసిన కేంద్రం

ఢిల్లీ, ఫిబ్రవరి 4 (భారత శక్తి): గుర్తింపు మోసాలను అరికట్టే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. దేశవ్యాప్తంగా మరణించిన 2.5 కోట్లకు పైగా వ్యక్తుల ఆధార్ నంబర్లను డీయాక్టివేట్ చేసినట్లు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద బుధవారం పార్లమెంటుకు తెలిపారు. ఆధార్ డేటాబేస్ కచ్చితత్వాన్ని, సమగ్రతను కాపాడేందుకు దేశవ్యాప్తంగా చేపట్టిన శుద్ధీకరణ కార్యక్రమంలో భాగంగా ఈ చర్యలు తీసుకున్నట్లు ఆయన వివరించారు. ప్రపంచంలోనే అతిపెద్ద బయోమెట్రిక్ గుర్తింపు వ్యవస్థ అయిన ఆధార్ సుమారు 134 కోట్ల మంది వినియోగదారులను కలిగి ఉంది. మరణించిన వారి ఆధార్ నంబర్లను దుర్వినియోగం చేసి సంక్షేమ పథకాలను పొందడం, ఇతర మోసాలకు పాల్పడటం వంటివి నిరోధించడానికి ఈ డీయాక్టివేషన్ ప్రక్రియ చాలా అవసరమని మంత్రి పేర్కొన్నారు. ఆధార్ దుర్వినియోగాన్ని తగ్గించడానికి భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (UIDAI) అనేక భద్రతా చర్యలు తీసుకుంటున్నట్లు జితిన్ ప్రసాద తెలిపారు. ఇందులో భాగంగా వినియోగదారులు తమ బయోమెట్రిక్స్‌ను లాక్/అన్‌లాక్ చేసుకునే సదుపాయం, లావాదేవీల సమయంలో లబ్ధిదారు భౌతికంగా ఉన్నట్లు నిర్ధారించే 'లైవ్‌నెస్ డిటెక్షన్' ఫీచర్‌తో కూడిన ఫేస్ అథెంటికేషన్, ఆధార్ సెక్యూర్ క్యూఆర్ కోడ్, ఆఫ్‌లైన్ ఈకేవైసీ వంటివి అందుబాటులోకి తెచ్చినట్లు వివరించారు. వినియోగదారుల ప్రధాన బయోమెట్రిక్ సమాచారాన్ని యూఐడీఏఐ ఎవరితోనూ పంచుకోదని, డేటాను ఎన్‌క్రిప్టెడ్ ఫార్మాట్‌లో భద్రపరచడం తప్పనిసరి చేసిందని ఆయన స్పష్టం చేశారు.

## అండర్19 వరల్డ్ కప్... ఫైనల్లోకి దూసుకెళ్లిన టీమిండియా... ఇంగ్లండ్ తో అమీతుమీకి సై

ఢిల్లీ, ఫిబ్రవరి 4 (భారత శక్తి): అండర్ 19 ప్రపంచకప్‌లో భారత యువ జట్టు అదరగొట్టింది. రికార్డు స్థాయి ఛేజింగ్ తో ఫైనల్లోకి దూసుకెళ్లింది. బుధవారం హరారే స్పోర్ట్స్ క్లబ్ వేదికగా జరిగిన రెండో సెమీ ఫైనల్లో ఆఫ్ఘనిస్థాన్‌పై 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఓపెనర్ ఆరోన్ జార్జ్ (115) అద్భుతమైన సెంచరీతో చెలరేగగా, విధ్వంసకర హాఫ్ సెంచరీలతో వైభవ్ సూర్యవంశీ, కెప్టెన్ ఆయుష్ మాత్రే జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. ఫిబ్రవరి 6న ఇదే వేదికపై జరగనున్న ఫైనల్లో భారత్, ఇంగ్లండ్‌తో తలపడనుంది. ఆఫ్ఘనిస్థాన్ నిర్దేశించిన 311 పరుగుల భారీ లక్ష్యాన్ని భారత్ కేవలం 41.1 ఓవర్లలో 3 వికెట్లు మాత్రమే కోల్పోయి ఛేదించింది. ఈ టోర్నీలో ఇప్పటివరకు పెద్దగా రాణించని ఆరోన్ జార్జ్, కీలకమైన సెమీస్‌లో బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. 104 బంతుల్లో 15 ఫోర్లు, 2 సిక్సర్లతో 115 పరుగులు చేసి జట్టు విజయాన్ని ఖాయం చేశాడు. మరో ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ (33 బంతుల్లో 68) మెరుపు ఇన్నింగ్స్‌తో శుభారంభం అందించాడు. ఫీల్డర్లు రెండుసార్లు క్యాచ్‌లు జారవిడిచిన అవకాశాన్ని సూర్యవంశీ చక్కగా సద్వినియోగం చేసుకున్నాడు. అనంతరం కెప్టెన్ ఆయుష్ మాత్రే (39 బంతుల్లో 62) కూడా వేగంగా ఆడి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. భారత ఛేదనలో భాగస్వామ్యాలు కీలక పాత్ర పోషించాయి. తొలి వికెట్‌కు జార్జ్, సూర్యవంశీ 90 పరుగులు జోడించగా, రెండో వికెట్‌కు జార్జ్, కెప్టెన్ మ్హాత్రే కలిసి 114 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. ఇక మూడో వికెట్‌కు విహాన్ మల్హోత్రా (47 బంతుల్లో 38 నాటౌట్)తో కలిసి జార్జ్ మరో 96 పరుగుల అజేయ భాగస్వామ్యం నెలకొల్పి జట్టును విజయ తీరాలకు చేర్చాడు. అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆఫ్ఘనిస్థాన్, నిర్ణీత 50 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 310 పరుగుల భారీ స్కోరు సాధించింది.

# నిబంధనలు గాలికి.. అక్రమ నిర్మాణమే 'లక్ష్యం'!

- నాగోల్-బండ్లగూడ ప్రధాన రహదారిపై వెలుస్తున్న భారీ వాణిజ్య షెడ్.
- ఫిర్యాదులు చేసినా పట్టించుకోని టౌన్ ప్లానింగ్ అధికారులు
- 'హైడ్రా' కమిషనర్ రంగనాథ్ జోక్యం చేసుకోవాలని స్థానికుల విజ్ఞప్తి












నాగోల్, ఫిబ్రవరి 4 (భారత శక్తి): చట్టం తన పని తాను చేసుకుపోతుందన్నది నానుడి. కానీ, నాగోల్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారుల తీరు చూస్తుంటే.. 'ముడుపులు అందితే చట్టం కళ్లు మూసుకుంటుంది' అనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నాగోల్ నుంచి బండ్లగూడ వెళ్లే ప్రధాన రహదారిపై, మోర్ సూపర్ మార్కెట్ సరిగ్గా ఎదురుగా నిబంధనలకు విరుద్ధంగా ఒక భారీ వాణిజ్య షెడ్ నిర్మాణమవుతోంది. ఎలాంటి జిహెచ్ఎంసి అనుమతులు లేకుండా, కనీస ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించకుండా సాగుతున్న ఈ అక్రమ నిర్మాణం ఇప్పుడు స్థానికంగా పెను చర్చకు దారితీసింది. ప్రాథమిక దశలో వ్రాతపూర్వక ఫిర్యాదులు చేసినా చర్యలు తీసుకోకపోవడం వెనుక అంతర్యం ఏమిటో పని స్థానిక జనం ముక్కున వేలు వేసుకుంటున్నారు..

*** అధికారుల అండతోనే అక్రమ నిర్మాణం?**

ఈ నిర్మాణం ప్రాథమిక దశలో ఉన్నప్పుడే స్థానిక ప్రజలు సంబంధిత అధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదులు చేశారు. అయితే, చర్యలు తీసుకోవాల్సిన అధికారులు క్షేత్రస్థాయిలో నిర్మాణాన్ని అడ్డుకోకపోగా, పరోక్షంగా సహకరించారన్న ఆరోపణలు వస్తున్నాయి. ప్రస్తుతం ఈ నిర్మాణం పూర్తి కావడమే కాకుండా, ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధమైంది. జీహెచ్ఎంసీ ఎల్బీనగర్ జోన్ అధికారులు, నాగోల్ సర్కిల్ అధికారులు, డిప్యూటీ కమిషనర్ రవీందర్ రెడ్డి, టిపిఎస్ సోమేశ్ కుమార్, సిటీ ప్లానర్ శ్రీనివాస్ యాదవ్ వంటి వారు ఈ అక్రమ నిర్మాణంపై ఎందుకు ఉదాసీనంగా ఉన్నారనేది ఇప్పుడు మిస్టరీగా మారింది. అక్రమ నిర్మాణదారుడి నుంచి భారీగా ముడుపులు అందడం వల్లే అధికారులు మౌనం వహిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ ఐఏఎస్ దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని స్థానిక జనం విజ్ఞప్తి చేస్తున్నారు.

*** ప్రాణాల మీదకు తెచ్చే ప్రమాదం..**

వాణిజ్య అవసరాల కోసం నిర్మిస్తున్న ఈ భారీ గిడ్డంగిలో అగ్నిమాపక నిబంధనలు పాటించకపోవడం గమనార్హం. భవిష్యత్తులో ఏదైనా అగ్నిప్రమాదం సంభవిస్తే.. చుట్టుపక్కల ఉన్న జనసంచారానికి, ఆస్తులకు భారీ నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. గతంలో జరిగిన అగ్నిప్రమాదాల నుంచి పాఠాలు నేర్చుకోవాల్సిన అధికారులు, ఇలాంటి అక్రమ కట్టడాలకు వత్తాసు పలకడం విస్మయానికి గురిచేస్తోంది.

*** హైడ్రా కమిషనర్ రంగనాథ్ దృష్టి సారిస్తారా?**

నగరంలో అక్రమ కట్టడాల విషయంలో ఉక్కుపాదం మోపుతున్న 'హైడ్రా' కమిషనర్ రంగనాథ్ ఈ విషయంపై దృష్టి సారించాలని నాగోల్ బండ్లగూడ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ ఐఏఎస్ మరియు జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ లు తక్షణమే స్పందించి, బాధ్యులైన అధికారులపై విచారణ జరిపి, ఈ అక్రమ షెడ్డును తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రాణ నష్టం జరగకముందే యంత్రాంగం మేల్కొంటుందో లేదో వేచి చూడాలి.

# వేసవి దృష్ట్యా నగరవ్యాప్తంగా హైడ్రా అవగాహన కార్యక్రమాలు

*** నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు: కమిషనర్ ఏవీ రంగనాథ్ హెచ్చరిక.**



హైదరాబాద్, ఫిబ్రవరి 4 (భారత శక్తి) : ఎండకాలం సమీపిస్తున్న తరుణంలో నగరంలో అగ్నిప్రమాదాల నివారణపై హైడ్రా దృష్టి సారించింది. నిప్పురవ్వ చిన్నదైనా భారీ ఆస్తి, ప్రాణ నష్టానికి దారితీసే ప్రమాదం ఉన్నందున, ప్రతి ఒక్కరూ స్వీయ నియంత్రణతో అప్రమత్తంగా ఉండాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సూచించారు. ఇప్పటికే నగరంలోని పలు వ్యాపార సముదాయాల్లో తనిఖీలు చేపట్టిన హైడ్రా, నిబంధనలు పాటించని కొన్ని షాపులను సీజ్ చేసింది. వ్యాపార సంఘాల విజ్ఞప్తి మేరకు లోపాలను సరిదిద్దుకోవడానికి ఫిబ్రవరి నెలాఖరు వరకు గడువు ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ గడువులోగా భద్రతా ప్రమాణాలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు స్పష్టం చేశారు.

**అవగాహనతోనే భద్రత:**

అగ్ని ప్రమాదాల నివారణపై నగరవ్యాప్తంగా సంబంధిత శాఖలతో కలిసి హైడ్రా పెద్ద ఎత్తున మాక్ డ్రిల్స్, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. వ్యాపారులు, నివాసితులు పాటించాల్సిన ముఖ్యమైన సూచనలు ఇవే:

**1. సెల్లార్లలో నిల్వలు వద్దు:**

సెల్లార్లను కేవలం వాహనాల పార్కింగ్ కోసమే వినియోగించాలి. వాటిని గోదాములుగా మార్చి వస్తువులు నిల్వ చేయడం, గ్రిల్స్ వేసి తాళాలు వేయడం చట్టరీత్యా నేరం. సెల్లార్లలో చెత్త పేరుకుపోకుండా చూడాలి. అక్కడ వాచ్‌మెన్ నివాసాలు ఉండకూడదు. వంట చేయడం, క్యాంటీన్ల నిర్వహణ వంటివి అగ్ని ప్రమాదాలకు ప్రధాన కారణమవుతున్నాయి.

**2. దారులను ఖాళీగా ఉంచాలి:**

అగ్ని ప్రమాదం జరిగినప్పుడు అత్యవసరంగా బయటకు వెళ్లే దారులు (Exit Routes), ర్యాంపులు, మెట్ల మార్గాల్లో వస్తువులను అడ్డుగా పెట్టకూడదు. ప్రమాద సమయంలో లిఫ్టులను వాడకూడదు కాబట్టి, మెట్ల మార్గం ఎప్పుడూ అందుబాటులో ఉండాలి. ఎగ్జిట్ బోర్డులను స్పష్టంగా కనిపించేలా ఏర్పాటు చేయాలి.

**3. విద్యుత్ భద్రతే ముఖ్యం:**

ఐఎస్‌వో (ISO) గుర్తింపు పొందిన విద్యుత్ వైర్లు, స్విచ్ బోర్డులనే వాడాలి. పాతబడిన వైరింగ్‌ను ఎప్పటికప్పుడు తనిఖీ చేయించుకోవాలి. విద్యుత్ సర్క్యూట్‌లపై ఓవర్‌లోడ్ పడకుండా చూసుకోవాలి. ప్యానల్ బోర్డుల వద్ద నిప్పురవ్వలు పడినా ప్రమాదం జరగకుండా కంకరతో కూడిన ప్రత్యేక చాంబర్లు నిర్మించాలి.

**4. రక్షణ పరికరాల ఏర్పాటు:**

ప్రతి వ్యాపార సముదాయంలో స్మోక్ డిటెక్టర్లు, వాటర్ స్ప్రింక్లర్లు, ఫైర్ ఎక్సి గ్విషర్లు తప్పనిసరిగా ఉండాలి. ఈ పరికరాలు సరిగ్గా పనిచేస్తున్నాయో లేదో ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలి. సిబ్బందికి వాటిని వాడటంలో అవసరమైన శిక్షణ ఇవ్వాలి.

**ఫిర్యాదు చేయండిలా..**

మీ పరిసరాల్లో ఎక్కడైనా అగ్ని భద్రతా నిబంధనలు ఉల్లంఘిస్తున్నట్లు గమనిస్తే వెంటనే హైడ్రా కంట్రోల్ రూమ్ నంబరు 9000113667 కు ఫోటోలు, వీడియోలు లేదా లొకేషన్‌ను పంపాలని కమిషనర్ కోరారు. ఏదైనా ప్రమాదం జరిగితే తక్షణ సహాయం కోసం 101 నంబరుకు ఫోన్ చేయాలని సూచించారు.

# 13వ వార్డు కాంగ్రెస్ ప్రచారానికి అపూర్వ స్పందన

- ప్రచారంలో ముందంజలో కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థి. బొడ్డుపల్లి పరుశురాం.



వనపర్తి జిల్లా , ఫిబ్రవరి 4 (భారత శక్తి): మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ప్రచారాలు జోరుగా జరుగుతున్నాయి.అందులో భాగంగా మున్సిపాలిటీలోని 13 వ వార్డులో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన కాంగ్రెస్ అభ్యర్థి బొడ్డుపల్లి పరుశురాం ప్రచారానికి అపూర్వ స్పందన వచ్చింది.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉందని కాంగ్రెస్ ప్రభుత్వం వల్ల మున్సిపాలిటీలోని వార్డుల్లో మరింత అభివృద్ధి జరుగుతుందని ప్రజలకు వివరించారు.స్థానిక ఎమ్మెల్యే మేఘా రెడ్డి, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నా రెడ్డిల సహకారంతో 13వ వార్డును రెట్టింపు అభివృద్ధి చేస్తానని తెలిపారు. మున్సిపాలిటీ ఎన్నికల్లో మీ అమూల్యమైన ఓటు వేసి గెలిపిస్తే వార్డును అభివృద్ధి చేయడానికి తను శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. మాజీ మున్సిపల్ చైర్మెన్.పుట్టపాకల మహేష్ , కాంగ్రెస్‌నాయకులుఅవులశ్రీనివాసులు,కాగితాలశ్రీనివాసులు,సత్యనారాయణ,ఇంతియాజ్, మధు రెడ్డి , పుట్ట రవి, స్వామి,భరత్,ప్రవీణ్,వినోద, శివ, అనిల్, సమీర్, భాను, వెంకటన, ప్రశాంత్, సాయి, శిదర్ తదితరులువున్నారు._

# చెరువుల పునరుద్ధరణే లక్ష్యం: క్షేత్రస్థాయిలో హైడ్రా కమిషనర్ పర్యవేక్షణ



హైదరాబాద్, ఫిబ్రవరి 4 (భారత శక్తి): నగరంలోని చెరువుల పరిరక్షణ, ఆక్రమణల తొలగింపుపై హైడ్రా (HYDRAA) తన కార్యాచరణను ముమ్మరం చేసింది. 'ప్రజావాణి'లో వచ్చిన ఫిర్యాదులపై స్పందించిన హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ బుధవారం పలు ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పర్యటన చేపట్టారు. కూకట్‌పల్లి, నిజాంపేట పరిధిలోని కాముని చెరువు, తుర్క చెరువులతో పాటు ప్రభుత్వ భూముల స్థితిగతులను ఆయన స్వయంగా పరిశీలించారు.

**కాముని చెరువుకు మహర్దశ:**

భరత్‌నగర్ హైటెక్ సిటీ ప్రధాన రహదారి పక్కనే ఉన్న కాముని చెరువు దుస్థితిపై స్థానికుల నుంచి పెద్దఎత్తున ఫిర్యాదులు అందాయి. మురుగునీరు చేరడం, గుర్రపుడెక్క పేరుకుపోవడంతో పరిసర ప్రాంతాల్లో దోమల బెడద అధికమైందని ప్రజలు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. చెరువు ఇన్‌లెట్లు, ఔట్‌లెట్లను పరిశీలించిన కమిషనర్, తక్షణమే గుర్రపుడెక్క తొలగించి అభివృద్ధి పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. చుట్టుపక్కల ఉన్న ఆక్రమణలపై సర్వే నిర్వహించి, నివేదిక సమర్పించాలని సూచించారు.

**తుర్క చెరువు అభివృద్ధికి ప్రణాళిక**

నిజాంపేట పరిధిలోని తుర్క చెరువు (43.50 ఎకరాలు) అభివృద్ధికి హైడ్రా సమగ్ర ప్రణాళిక సిద్ధం చేసింది.

* ఎస్టీపీల ఏర్పాటు: చెరువులోకి మురుగునీరు చేరకుండా సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లను (STP) నిర్మించనున్నారు.

* సుందరీకరణ: పూడిక తీత అనంతరం వాకింగ్ ట్రాక్‌లు, ప్లే ఏరియాలు, పార్కుల ఏర్పాటుకు చర్యలు తీసుకోనున్నారు.

అదేవిధంగా, భవ్య కన్స్ట్రక్షన్ సంస్థ సీఎస్ఆర్ (CSR) నిధులతో చేపట్టిన ఎల్లమ్మ కుంట అభివృద్ధి పనులను కమిషనర్ పరిశీలించారు. చెరువు ఎఫ్టీఎల్ (FTL) పరిధిని స్పష్టంగా నిర్ధారించి, పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు.

**భూ వివాదాలు - ఆక్రమణలపై ఆరా**

చెరువుల అభివృద్ధి మాత్రమే కాకుండా, ప్రభుత్వ భూముల పరిరక్షణపై కూడా హైడ్రా దృష్టి సారించింది:

* ఖైతలాపూర్: జలమండలికి, స్థానిక గ్రేవ్‌యార్డుకు మధ్య ఉన్న స్థల వివాదాన్ని కమిషనర్ పరిశీలించారు. ప్రభుత్వ భూమి లభ్యతను బట్టి ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని అధికారులకు స్పష్టం చేశారు.

* శిల్పా బృందావన్ కాలనీ: ప్రభుత్వ భూమిని ఆక్రమించి లేఅవుట్‌లో మార్పులు చేసినట్లు వచ్చిన ఫిర్యాదుపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. సర్వే నిర్వహించి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు.

* ప్రగతినగర్: చెరువు పరిసరాల్లో ఉన్న మాంసం, చేపల దుకాణాల తరలింపు ప్రక్రియను పర్యవేక్షించారు. త్వరలోనే ఇక్కడ అభివృద్ధి పనులు ప్రారంభిస్తామని వెల్లడించారు.

నగర జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు చెరువులు, పార్కులు, ప్రజా అవసరాల కోసం కేటాయించిన స్థలాలను కాపాడటమే తమ ప్రాధాన్యతని ఈ సందర్భంగా అధికారులు స్పష్టం చేశారు. కమిషనర్ పర్యటనలో స్థానిక కాలనీ వాసులు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు పాల్గొని తమ సమస్యలను విన్నవించారు.

# మహిళా పోలీసు సిబ్బందికి ప్రత్యేకంగా విశ్రాంతి గది ప్రారంభం

* జిల్లా లో మహిళల భద్రతకు, రక్షణకు మొదటి ప్రాధాన్యత

* రికార్డుల నవీకరణ ఎప్పటికప్పుడు జరగాలని సూచన: జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్.



ఆదిలాబాద్ జిల్లా, ఫిబ్రవరి 04 (భారత శక్తి): జిల్లాలో మహిళల భద్రత, రక్షణ చర్యలు పటిష్టంగా నిర్వహిస్తున్నట్లు, జిల్లా పోలీసు యంత్రాంగం మహిళల రక్షణకు మొదటి ప్రాధాన్యతను కేటాయిస్తుందని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్ తెలిపారు. ఈరోజు ఇచ్చోడ పోలీస్ స్టేషన్ నందు మహిళా పోలీసు సిబ్బంది నిత్యవసర పనుల నిమిత్తం ప్రత్యేకంగా నూతన గదిని జిల్లా ఎస్పీ శాస్త్రోక్తంగా, వేద మంత్రోచరణల నడుమ ప్రత్యేకంగా మహిళా కానిస్టేబుల్ చే రిబ్బన్ కట్ చేపించి నూతన గదిని ప్రారంభించారు. అదేవిధంగా సిబ్బంది విశ్రాంతికి పురుషులకై ప్రత్యేకంగా మరొక విశ్రాంతి గదిని సైతం జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన ఐపిఎస్ మరియు ఇచ్చోడ సిఐ బండారి రాజు కలిసి ప్రారంభించారు. మహిళల రక్షణకై షీ టీం 24 గంటలు అందుబాటులో ఉంటూ రక్షణ చర్యలను చేపడుతున్నట్టు తెలిపారు. మహిళలు, చిన్నారుల భద్రతకై *షీటీం* ఆధ్వర్యంలో పోలీసు అక్క ప్రారంభించి చిన్నారులకు మరింత దగ్గర అయిందని, మహిళల పట్ల జరుగు నేరాలపై పాఠశాలలు కళాశాలలు గ్రామ గ్రామాల మహిళలకు అవగాహన సదస్సులు నిర్వహిస్తూ చైతన్య పరిచయం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా ఇచ్చోడ పోలీస్ స్టేషన్ ను పరిశీలించి రికార్డుల నవీకరణ ఎప్పటికప్పుడు చేయాలని, ఎలాంటి పెండెన్సీ లేకుండా బాధితుల సమస్యల పట్ల బాధ్యతయుతంగా వ్యవహరిస్తూ సిబ్బందిని కేటాయించి సమస్యల పరిష్కరించాలని తెలిపారు. పెండింగ్లో ఉన్న కేసులు దర్యాప్తును పూర్తి చేసి కోర్టులలో చార్జిషీట్ దాఖలు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ ఇచ్చోడా సీఐ బండారి రాజు, ఎస్ఐ రమేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బైంసాలో శాంతి భద్రతలపై ఆకస్మిక తనిఖీలు పట్టణ సీఐ సాయికుమార్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 04 (భారత శక్తి): బైంసా పట్టణంలో మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని శాంతి భద్రతలను మరింత కట్టుదిట్టం చేశారు. మంగళవారం రాత్రి బైంసా ఏఎస్పీ రాజేష్ మీనా ఆకస్మికంగా పట్టణంలో పర్యటించి శాంతి భద్రతలకు సంబంధించి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పోలీస్ పికెట్లను, నామినేషన్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. అలాగే విధుల్లో ఉన్న పెట్రోలింగ్ పోలీసు అధికారులను కలుసుకుని, ఎన్నికల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని,



ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ తనిఖీల్లో బైంసా పట్టణ సీఐ సాయికుమార్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీస్ శాఖ అన్ని ఏర్పాట్లు చేస్తోందని అధికారులు తెలిపారు.

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.